గోన గన్నారెడ్డి
రూ॥ 230/-
పేజీలు: 266




ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★


రాజ్యసభలో వందేమాతరంపై చర్చ...
## షా, ఖర్గే మధ్య మాటల యుద్ధం
బుజ్జగింపు రాజకీయాల కోసం గేయాన్ని విభజించారు : షా ● ఆ తీర్మానాన్ని నెహ్రూ ఒంటరిగా చేయలేదు : ఖర్గే
05


సంపుటి 09, సంచిక: 14 | బుధవారం | 10-12-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00






“రాబోయే రెండు దశాబ్దాల్లో రాష్ట్రాన్ని సమగ్రంగా, సమ్మిళితంగా, సుస్థిరంగా అభివృద్ధి చేసే దిశగా భవిష్యత్తుకు బాటలు వేసే దార్శనిక పత్రం తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపుదిద్దుకుంది.”

# అట్టడుగు వర్గాల పేదల అభివృద్ధికే

## తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించాం

● ప్రతి పేదకూ సంక్షేమం అందించాలన్నదే మా తపన ● పేదరిక నిర్మూలన, నాణ్యమైన విద్య, ఉపాధి కల్పన సంకల్పంతో సాగుతున్నాం ● విద్య, నీటిపారుదల రంగం, కమ్యూనికేషన్ నినాదంతో ముందుకెళ్తున్నాం ● స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం తెలంగాణ ఎదురుచూస్తోంది ● భారత్ ఫ్యూచర్ సిటీలో 2047 విజన్ డాక్యుమెంట్ విడుదలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

అట్టడుగు వర్గాల పేదల అభివృద్ధి కోసమే ‘తెలంగాణ రైజింగ్–2047 విజన్ డాక్యుమెంట్’ అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు. పేదల కష్టాలు తెలిసినవాడిగా ప్రతీ పేదవాడికి సంక్షేమం అందించాలన్నదే తన తపన అని, పేదరిక నిర్మూలన, నాణ్యమైన విద్య, యువతకు ఉపాధి అందించాలనే సంకల్పంతో తాము ముందుకు వెళ్తున్నామని తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీలోని ‘తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025’ కార్యక్రమంలో మంగళవారం ‘తెలంగాణ రైజింగ్–2047 విజన్ డాక్యుమెంట్’ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మహీంద్రా గ్రూప్ చైర్మన్, ఆనంద్ మహీంద్రా, ఆర్‌బిఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు, కాలిఫోర్నియా ఎకనమిక్ ప్రొఫెసర్ కార్తిక్ మురళీధరన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సినీ నటుడు చిరంజీవి, మంత్రులు, దేశ, విదేశాల ప్రముఖులు,
తరువాయి 2లో

### 3 ట్రిలియన్ వృద్ధి లక్ష్యం.. మూడంచెల తంత్రం
‘తెలంగాణ రైజింగ్ 2047’ డాక్యుమెంట్ ఆవిష్కరణ
02

## రూ.5.75 లక్షల కోట్లు
### పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన కంపెనీలు
తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ప్రభుత్వంతో ఒప్పందాలు

ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025లో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తాయి. ఈ గ్లోబల్ సమ్మిట్‌లో రూ.5.75 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు వివిధ కంపెనీలు ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వివిధ కంపెనీలు ఆసక్తి చూపుతూ మొదటి రోజు రూ.2.43 లక్షల కోట్లు, రెండోవ రోజు రూ.3.32 లక్షల కోట్లకు ఎంఒయులు కుదుర్చుకున్నారు.




## బలమైన సంకల్పం తీసుకున్నాం...

● తెలంగాణ తల్లి ఆశీర్వాద స్ఫూర్తితో సంక్షేమం, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తాం ● ఆరు దశాబ్దాల ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చింది ● భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అన్ని జిల్లా కలెక్టరేట్లలో తెలంగాణ తల్లి విగ్రహాలు ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజల ఆలోచనలను, దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, మైనార్టీల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రతినిత్యం స్ఫూర్తిని పొందాలని, ‘తెలంగాణ తల్లి ఆశీర్వాద స్ఫూర్తి’తో సంక్షేమం, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే విధంగా బలమైన సంకల్పం తీసుకున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. 2004 లో కరీంనగర్ గడ్డపై నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని సోనియా గాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని, నాలుగు కోట్ల ప్రజల
తరువాయి 2లో

## రాష్ట్రానికి రండి..



● త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్య సాధనకు ప్రైవేట్ ప్రభుత్వ భాగస్వామ్యాలు అనివార్యం ● పెట్టుబడులు పెట్టండి.. కలిసి పని చేద్దాం ● పారిశ్రామిక, వాణిజ్య వర్గాలకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్

త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్య సాధనకు ప్రైవేట్ ప్రభుత్వ భాగస్వామ్యాలు అనివార్యమని, రండి రాష్ట్రంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టండి కలిసి పనిచేద్దామంటూ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ వేదికగా పారిశ్రామిక,వాణిజ్య వర్గాలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పిలుపునిచ్చారు. మంగళవారం గ్లోబల్ సమ్మిట్ వేదికలో నిర్వహించిన హెర్నెస్సింగ్ ప్రైవేట్ క్యాపిటల్ టువార్డ్స్ పబ్లిక్ గుడ్ అనే అంశంపై జరిగిన చర్చా గోష్టిలో ఉపముఖ్యమంత్రి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒఆర్ఆర్, ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్, మెట్రో రైలు వంటి భారీ ప్రాజెక్టులు ప్రైవేట్ ప్రభుత్వ భాగస్వామ్యం ద్వారానే సాధ్యం అయ్యాయని తెలిపారు. తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌లో తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్యంగా పెట్టుకున్న 3 ట్రిలియన్ అమెరికా డాలర్ ఆర్థిక వ్యవస్థ రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరిస్తున్న ఈ సందర్భంలో
తరువాయి 12లో

## 13 లక్షల మందికి ఉద్యోగాలొస్తాయ్



● ప్రపంచస్థాయి నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ● 13,500 ఎకరాల్లో జీరో కార్బన్ సిటీగా రూపాంతరం ● ఆరు అర్బన్ జిల్లాలుగా ఏర్పాటు ● ఐటి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించే ప్రపంచ స్థాయి నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధితో పాటు 13 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. అద్భుతమైన మౌలిక వసతులతో ఏర్పాటయ్యే ఈ నగరాన్ని 13,500 ఎకరాలలో జీరో కార్బన్ సిటీగా రూపొందించనున్నట్టు తెలిపారు. ‘భారత్ ఫ్యూచర్ సిటీ, యాజ్ ఏ మ్యాగ్నెట్ ఫర్ 3 ట్రిలియన్ డాలర్స్ తెలంగాణా’ అనే అంశంపై ప్రభుత్వ ప్రణాళికలను మంగవారం నాడు ఆయన గ్లోబల్ సమ్మిట్ లో వివరించారు. భవిష్యత్ నగరాన్ని ఆరు అర్బన్ జిల్లాలుగా అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, హెల్త్ సిటీ, ఎంటర్‌టెయిన్ మెంట్, క్రీడలు,
తరువాయి 12లో

## సర్.. కొనసాగాల్సిందే






● ప్రక్రియ జరిగేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశం ● బిఎల్‌ఒలను బెదిరిస్తారా అని అసహనం ● ఇది అరాచకత్వానికి దారితీస్తుందని వ్యాఖ్య ● అలాంటి కేసులు తమ దృష్టికి తీసుకురావాలని ఇసికి ఆదేశం

**న్యూఢిల్లీ :** ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్‌ఐఆర్) 2.0లో భాగంగా పనిచేస్తున్న బూత్ లెవల్ ఆఫీసర్ల(బిఎల్‌ఒ), ఇతర అధికారులు, బెంగాల్ సహా ఇతర రాష్ట్రాల్లో బెదిరింపులకు గురవుతుండడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఇలాంటి కేసులను తమ దృష్టికి తీసుకురావాలని ఎన్నికల కమిషన్ (ఇసి)ని కోరింది. లేకుంటే ‘ఇది అరాచకానికి దారితీస్తుంది’ అని వ్యాఖ్యానించింది. సర్ కొనసాగించాల్సిందేనని, ఈ ప్రక్రియ జరిగేలా చూడాలని ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలని ఆదేశించింది. వాస్తవానికి ఇసి చేపట్టిన ఎస్‌ఐఆర్ 2.0కు వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం సహకరించడం లేదు. దీనిని తీవ్రంగా పరిగణించాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్య బాగ్చిలతో
తరువాయి 12లో

# బిజెపిది అతిపెద్ద దేశ వ్యతిరేక చర్య



“1948 జనవరి 30న మూడు బుల్లెట్లు మహాత్మా గాంధీ ఛాతీలోకి దూసుకుపోయాయి. నాథూరామ్ గాడ్సే మన జాతిపితను హత్య చేశారు. ఇప్పుడు మన స్నేహితులు (బిజెపి వారు) ఆయనను హత్తుకోరు, అలాగని దూరంగా నెట్టరు. ఎందుకంటే ఆయన ఒక ఇబ్బందికరమైన వాస్తవం. కానీ ఆ కార్యక్రమం అక్కడితో ముగియలేదన్నారు. ప్రతి ఒక్కటి, అన్ని సంస్థలు, ఓటు నుండి ఉద్భవించాయి.కాబట్టి ఓటు నుండి ఉద్భవించిన అన్ని సంస్థలను ఆర్‌ఎస్‌ఎస్ స్వాధీనం చేసుకోవాలని చూస్తుంది. గాంధీజీ హత్య తర్వాత, వారి తదుపరి దశ కార్యక్రమం భారతదేశ సంస్థాగత చట్రాన్ని టోకుగా స్వాధీనం చేసుకోవడం”

– రాహుల్‌గాంధీ

● ఎలక్షన్ కమిషన్‌తో కుమ్మక్కై ఓటు చోరీకి పాల్పడింది ● భారత దేశ భావనను నాశనం చేసింది ● ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేందుకు ఇసిని తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటోంది ● ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో చర్చలో రాహుల్‌గాంధీ విమర్శ ● ప్రభుత్వానికి మూడు ప్రశ్నలు సంధించిన ప్రతిపక్ష నేత ● సర్‌ను నిలిపివేయాలని, బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని ప్రతిపక్షాల డిమాండ్

**న్యూఢిల్లీ :** ఎన్నికల కమిషన్‌తో బిజెపి కుమ్మక్కై ఓటు చోరీ’కి పాల్పడిందని, భారతదేశ భావనను నాశనం చేసిందని, తద్వారా బిజెపి అతిపెద్ద దేశ వ్యతిరేక చర్యకి పాల్పడిందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు.భారత ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేందుకు బిజెపి ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలిస్తూ, తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటుందని విమర్శించారు. తాను వేస్తున్న మూడు ప్రశ్నలు ఈ అంశం స్పష్టం చేస్తున్నాయని అన్నారు. ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో మంగళవారం జరిగిన చర్చలో ఆయన పాల్గొంటూ ఆ మూడు ప్రశ్నలను సంధించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం ఏర్పాటు చేసిన ఎంపిక కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఎన్నికల కమిషనర్ ఎవరు అవుతారనే అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా ఎందుకు అంత ఆసక్తి చూపుతున్నారని అన్నారు. భారత చరిత్రలో
తరువాయి 2లో

## మార్చి 14 నుంచి టెన్త్ పరీక్షలు

● ఏప్రిల్ 16 వరకు కొనసాగనున్న ఎగ్జామ్స్ ● షెడ్యూల్ విడుదల చేసిన ఎస్‌ఎస్‌సి బోర్డు ● నెలరోజుల పాటు నిర్వహణ ఏమిటని ప్రజాసంఘాల పెదవివిరుపు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎస్‌ఎస్‌సి (టెన్త్‌క్లాస్) వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను ఎస్‌ఎస్‌సి బోర్డు మంగళవారం విడుదల చేసింది.. 2026మార్చి 14 నుంచి ప్రారంభం కానున్న ఈ పరీక్షలు ఏప్రిల్ 16వ తేదీన ముగియనున్నాయి. పరీక్షలు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12.30 గంటలకు వరకు కొనసాగనున్నాయి. ఇందులో ప్రథమ భాష (గ్రూప్‌ఎ)పార్ట్ 1, 2 పరీక్షలు మధ్యాహ్నం 12.45 గంటలకు కొనసాగనున్నాయి. ఫిజికల్ సైన్స్ పరీక్ష, బయాలజీ పరీక్షలు ఉదయం 11 గంటల వరకు వొకేషనల్ (త్రిరీ) పరీక్ష 11.30గంటలకు
తరువాయి 12లో

అజయ్‌భవన్ సీనియర్ రెడ్‌గార్డ్
### కామ్రేడ్ అమ్రీక్ సింగ్ ఆకస్మిక మృతి
12





# ప్రపంచం
WORLD NEWS

## ఆస్ట్రేలియాలో భారత సంతతి వ్యక్తికి జీవిత ఖైదు

**సిడ్నీ:** ఆస్ట్రేలియాలో భారత సంతతికి చెందిన ఒక సిక్కు వయోజనుడు రాజ్‌విందర్ సింగ్ జీవితకాల జైలుశిక్షకు గురయ్యాడు. ఒక యువతిని 2018లో అత్యంత కిరాతకంగా హత్య చేసినందుకుగాను న్యాయస్థానం రాజ్‌విందర్ సింగ్‌కు ఈ శిక్ష విధించింది.
టోయా కార్డింగ్లీ అనే 24 ఏళ్ళ వయసుగల యువతి ఉదయమే తన పెంపుడు కుక్కను తీసుకుని వాకింగ్‌కు వెళ్ళినప్పుడు రాజ్‌విందర్ ఆమెను వెంబడించి అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. ఆమెను గొంతుకోసి చంపే ముందుగా 26 సార్లు కత్తితో పొడిచాడు. విచిత్రమైన విషయం ఏమిటంటే కోర్టులో విచారణ సందర్భంగా హతురాలు హంతకుడు ఇద్దరూ అపరిచితులని నిర్ధారణ అయింది. వారిద్దరిమధ్యా గతంలో ఎలాంటి పరిచయం లేదు. అందువల్ల కారణం పూర్తిగా ధృవీకరణ కాలేదు. పైగా హత్య జరిగిన మరునాడే సింగ్ భారతదేశానికి బయలుదేరి వచ్చేశాడు.
నాలుగు సంవత్సరాలు దొరక్కుండా తప్పించుకుని తిరిగాడు. 2022లో అతడిని అరెస్టు చేశారు. తన భార్య, ముగ్గురు పిల్లలు, తండ్రిని వదిలి అతడు భారత్‌కు పారిపోయాడు. 2023లో భారత ప్రభుత్వం సింగ్‌ను ఆస్ట్రేలియాకు అప్పగించింది.



## 22 మంది సజీవదహనం
### ఇండోనేసియాలో అగ్నిప్రమాదం

**జకర్తా:** ఇండోనేసియా రాజధాని జకర్తాలో సంభవించిన అగ్ని ప్రమాదంలో 20 మంది సజీవదహనమయ్యారు. అనేకమంది గాయపడ్డారు. ఏడు అంతస్తుల భవనంలో ఉన్న ఒక కార్యాలయంలో మంటలు చెలరేగడంతో ఈ విషాద సంఘటన జరిగింది. ఎట్టకేలకు అగ్నిమాపకదళ సిబ్బంది అనేక గంటలు కష్టపడి మంటలను అదుపుచేశారు. ఇంకా ఎవరైనా మృతులు, బాధితులు ఉన్నారా? ఎవరైనా శిథిలాల్లో చిక్కుకుని ఉన్నారా? అనే విషయంపై గాలింపు కొనసాగిస్తోంది. సెంట్రల్ జకర్తా పోలీసు విభాగం అధిపతి సుసాత్యో పూర్ణోమో కాండ్రో పాత్రికేయులకు ఈ విషయం చెప్పారు. జపనీస్ డ్రోన్ సంస్థ టెర్రా డ్రోన్ కార్పొరేషన్ బిల్డింగ్‌లో మంగళవారం మధ్యాహ్నం మొదటి అంస్తులో మంటలు చెలరేగాయి. కొద్దిసేపటికే మంటలు పై అంతస్తులకు వ్యాపించి మొత్తం భవనం అంతటినీ చుట్టుముట్టాయి. ఐతే చాలామంది కార్మికులు హుటాహుటిన పై అంతస్తులలోకి పారిపోయి అక్కడి నుండి నిచ్చెనల సహాయంతో కిందికి దిగి తప్పించుకున్నారని పోలీసులు తెలిపారు. లేకపోతే ఈ మరణాల సంఖ్య ఇంకా చాలా ఎక్కువగా ఉండేది. ఈ భవనం దగ్ధం అవుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గనుక తవ్వకాలు, వ్యవసాయ రంగంలో గగనతల సర్వేలు చేసే సంస్థలకు డ్రోన్లను తయారు చేసే జపనీస్ సంస్థ కార్యాలయం ఈ భవంతిలో ఉంది. హాంగ్‌కాంగ్‌లో నవంబరు 26వ తేదీన అత్యంత ఘోరమైన అగ్నిప్రమాద ఘటనను ప్రపంచం మరచిపోకముందే మరో ఘటన చోటు చేసుకుంది.

# ప్రత్యామ్నాయ శాంతి ప్రణాళిక సిద్ధం చేస్తున్న ఉక్రేన్

### రష్యాకు భూభాగం ఇచ్చేందుకు తిరస్కృతి



**కీవ్ :** రష్యా–ఉక్రేన్ మధ్య శాంతి ఒప్పందం చేసేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు కొత్త మలుపు తీసుకున్నాయి. ఆక్రమిత భూభాగాలను రష్యాకు వదులుకునేందుకు ఉక్రేన్ మరోసారి తిరస్కరించింది. నాటో నాయకులతో సంభాషణల తర్వాత ఉక్రేన్ నుండి ఈ స్పష్టమైన ప్రకటన వెలువడింది. ఈ భూభాగాలను స్వాధీనం చేస్తే తదుపరి భవిష్యత్తులో చాలా సులభంగా రష్యా మరిన్ని దాడులు చేయడానికి అవకాశం ఇచ్చినట్లవుతుందని నాటో మిత్రులు జెలెన్‌స్కీకి సలహా చెప్పారు. మార్పులతో ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని, కొత్త ప్రణాళికను వైట్‌హౌస్‌కు సమర్పిస్తామని పేర్కొంది.
అంతర్జాతీయ చట్టాల ప్రకారం లేదా ఉక్రేన్ రాజ్యాంగం ప్రకారం ఈ భూభాగాలను రష్యా కు స్వాధీనంచేసే హక్కు తనకు లేదని జెలెన్‌స్కీ ప్రకటించారు. జెనీవా సమావేశంలో చర్చల సందర్భంగా రాయితీలు పొందిన ప్రణాళికకు భిన్నంగా సవరించిన కొత్త ప్రణాళిక రూపొందించి వైట్‌హౌస్‌కు సమర్పించాలని ఉక్రేన్ నిర్ణయించుకుంది. దీంతో ఈ పరిణామాలు కొత్త దశకు చేరుకున్నాయి. ట్రంప్ ప్రతిపాదించిన 28 అంశాల ప్రణాళిక, ఆ తర్వాత జెనీవాలో సవరించిన 19 అంశాల ప్రణాళికా కూడా రష్యాకే అనుకూలంగా ఉందని మరోసారి జెలెన్‌స్కీ బయటపడ్డారు. ఈ ప్రణాళిక రష్యాకే అనుకూలంగా ఉందని మొదటినుండీ జెలెన్‌స్కీ విమర్శిస్తున్నారు. ట్రంప్ ప్రణాళికను అడ్డుకునేందుకు యూరప్ నాయకులతో జెలెన్‌స్కీ ప్రారంభించిన మంతనాలు ఇటీవల పరాకాష్టకు చేరాయి. ఫ్లోరిడాలో మూడురోజులపాటు ఉక్రేన్ ప్రతినిదులతో ట్రంప్ దూతలు విట్‌కాఫ్, కుష్నెర్ సమావేశాలు నిర్వహిస్తుండగానే జెలెన్‌స్కీ యూరప్ దేశాల నాయకులతో ముమ్మరంగా సమావేశాలు నిర్వహించారు. సోమవారం రాత్రి పొద్దుపోయాక లండన్‌లో నాటో నాయకులతో, బ్రిటన్ ప్రధానమంత్రి కీవ్‌స్టార్మర్ నాయకత్వంతో ''ఇష్టపడేవారి కూటమి'' సమావేశం టెన్ డౌనింగ్ స్ట్రీట్ కార్యాలయంలో జరిగింది. జెలెన్‌స్కీకి పూర్తి అండగా ఉంటామని నాటో, ఇయు నాయకుల నుండి జెలెన్‌స్కీకి భరోసా లభించింది. ట్రంప్ ప్రణాళికపై ఈ నాయకులందరూ క్షుణ్ణంగా చర్చలు జరిపారు. తర్వాత మంగళవారం ఆయన ఇటలీ వెళ్ళి ఆ దేశ ప్రధాన మంత్రి మెలోనీతో సమావేశం జరిపారు. ఆమె మద్దతు కూడగట్టారు. ఈ పరిణామాల పూర్వరంగంలో రష్యా కోరిన విధంగా భూభాగాలను ఆ దేశానికి త్యాగం చేసేదిలేదని మరోసారి ఉక్రేన్ తిరస్కరించింది. కొత్త శాంతి ప్రణాళిక ప్రకటన వెలువడింది. జెలెన్‌స్కీ అసలు తన ప్రతిపాదిత ప్రణాళికను చదవలేదని, ఒప్పందం చేసుకోవడానికి ఆయన సిద్ధపడటం లేదని ట్రంప్ ఆవేదన చెందిన విమర్శలు చేసిన 24 గంటల్లోనే జెలెన్‌స్కీ తన ఆలోచన బయట పెట్టారు.

**ఇక బలప్రయోగమే!**
**ఉక్రేన్ యుద్ధం ఇక మరింత తీవ్రం?**

ట్రంప్ ప్రతిపాదిత ప్రణాళిక మేరకు రష్యాకు భూభాగాలను వదులుకునేది లేదని, ప్రాదేశిక రాయితీలకు అంగీకరించేదిలేదని ఉక్రేన్ ప్రకటించడంతో పుతిన్ ముందుగా ప్రకటించిన విధంగా బలప్రయోగంతో ఆ భూభాగాలను స్వాధీనం చేసుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వివాదాస్పద భూభాగాల నుండి వారం రోజుల లోపు ఉక్రేన్ సైన్యం వైదొలగితే సంఘర్షణకు అవకాశం ఉండదని లేకపోతే బలప్రయోగంతో యుద్ధభూమిలోనే తాడోపేడో తేల్చుకుని తమ సాంస్కృతిక వారసత్వ భూభాగాలను స్వాధీనం చేసుకుంటామని పుతిన్ గడచిన బుధవారం (డిసెంబరు 3) భారత్ పర్యటన సందర్భంగా ''ఇండియా టుడే''కు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. ఉక్రేన్‌లో శాంతి సాధన యూరప్ దేశాలకు ఇష్టం లేదని, శాంతి సాధనకు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలను యూరప్ దేశాలే అడ్డుకుంటున్నాయని, యూరప్ నాయకులే ఉక్రేన్‌లో శాంతి ఒప్పందానికి పెద్ద విఘాతంగా మారారని విమర్శించారు. ట్రంప్ ప్రణాళిక అలాస్కాలో తమ మధ్య జరిగిన చర్చలకు అనుగుణంగా రూపొందించారని పుతిన్ ప్రశంసించారు. ఐతే కొన్ని అంశాలు తమకు ఆమోదయోగ్యంగా లేవని కూడా చెప్పారు. ఈ నేపథ్యంలో ఉక్రేన్ నుండి వెలువడిన ప్రకటన చూస్తే, యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. శాంతి ఒప్పందం సాధించాలంటే కొన్ని త్యాగాలు చేయకతప్పదని ట్రంప్ చెబుతూ వస్తున్నారు.ఇదిలా ఉండగా, రష్యా డ్రోన్లుతో దాడులు చేయడంతో ఉక్రేన్‌లోని వాయువ్య సున్నీలోని పలు ప్రాంతాలు అంథకారంలోకి జారుకున్నాయి.

# 3 ట్రిలియన్ వృద్ధి లక్ష్యం.. మూడంచెల తంత్రం

### కోర్... ప్యూర్... రేర్
### 'తెలంగాణ రైజింగ్ 2047'
### డాక్యుమెంట్ ఆవిష్కరణ



రాబోయే రెండు దశాబ్దాల్లో రాష్ట్రాన్ని సమగ్రంగా, సమ్మిళితంగా సుస్థిరంగా అభివృద్ధి చేసే దిశగా భవిష్యత్తు కు బాటలు వేసే దార్శనిక పత్రం తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపుదిద్దుకుంది.రెండు రోజుల పాటు హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ అవల మీర్‌ఖాన్‌పేట్‌లో ఏర్పాటు కానున్న భారత్ ఫ్యూచర్ సిటీలో రెండు రోజుల పాటు జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో చివరి రోజు మంగళవారం నాడు 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర అతిథులకు రోబో నడుచుకుంటూ వచ్చి విజన్ డాక్యుమెంట్‌ను అందజేసింది. దానిని వారంతా ఆవిష్కరించారు.

**ఈ ఆర్థిక వృద్ధికి మూడు మూల స్తంభాలు**

ఆర్థిక వృద్ధి, సమ్మిళిత అభివృద్ధి,సుస్థిర అభివృద్ధి.
అధునాతన సాంకేతికత, కొత్త ఆవిష్కరణలు, సమర్థవంతమైన ఆర్థిక వనరులతో పాటు సుపరిపాలన ఈ ఆర్థిక వృద్ధికి ఉత్ప్రేరకంగా పని చేస్తాయి.
రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడుజోన్ల అభివృద్ధి నమూనాను ఈ డాక్యుమెంట్ కీలకంగా ప్రస్తావించింది.
హైదరాబాద్ సిటీ తో పాటు పరిసర ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల మధ్య సమతుల్య, పరస్పర ఆధారిత వృద్ధిని సాధించే సంకల్పం.
2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించాలనే మైలు రాయి ని నిర్దేశించింది. 2047 నాటికి జాతీయ జిడిపిలో తెలంగాణ వాటా పదోవంతు కు చేరాలని లక్ష్యం గా ఎంచుకుంది. పెట్టుబడులకు గమ్యస్థానంగా, ఆవిష్కరణలకు కేంద్రంగా తెలంగాణను ప్రపంచ స్థాయి మౌలిక వసతులున్న అత్యాధునిక రాష్ట్రంగా తీర్చిదిద్దటం. అన్ని వర్గాలకు సమాన గౌరవం, సమాన అవకాశాలు కల్పించే ఆదర్శవంతమైన రాష్ట్రంగా నిలబెట్టడం .

**లక్ష్య సాధనకు మూడు సూత్రాలు:**

**1. ఆర్థిక వృద్ధి :** ఆవిష్కరణలు, ఉత్పాదకత ఆధారిత వృద్ధి ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించడం.
**2. సమ్మిళిత అభివృద్ధి:** యువత, మహిళలు, రైతులు, అణగారిన వర్గాలతో సహా సమాజంలోని అన్ని వర్గాలకు వృద్ధి ఫలాలు అందేలా చూడటం.
**3. సుస్థిర అభివృద్ధి :** అన్ని రంగాలలో సుస్థిరతను సాధించడం, 2047 నాటికి నెట్‌జీరో ఉద్గారాల లక్ష్యాన్ని సాధించడం.

మూడు ఉత్ప్రేరకాలు:

**1. సాంకేతికత, ఆవిష్కరణ :** పాలన, పరిశ్రమలు,సేవలలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం.
**2. సమర్థవంతమైన ఆర్థిక వనరులు:** పెట్టుబడులను ఆకర్షించడానికి, ప్రాజెక్టులకు నిధులు సమకూర్చడానికి వినూత్న ఆర్థిక నమూనాలను రూపొందించడం.
**3. సుపరిపాలన :** పారదర్శక, జవాబుదారీ, పౌరకేంద్రీకృత పాలనను అందించడం.

**మూడంచెల వ్యూహం :** తెలంగాణ భౌగోళిక ప్రాంతాన్ని మూడు విభిన్న, రంగాల వారీగా మూడు జోన్లుగా విభజన. అభివృద్ధి ప్రామాణికంగా రాష్ట్రాన్ని మూడు జోన్లు గా విభజించిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణ అవతరించింది. ఈ విధానం సమతుల్య ప్రాంతీయ అభివృద్ధికి పునాదులు వేస్తుంది.
**క్యూర్(కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) :** 160 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్ (ఒఆర్‌ఆర్) లోపల ఉన్న హైదరాబాద్ సిటీ ప్రాంతం. సేవల విస్తరణకు ప్రాధాన్యం. నెట్‌జీరో సిటీగా అభివృద్ధి చెందుతుంది. ఇది ప్రపంచ స్థాయి నాలెడ్జ్ మరియు ఆవిష్కరణల కేంద్రంగా ఉంటుంది.
ప్యూర్ (పెరిఅర్బన్ రీజియన్ ఎకానమీ): ఔటర్ రింగ్ రోడ్ (ఒఆర్‌ఆర్)360 కిలోమీటర్ల ప్రాంతీయ రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్) మధ్య ఉన్న జోన్. తయారీ రంగానికి కేంద్రంగా ఉంటుంది. ఇక్కడ పారిశ్రామిక క్లస్టర్లు, లాజిస్టిక్స్ హబ్లు ఏర్పాటు.
**రేర్ (రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ):** ప్రాంతీయ రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్) దాటి, రాష్ట్ర సరిహద్దుల వరకు విస్తరించి ఉన్న ప్రాంతం. వ్యవసాయం, హరిత ఆర్థిక వ్యవస్థ. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి .

**పది కీలక వ్యూహాలు**

ఈ దార్శనికతను సాధించడానికి 10 కీలక వ్యూహాలను డాక్యుమెంట్ ప్రస్తావించింది.

**1. 3–జోన్ల రాష్ట్రం :** సమతుల్య అభివృద్ధికి క్యూర్, ప్యూర్, రేర్ నమూనా.
**2. విచక్షణ నుండి విధానానికి :** పెట్టుబడుల ఆకర్షణ, పాలనలో పారదర్శకత. విధానపరమైన నిర్ణయాలను ప్రోత్సహించడం.
**3. గేమ్–ఛేంజర్ ప్రాజెక్టులు :** భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవనం, డ్రై పోర్ట్, బందర్ పోర్ట్ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే, రీజినల్ రింగ్ రోడ్. రింగ్ రైలు, బుల్లెట్ రైలు కారిడార్ల వంటి ప్రాజెక్టులు.
**4. సమర్థ పాలన :** డిజిటల్ గవర్నమెంట్, టి– ఫైబర్, స్పీడ్(ఎస్‌పిఇఇడి) వంటి కార్యక్రమాలతో పాలనా సామర్థ్యాన్ని పెంచడం.
**5. నాలెడ్జ్ హబ్ :** ప్రపంచ స్థాయి విద్య, పరిశోధన సంస్థలను ఆకర్షించడం .
**6. సుస్థిర సంక్షేమం :** మహిళలు, రైతులు, యువతపై ప్రత్యేక దృష్టి. ఆరోగ్యం, విద్య, జీవనోపాధి అందరికీ సమాన అవకాశాలు.
**7. అభివృద్ధి నిధులు :** మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించి ప్రత్యేక నిధి ఏర్పాటు చేయడం.
**8. పర్యావరణం, సుస్థిరత :** వాతావరణ మార్పులతో వాటిల్లే నష్టాలను తగ్గించడం. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం.
**9. సంస్కృతి :** రాష్ట్ర గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని, కళలు, పర్యాటకాన్ని పరిరక్షించడం.. ప్రోత్సహించడం.
**10. ప్రజల యొక్క, ప్రజల కోసం, ప్రజల చేత:** పాలనలో పౌరుల భాగస్వామ్యాన్ని నిర్ధారించడం. వారి ఆకాంక్షలను ప్రతిబింబించే విధానాలు రూపొందించడం.

**విజన్ డాక్యుమెంట్ రూపకల్పన సాగిందిలా :** రాబోయే రోజుల్లో ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణను ఆవిష్కరించే బృహత్తరమైన ప్రయత్నంలో భాగమే తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌కు రూపకల్పన చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ఇది రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించే రోడ్ మ్యాప్ అని పేర్కొంది. తెలంగాణ రాష్ట్ర ఉజ్జ్వల భవిత కోసం..ప్రజల భవిష్యత్తు కోసం.. భావి తరాల కోసం.. ముందుచూపుతో తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ రూపుదిద్దుకుంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో రాష్ట్ర ప్రభుత్వం ఈ డాక్యుమెంట్ తయారు చేసింది. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల అభిప్రాయాలు.. ఆకాంక్షలకు ఇందులో చోటు కల్పించింది. అన్ని శాఖల మంత్రులు, అన్ని విభాగాల అధికారులు, మేధావులు, అన్ని రంగాల నిపుణులు, పారిశ్రామికవేత్తలు, సామాజిక, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సలహాలకు ప్రాధాన్యమిచ్చింది. ఈ డాక్యుమెంట్ తయారీలో నితి ఆయోగ్ కీలక భూమిక నిర్వహించింది. ఐఎస్‌బి (ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్) ప్రొఫెసర్లు డాక్యుమెంట్ తయారీలో పాలుపంచుకున్నారు. వరుస సంప్రదింపులు, రోజుల తరబడి చర్చలు, ప్రపంచవ్యాప్తంగా పేరొందిన ప్రముఖుల సలహాలు, సూచనలు, వివిధ దేశాలు అనుసరిస్తున్న ఆదర్శవంతమైన విధానాలన్నింటినీ ప్రభుత్వం అధ్యయనం చేసింది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా వృద్ధి చేయడం తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ విజన్ ప్రధాన లక్ష్యం.దీంతో తెలంగాణ అభివృద్ధిలో ప్రపంచ దేశాల కు ధీటుగా నిలబడి.. దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో ఒకటిగా నిలుస్తుంది.
రాష్ట్రం నలుమూలల అన్ని జిల్లాల నుంచి దాదాపు 4 లక్షల మంది ఆకాంక్షలు.. అభిప్రాయాలతో ఈ డాక్యుమెంట్ రూపొందించారు. 65 శాతం యువత ఈ ఉజ్వల తెలంగాణ భవిష్యత్ రూపకల్పన లో పాలుపంచుకున్నారు. వీటన్నింటినీ విశ్లేషించుకొని.. వడపోసి.. తెలంగాణ భవిష్యత్తు ఎలా ఉండాలో ఈ దార్శనిక పత్రంలో పొందుపరిచింది. ఇందులో ఉన్న ప్రతి అధ్యాయం తెలంగాణ పురోగాభివృద్ధికి దోహదపడుతుంది.

## పేదల అభివృద్ధికే
(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ మట్టికి గొప్ప చైతన్యం ఉందని, జల్, జంగిల్, జమీన్ అని కొమురం భీమ్ పోరాడిన గడ్డ అని, భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం సాయుధ రైతాంగ పోరాటంలో ఎంతో మంది నేలకొరిగిన చరిత్ర తెలంగాణ ప్రాంతానిదని సిఎం గుర్తు చేశారు. స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం తెలంగాణ ఎదురుచూస్తోందని, తెలంగాణ ప్రజలు కోరుకున్న స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు అందించేందుకు తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ను తీసుకొచ్చామని వివరించారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించామని సిఎం పునరుద్ఘాటించారు. ఈ డాక్యూమెంట్‌ను నాలుగు గోడల మధ్య కూర్చుని తయారు చేసింది కాదని,నాలుగు కోట్ల ప్రజల అభిప్రాయాలు తీసుకుని తయారు చేశామని వివరించారు.

**విద్య, నీటిపారుదల, కమ్యూనికేషన్ నినాదంతో ముందుకు**

భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటి ప్రధాని జహర్‌లాల్ నెహ్రూ ముందుగా విద్య, నీటిపారుదల రంగానికి ప్రధాన్యత ఇచ్చారని, తాము విద్య,నీటి పారుదల రంగం, కమ్యూనికేషన్ నినాదంతో ముందుకు వెళ్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పేదలకు సంక్షేమ ఫలాలు అందించాలన్నదే తమ ఆకాంక్ష అని, కొందరికి పేదరికం ఎక్స్‌కర్షన్ అని, కానీ తనకు పేదరికం ఏమిటో తెలుసని, తాను గ్రామీణ ప్రాంతం నుంచి ఒక ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నానని, అందుకే తనకు పేదలు, దళితులు, ఆదివాసీలతో మంచి అనుబంధం ఉందని చెప్పారు.
ఎస్‌సి, ఎస్‌టి,బిసి,మైనార్టీ ఇలా వేర్వేరుగా విద్యను అందిస్తే కుల వివక్షకు పరిష్కారాన్ని చూపబోదని,అందుకే విద్యార్థి దశలోనే కులవివక్షను నిర్మూలించేందుకు తాము ఎస్‌సి,ఎస్‌టి,బిసి ,ఒసి, మైనార్టీ లకు ఒకే చోట విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని వివరించారు. రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్‌ను నిర్మిస్తున్నామని, దీనిని తాము ఖర్చుగా బావించడం లేదని, ఈ ఖర్చును తాము తెలంగాణ భవిష్యత్‌కు పెట్టుబడిగా భావిస్తున్నామని తెలిపారు. నాణ్యమైన విద్య, నైపుణ్యం లేకపోవడంతో నిరుద్యోగం పెరుగుతోందని, అందుకే యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసుకున్నామని సిఎం పునరుద్ఘాటించారు. ఒలంపిక్స్ లక్ష్యంగా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు.

**సకల వర్గాల సమిష్టి కృషి : భట్టి విక్రమార్క**

డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ విజన్ డాక్యుమెంట్ సకల వర్గాల సమిష్టి కృషి అని,తెలంగాణ జీవ పత్రమని అన్నారు. సోనియా గాంధీ సాహసోపేత నిర్ణయం తెలంగాణ భవిష్యత్తు ఆశయాలను నిర్దేశిస్తుందన్నారు. విజన్ డాక్యుమెంట్స్‌లో చింతన నాయకులు, విద్యావేత్తలు మేధోపరమైన లోతు అంశాలను జోడించారని, అత్యంత ముఖ్యంగా రైతులు, యువత, వ్యాపారులు, కూలీలు వేలాదిగా తమ భవిష్యత్తు గురించి ఆశలు, సూచనలు పంచుకున్నారని వివరించారు. ఉత్పాదకత సెషన్‌లో భారత్ తదుపరి దూకుడు కేవలం కష్టపడి కాదని,తెలివిగా సిస్టమ్‌ను నిర్మించడం ద్వారా వస్తుందనే ఏకాభిప్రాయం ఏర్పడిందన్నారు.

**తెలంగాణ రైజింగ్ అన్‌బీటబుల్ : దువ్వూరి సుబ్బారావు**

దువ్వూరి సుబ్బారావు మాట్లాడుతూ చైనా, గ్యాంగ్ డాంగ్ నమూనాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకుందని, తెలంగాణ రైజింగ్ అన్‌స్టాపబుల్ మాత్రమే కాదని, అన్ బీటబుల్ అని అన్నారు. ప్రతి ఏటా 8 నుంచి 9 వృద్ధి సాధిస్తే తెలంగాణ తన లక్ష్యాలను అందుకోగలదన్నారు. ఐటి,ఫార్మా, బయోటెక్నాలజీకి హైదరాబాద్ ఒక హబ్‌గా నిలిచిందన్నారు. ప్రపంచ స్థాయి కంపెనీలకు హైదరాబాద్ ఇప్పుడు గమ్యస్థానంగా ఉన్నదని,హైదరాబాద్ ఒక ఐకానిక్ నగరంగా నిలిచిందన్నారు. రాబోయే పదేళ్లలో తెలంగాణ మాడల్‌అని అంటారని చెప్పారు.

**తెలంగాణ ఆర్థికాభివృద్ధికి కలిసి పనిచేస్తాం: సుమన్ బెర్రీ**

నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెర్రీ మాట్లాడుతూ తెలంగాణ అప్పర్ మిడిల్ కంట్రీ ఇన్కమ్ స్టేటస్ లో ఉందని, తెలంగాణ ఆర్థికాభివృద్ధికి నీతి అయోగ్ తెలంగాణతో కలిసి పనిచేస్తుందని వివరించారు. మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థను సాధించేందుకు తెలంగాణ రాష్ట్రం గతం కంటే మరింత మెరుగైన రీతిలో పనిచేయాల్సిన అవసరం ఉన్నదని సూచించారు.

**తెలంగాణ రైజింగ్ ఒక మాడల్ : అరవింద్ సుబ్రమణ్యం**

ప్రొఫెసర్ అరవింద్ సుబ్రమణ్యం మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ డాక్యూమెంట్ ఒక మ్యాగ్‌నెట్ కాదని, ఇదొక మాడల్‌అని అన్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రానికి రూ.5లక్షల పెట్టుబడి సిద్ధంగా ఉన్నదని,రానున్నకాలంలో తెలంగాణ మరింత ముందుకు వెళ్తుందన్నారు.
ఆనంద్ మహీంద్ర మాట్లాడుతూ ప్రజల కేంద్రంగా తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ ఉందని, దీర్ఘకాలిక లక్ష్యాలతో ఈ డాక్యుమెంట్ ను రూపొందించారని కొనియాడారు.

**హైదరాబాద్‌ను సినీ హబ్‌గా మార్చేందుకు ముందుంటాం: చిరంజీవి**

చిరంజీవి మాట్లాడుతూ కోరియా తమ దేశ యువతను చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా వారిని చిత్ర పరిశ్రమ వైపు మళ్ళించిందన్నారు. సినీ పరిశ్రమకు సంబంధించిన నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.ప్రపంచానికి అద్భుతమైన సినిమా హబ్‌గా హైదరాబాద్‌ను నిర్మించేందుకు తాము ముందు ఉంటామని, సినీ పరిశ్రమను ప్రోత్సహించడం వల్ల ఆర్థికంగా మరింత ఎదిగేందుకు అవకాశం ఉంటుందని,ఉపాధి అవకాశాలు పెరుగతాయని, ఈ విషయాన్ని సిఎం రేవంత్ రెడ్డి గుర్తించారని చిరంజీవి అన్నారు.

**ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన రోబో**

'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' డాక్యూమెంట్‌ను 'రోబో' ద్వారా వేదికపైకి తీసుకురావడం సబీకులను,వేదికపైన ఆసీనులైన వారిని ఆకర్షించింది. రోబో తన చేతుల మీదుగా సిఎం రేవంత్ రెడ్డికి డాక్యూమెంట్‌ను అందజేసింది. ఆ తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయింది.

## దేశ వ్యతిరేక చర్య
(మొదటి పేజీ తరువాయి)

ఏ ప్రధానమంత్రి చేయని విధంగా డిసెంబర్ 2023న ఈ ప్రభుత్వం ఎన్నికల కమిషనర్‌గా పని చేసినవారు తీసుకునే ఎలాంటి చర్యపై కూడా శిక్ష పడకుండా చట్టాన్ని మార్చిందని అన్నారు. ఇలాంటి మినహాయింపును ప్రధాన మంత్రి, హోంమంత్రి ఎందుకు బహుమతిగా ఇచ్చారని రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. అంతే కాకుండా పోలింగ్ జరిగిన 45 రోజుల తర్వాత సిసిటివి ఫుటేజ్‌ను నాశనం చేయడానికి చట్టాన్ని ఎందుకు మార్చారని ఆయన నిలదీశారు. ఈ చర్యల ఫలితంగా ప్రధానమంత్రి కోసం ప్రత్యేకంగా ఎన్నికల ప్రచారాలు రూపొందించబడ్డాయని, బ్రెజిల్ మోడల్ హర్యానా ఓటరు జాబితాలో 22 సార్లు కనిపించిందన్నారు. హర్యానా ఎన్నిక దొంగిలించబడిందని, ఈ దొంగతనం జరిగే విధంగా భారత ఎన్నికల కమిషన్ చూసిందని ఆయన అన్నారు. ఎన్నికల సంస్కరణ చేపట్టడం సులువైనప్పటికీ, అది జరగాలని ఎన్నికల కమిషన్ కోరుకోవడం లేదని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఎన్నికలకు ఒక నెల ముందు అన్ని పార్టీలకు యంత్రాలు చదవగలిగే ఓటరు జాబితాను ఇవ్వాలని, 45 రోజుల తర్వాత సిసిటివి ఫుటేజ్‌ను నాశనం చేయడానికి అనుమతించే చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని, ఇవిఎంల రూపకల్పన ఎలా జరుగుతుందో చెప్పాలని, ఇవిఎంలను తమకు అందుబాటులో ఉంచాలని రాహుల్‌గాంధీ సూచించారు. చివరగా ఎన్నికల కమిషనర్లు ఏమి చేసినా మినహాయింపును ఇచ్చే చట్టాన్ని మార్చాలని కోరారు. ప్రస్తుత చట్టం తాము తప్పించుకునేందుకు అవకాశమిస్తుందని ఎన్నికల కమిషనర్ భావిస్తున్నారని, కానీ అది అలా జరగబోదని, ఎందుకంటే గత చర్యలకు కూడా వర్తింపజేసే విధంగా తాము చట్టాన్ని మారుస్తామని అన్నారు. భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్యం మాత్రమే కాదు, గొప్ప ప్రజాస్వామ్యం కూడా అని ఆయన నొక్కి చెప్పారు.
'మీరు చేయగలిగే అతిపెద్ద దేశ వ్యతిరేక చర్య 'ఓటు చోరి' చేయడం. ఎందుకంటే మీరు ఓటును నాశనం చేసినప్పుడు, మీరు ఈ దేశ నిర్మాణాన్ని నాశనం చేస్తారు. మీరు ఆధునిక భారతదేశాన్ని నాశనం చేస్తారు. మీరు భారతదేశం యొక్క ఆలోచనను నాశనం చేస్తారు' అని బిజెపిని ఉద్దేశించి అన్నారు.

**సర్‌ను తక్షణమే ఆపేయాలి : మనీశ్ తివారి**

ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో జరిగిన చర్చను కాంగ్రెస్ సభ్యుడు మనీశ్ తివారి ప్రారంభిస్తూ సర్‌కు ఎలాంటి చట్టబద్ధ ఆధారం లేదని, తక్షణమే దానిని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ ఎంపిక కమిటీలో ప్రస్తుతం ప్రధాని, హోం మంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు సభ్యులుగా ఉన్నారని, అదనంగా రాజ్యసభ ప్రతిపక్ష నేత, ప్రధాన న్యాయమూర్తిని కూడా చేర్చాలని కోరారు. ఎన్నికల కమిషన్ తటస్థ అంపైర్‌లాగా వ్యవహరించాలని, కానీ దాని తటస్థతపై ప్రశ్నలు తలెత్తడం బాధాకరమని అన్నారు. వంద శాతం వివిప్యాట్‌లను లెక్కించడం లేదా పాత పద్ధతిలో బ్యాలెట్ పత్రం ద్వారా ఎన్నికలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో సందేహాలను తొలగించవచ్చన్నారు. ఓట్ల లెక్కింపునకు మూడు, నాలుగు రోజులు పట్టినా ప్రజాస్వామ్యంపై ప్రజలకు విశ్వాసం పునరుద్ధరించబడుతుందన్నారు. ఎన్నికలకు ఒకటి రెండు రోజుల ముందు నగదు బదిలీ చేయడం ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగమే అవుతుందని, ఇదెక్కడి ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్యం, దేశ దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. పార్టీ ఫిరాయింపు చట్టం కూడా అపహాస్యం పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

**బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు : అఖిలేశ్ యాదవ్**

లోక్‌సభ చర్చలో సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు, ఎంపి అఖిలేశ్ యాదవ్ అన్నారు. పాత పద్ధతిలోనే బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని, ఎందుకంటే అభివృద్ధి చెందిన దేశాలలో సైతం బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మిల్కీపూర్, రాంపూర్‌ఉప ఎన్నికల్లో నిజమైన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోంచుకోకుండా ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం అడ్డుకుందని, ఎన్నికల కమిషన్‌ను ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. వేల మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలిగించారని విమర్శించారు.

**18 ఏళ్ళకే పోటీకి అవకాశం ఇవ్వాలి : శివసేన**

లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అర్హత వయస్సును 25 నుంచి 18 సంవత్సరాలకు తగ్గించాలని శివసేన పక్ష నాయకుడు శ్రీకాంత్ షిందే కోరారు. తాము ఉండే చోటు నుంచే ఓటు వేసే విధంగా వలస ఓటర్లకు అవకాశం కల్పించాలన్నారు.

**ఇసి తీరు మంచిది కాదు: సుప్రియా సూలే**

స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ ప్రభుత్వంలో భాగంగాలాగా కనిపిస్తుందని శివసేన(శరద్ పవార్) ఎంపి సుప్రియా సూలే అన్నాది. ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. సిపిఐ(ఎం) సభ్యుడు అమ్రారామ్ మాట్లాడుతూ ప్రతి ఏడాది సవరణ జరుగుతుండగా ప్రత్యేక ఓటర్ల సవరణ (సర్) ఎందుకు అని ప్రశ్నించారు. సర్ పేరుతో వలస కార్మికుల ఓట్లు తొలగిస్తున్నారని విమర్శించారు. బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

**ఓట్లు తొలగిస్తే ఎన్నికలకు అర్ధమేమిటి? : టిఎంసి**

ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితే ప్రత్యేక సవరణ (సర్) కేవలం ఓట్ల తొలగింపు లక్ష్యంగా సాగుతుందని టిఎంసి ఎంపి కల్యాణ్ బెనర్జీ విమర్శించారు. ఓట్లు తొలగిస్తే ఎన్నికలకు అర్థమేమిటని ఆయన అన్నారు. ఎవరు ఓటరుగా ఉండాలనేది ఎన్నికల కమిషన్ ద్వారా మోదీ నిర్ణయిస్తున్నారని విమర్శించారు. సర్ కారణంగా ఒత్తిడికి గురై, పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఇప్పటి వరకు 20 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఐదుగురు తీవ్ర అనారోగ్యం పాలయ్యారని, ముగ్గురు ఆత్మహత్యకు ప్రయత్నించారని చెప్పారు.ఇలాంటివే బిజెపి పాలిత రాష్ట్రాలైన ఉత్తర్‌ప్రదేశ్‌లో 10 , మధ్య ప్రదేశ్‌లో 9, గుజరాత్‌లో 6, రాజస్థాన్‌లో ఒక కేసు నమోదైందని తెలిపారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ప్రత్యేక ఆకర్షణగా నెట్ జీరో స్టాల్

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రైజింగ్ 2047 సమ్మిట్‌లో భాగంగా ఎక్స్‌పోలో విద్యుత్ శాఖ హరిత ఇంధనం ఉత్పత్తి పై ఏర్పాటుచేసిన నెట్ జీరో స్టాల్‌కు విశేష ఆదరణ లభించింది. ఈ స్టాల్‌లో విద్యుత్ వెహికల్, వేస్ట్ టు ఎనర్జీ, పవన విద్యుత్తు, పంప్డ్ స్టోరేజ్ పవర్ జనరేషన్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థ, సోలార్ ఫలకాలతో విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ల నమూనాలను ఏర్పాటు చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , డిజిపి శివధర్ రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు స్టాల్‌ను సందర్శించి అక్కడ ప్రదర్శిస్తున్న నమూనాలను నిశితంగా పరిశీలించారు. విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ల నమూనాలను ప్రదర్శించడం వలన ఈ స్టాల్ అత్యధిక సందర్శకులను ఆకర్షించింది. పంపుడ్ స్టోరేజ్ ప్లాంట్ పనితీరుకు సంబంధించి రియల్ టైంలో ప్రదర్శించడం పలువురిని కట్టిపడేసింది. పర్యావరణం, గ్రీన్ ఎనర్జీ పై అవగాహన కల్పించడానికి నెట్ జీరో క్విజ్ సాఫ్ట్వేర్ కూడా రూపొందించారు. పలువురు సందర్శకులు ఎంతో ఉత్సాహంగా ఈ క్విజ్‌లో పాల్గొని నెట్ జీరో సర్టిఫికెట్ ను పొందారు. గర్వ ఒక ముఖ్యమంత్రి గారు మరియు డిజిపి కూడా ఎంతో ఉత్సాహంగా క్విజ్‌లో పాల్గొన్నారు.



## పెట్టుబడులకు ఆవిష్కరణలు తోడైతేనే
# త్రి ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యం సాధ్యం

డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాబోయే 22 ఏళ్లలో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే ప్రస్తుతం ఉన్న అంచనాల ప్రకారం 16 రెట్లు ఆర్థిక వృద్ధిని సాధించాల్సి ఉందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పెట్టుబడులకు ఆవిష్కరణలు తోడైతేనే త్రి ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యం సాధ్యమవుతుందన్నారు. ఎఐ, డిప్ టెక్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం రైతుల ఉత్పత్తులు పెంచేందుకు ఉపయోగపడాలన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో 'క్యాపిటల్, ప్రోడక్టివిటీ ఫర్ త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ' అంశంపైన మంగళవారం చర్చాగోష్టి జరిగింది. ఈ చర్చలో గోషిలో సెంటర్ ఫర్ ఎనలైటికల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రసన్న తంత్రి, యువ పారిశ్రామికవేత్త పరశురాం, ట్రాన్స్ కో సిఎండి కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఎక్కువగా పనిచేస్తేనే 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను చేరుకోలేమని, మరిన్ని రోడ్లు, పెద్ద సంఖ్యలో భవనాలు నిర్మించడంతో సరిపోదని, ఆర్థిక వ్యవస్థ ప్రాథమిక సమీకరణాన్ని మార్చాల్సిందేనని అన్నారు. మూలధనం + ఆవిష్కరణ = ఉత్పాదకత అని అన్నారు. ఉత్పాదకతే తెలంగాణ సాధారణ పౌరుడి వేతనాలు, గౌరవాన్ని శాశ్వతంగా పెంచే ఏకైక మార్గమన్నారు. ఎన్నేళ్లుగా భారతదేశంలోని ప్రభుత్వాలు తమను 'రెగ్యులేటర్లు'గా మాత్రమే భావించాయని, అనుమతులు, లైసెన్సులు, ఫైళ్లకే ప్రాముఖ్యత ఇచ్చాయని, 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో ర్యాంకులు పెరిగితే సంతోషపడ్డామని, కానీ ప్రపంచం చాలా వేగంగా మారిందని, డిప్టెక్, ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ యుగంలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అనేది కేవలం కనీస అర్హత అని, అది ఒక బేస్‌లైన్ మాత్రమేనని భట్టి వివరించారు. ఆసియాలో ఇన్నోవేషన్ క్యాపిటల్ కావాలంటే, 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుండి 'ఈజ్ ఆఫ్ ఇన్నోవేటింగ్' వైపు సాగాలన్నారు.

### ఫైళ్లు క్లియర్ చేయడం కాదు.. ఎకోసిస్టమ్ క్రియేట్ చేసే ప్రభుత్వం కావాలి

ఫైళ్లు క్లియర్ చేయడమే కాదని, ఎకోసిస్టమ్‌లను క్రియేట్ చేసే ప్రభుత్వం కావాలని భట్టి విక్రమార్క అన్నారు. తమ విజన్ డాక్యుమెంట్ క్యూర్ (అర్బన్),ప్యూర్ (పెరిఅర్బన్), రేర్ (రూరల్) అనే ప్రత్యేక స్ట్రాటజీని ప్రతిపాదించామన్నారు. బ్యాంకులు భద్రతను ఇష్టపడతాయని, కానీ ఇన్నోవేషన్‌కు ఫెయిల్యూర్ అవసరమని, కానీ ఇంటర్‌నెట్ నుండి స్పేస్ ట్రావె ల్ వరకు అత్యంత పెద్ద బ్రేక్‌థ్రూలు, దశాబ్దాల పాటు లాభం లేకపోయినప్పటికీ ఎవరైనా ఒక రిస్క్ తీసుకున్నప్పుడు మాత్రమే సాధ్యమయ్యాయనే విషయం ప్రపంచ చరిత్ర చెబుతుంది డిప్యూటీ సిఎం భట్టి తెలిపారు. రెగ్యులేటర్‌గా కాకుండా, రిస్క్‌ను పంచుకునే 'క్యాటలిస్ట్'గా,ప్రజల కోసం రివార్డులు పొందే భాగస్వామిగా మారడానికి సిద్ధంగా ఉన్నామ న్నారు. సైబరాబాద్‌తో పాటు వరంగల్, నిజామాబాద్ రైతుల ఉత్పాదకత పెంచే 'బోరింగ్ ప్రాబ్లమ్స్'ను కూడా ఎలా పరిష్కరించేలా చేసుకోవాలనే అంశంపైన కూడా దృష్టి పెట్టాలని సూచించారు.

# చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం సిద్ధం

TELANGANA RISING GLOBAL SUMMIT

అన్ని సౌకర్యాలు కల్పిస్తాం
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణలో చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీలో స్టూడియోలను ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 రెండో రోజున సృజనాత్మక శతాబ్దం – వినోద రంగం భవిష్యత్తు అన్న అంశంపై జరిగిన చర్చల్లో ప్రముఖ నటులు చిరంజీవి, రితేష్ దేశ్‌ముఖ్, సుభాష్ ఘాయ్, అల్లు అరవింద్, సురేష్ బాబు, నటులు జెనీలియా దేశ్‌ముఖ్, అక్కినేని అమల, అనిరుధ్ రాయ్ చౌదరి, శ్యాం ప్రసాద్ రెడ్డి, జోయా అక్తర్, చంకీ పాండేతో పాటు పలువురు టాలీవుడ్, బాలీవుడ్ రంగానికి చెందిన ప్రముఖులు ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క , మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి , ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ స్క్రిప్ట్‌తో వస్తే సినిమా పూర్తి చేసుకుని వెళ్లేలా రాష్ట్ర ప్రభుత్వం సినిమా పరిశ్రమను ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉందని, అందుకు అనుగుణంగానే నిర్ణయాలు ఉంటాయని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో సినిమా పరిశ్రమకు సంబంధించిన 24 క్రాఫ్ట్స్‌లో పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించే అంశాన్ని పరిశీలించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు.





### అత్యుత్తమ ఫిల్మ్ టూరిజం కేంద్రంగా తెలంగాణ : కోమటిరెడ్డి

సినిమా షూటింగ్, ఎవిజిసితో పాటు ఫిల్మ్ టూరిజం కోసం అత్యుత్తమ కేంద్రంగా తెలంగాణను మార్చడానికి దృఢమైన ప్రణాళికలను రూపొందిస్తున్నామని రాష్ట్ర సినిమాటోగ్రఫి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. 'ది క్రియేటివ్ సెంచరీ ఇండియాస్ సాఫ్ట్ పవర్ అండ్ ది ఫ్యూచర్ ఆఫ్ ఎంటర్‌టైన్మెంట్ టాపిక్‌పై చర్చాగోష్టిలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఫిల్మ్ పాలసీ, సంబంధిత ప్రోత్సాహకాల ద్వారా భారీగా పెట్టుబడులు పెట్టే వారికి క్యాపిటల్ సబ్సిడీలు, స్థానిక వనరులు ఉపయోగిస్తే ఉత్పత్తి వ్యయాల రీయింబర్స్‌మెంట్ వంటి బలమైన సహాయాలు అందిస్తున్నామని తెలిపారు. 2025లో రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌ను భారత సినిమా ఉత్పత్తి ఎపిక్ సెంటర్‌గా మార్చే సంకల్పాన్ని మరోసారి పునరుద్ఘాటించారు. సృజనకర్తల సంక్షేమం, పరిశ్రమ కార్మికుల అభివృద్ధి, సమగ్ర ఎకోసిస్టమ్ నిర్మాణం కూడా తమ దృష్టిలో కీలక భాగాలని మంత్రి చెప్పారు. వినోదం అనేది అత్యంత ప్రభావవంతమైన రాజనీతిగా ఎదిగే యుగమని, ప్రపంచంలోనే భారతదేశం ముందంజలో నిలుస్తోందన్నారు. భారతదేశం చెప్పే కథలు సరిహద్దులను దాటి ప్రపంచమంతా విస్తరిస్తున్నాయని పేర్కొన్నారు. ఇది యాదృచ్ఛికం కాదు ఇది భారతీయ సృజనాత్మకత యొక్క శక్తి అని, వారసత్వంలో బలంగా నిలిచి, భవిష్యత్తుతో సమరసమై ముందుకు సాగుతున్న శక్తిగా అభివర్ణించారు. భారతదేశం వినోదాన్ని మాత్రమే ఎగుమతి చేయడంతో పాటు భావాలను, విలువలను, ప్రపంచాన్ని హత్తుకునే ప్రత్యేక సాంస్కృతిక గుర్తింపును కూడా పంచుతుందని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద సినిమా నిర్మాణ వ్యవస్థ రామోజీ ఫిల్మ్ సిటీ సహా హాలీవుడ్, ఒటిటి దిగ్గజాలు, అంతర్జాతీయ ఫ్రాంచైజీలను శక్తినిచ్చే ప్రముఖ విఎఫ్ఎక్స్, గేమింగ్, యానిమేషన్ సంస్థలు, ఆధునిక సాంకేతిక మౌలిక సదుపాయాలతో కూడిన బహుళ సాంస్కృతిక ప్రతిభావంతుల సమూహమని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌ను ప్రపంచ మీడియా, వినోద కేంద్రంగా తీర్చిదిద్దడానికి కట్టుబడి ఉందన్నారు. అంతర్జాతీయ సినిమా నిర్మాణానికి సౌకర్యాలతో పాటు ఎవిజిసిఎక్స్ఆర్ నైపుణ్య అభివృద్ధి, ఇన్నోవేషన్ సెంటర్లు, మౌలిక సదుపాయాలు, స్టూడియోలు, కోప్రొడక్షన్లకు ప్రోత్సాహకాలు, అంతర్జాతీయ కంటెంట్ సృష్టికర్తలు, పెట్టుబడిదారులతో బలమైన భాగస్వామ్యాలుగా ఉన్నాయన్నారు. సినిమా, ఒటిటి, డిజిటల్ మీడియా, గేమింగ్, ఈస్పోర్ట్స్, ఎక్స్ఆర్, మెటావర్స్, వర్చువల్ ప్రొడక్షన్, క్రియేటర్ ఎకానమీ ఇవన్నీ కలిసి కొత్త విశ్వాన్ని సృష్టిస్తున్నాయని, ఎఐ, స్పేషియల్ కంప్యూటింగ్, వర్చువల్ సెట్లు ఇవి సృజనను కొత్త స్థాయికి తీసుకెళ్తున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు.




## లైఫ్ సైన్సెస్ రంగంలో రూ.63 వేల కోట్ల పెట్టుబడులు


మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



ప్రజాపక్షం/హైదరాబాద్: తమ ప్రభుత్వం అమలు చేస్తున్న పరిశ్రమల అనుకూల విధానాల వల్ల గడచిన రెండేళ్లలో ఒక్క లైఫ్ సైన్సెస్ రంగంలోనే రూ.63 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ లో మంగళవారం ఫ్యూచర్ సిటీపై జరిగిన చర్చాగోష్ఠిలో ఆయన ప్రసంగించారు. తెలంగాణా గ్లోబల్ వ్యాక్సిన్స్ కేంద్రంగా గా అవతరించిందని ఆయన వివరించారు. కరోనా సమయంలో ప్రపంచం మొత్తానికి తాము అండగా నిలిచామని తెలిపారు. వంద బిలియన్ డాలర్ల విలువైన 2,000 ఫార్మా కంపెనీలు రాష్ట్రంలో ఉన్నాయని ఆయన వెల్లడించారు. ప్రపంచంలో పది పెద్ద ఫార్మా కంపెనీల్లో 8 తెలంగాణాలో ఉన్నాయన్నారు. గత ప్రభుత్వాల తీసుకున్న నిర్ణయాలను, విధానాలను కొనసాగిస్తూ పారిశ్రామిక రంగానికి ఏ ఆటంకాలు లేకుండా చూస్తున్నట్టు శ్రీధర్ బాబు చెప్పారు. అంతర్జాతీయ స్థాయి లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటుకు తాము సిద్ధంగా ఉన్నామని వివరించారు. ఇండస్ట్రీ పెద్దల భాగస్వామ్యంతో నిపుణులైన వర్క్ ఫోర్స్‌ను తయారు చేస్తామని చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ కూడా పరిశ్రమల భాగస్వామ్యంతోనే ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేసారు. అందులో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ రెండు బ్యాచ్‌ల విద్యార్థులకు శిక్షణ నిచ్చి ఉద్యోగావకాశాలు కల్పించిందని తెలిపారు. భవిష్యత్తులో విద్యుత్తు కొరత లేకుండా కొత్త గ్రీన్ ఎనర్జీని పాలసీని తమ ప్రభుత్వం రూపొందించిందని శ్రీధర్ బాబు తెలిపారు.

# మూసీ పునరుద్ధరణే హైదరాబాద్ భవిష్యత్తు

## పట్టణాభివృద్ధి నిపుణుల ఉద్ఘాటన




(గ్లోబల్ సమ్మిట్ నుంచి ఇ.చంద్రశేఖర్)

నదుల సహజ ప్రవాహానికి ఆటంకం కలగకుండా కొనసాగితేనే మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు పునరుద్ధరణ ఫలిస్తుంది, లేదం టే అన్ని ప్రయత్నాలు వ్యర్థమవుతాయని పట్టణాభివృ ద్ధి రంగానికి చెందిన పలువురు నిపుణులు అన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో మంగళవారం జరిగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో 'మూసీ రీజ్యూవెనేషన్ అండ్ బ్లూగ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్ హైదరాబాద్' అంశంపై ఏర్పాటు చేసిన చర్చ గోష్ఠిలో పలువురు నిపుణులు తమ అభిప్రాయాలు వెల్లడించారు.

### నదుల హక్కు కాపాడాలి

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మూసీ పునరుద్ధరణ యత్నాలను అభినందిస్తు నదులు, చెరువులు, అడవులను రక్షించడం రాజ్యాంగపరమైన బాధ్యత అని గుర్తు చేశారు. మూసీని పునరుద్ధరిస్తామంటే, మొదట నది ప్రవాహ హక్కు ఏమిటో తెలుసుకోవాలి, అని చెప్పారు. రాజస్థాన్‌లో 10–12 ఏళ్ల పాటు నదుల పునరుద్ధరణకు శ్రమించిన అనుభవాన్ని పేర్కొంటూ, ప్రాజెక్టులు ప్రజల జీవనశైలికి అనుసంధానంగా ఉండాలని సూచించారు.

*-వాటర్‌మాన్ ఆఫ్ ఇండియా రాజేందర్ సింగ్ ..*

### డ్రైన్ కాదు .. మళ్లీ నది కావాలి

వరల్డ్ బ్యాంక్ మాజీ పర్యావరణ నిపుణుడు తపస్ పాల్ మాట్లాడుతూ, మూసీ పునరుద్ధరణ ప్రణాళికను అత్యంత కీలకమైనదిగా అభివర్ణించారు. ఎప్పుడో జీవనాడిగా ఉన్న మూసీని మనమే డ్రెయిన్‌గా మార్చేశాం. దాన్ని మళ్లీ నదిగా మార్చే సంకల్పం ఉండాలి. హైదరాబాద్ చేయలేకపోతే ఇతర నగరాలు చేయలేవు, అని స్పష్టం చేశారు.

*- వరల్డ్ బ్యాంక్ మాజీ నిపుణుడు..*

### దేశంలో అత్యంత ప్రభావవంతమైన ప్రాజెక్ట్ అవుతుంది

ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్ సీనియర్ వాటర్ రిసోర్సెస్ నిపుణులు అలెక్సియా మైకల్స్ మాట్లాడుతూ, బ్లూగ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో ప్రజల భాగస్వామ్యాన్ని తప్పనిసరి అంశంగా చూడాలని సూచించారు. ఎ డి బి బ్యాంక్ ఇటీవల నీటి వనరుల పునరుద్ధరణకు 10 బిలియన్ డాలర్లను కేటాయించినట్లు తెలిపారు. చైనాలోని షినాన్ నది ప్రాజెక్ట్‌కు దీర్ఘకాలిక మద్దతు అందించినట్లు గుర్తుచేశారు. మూసీ పునరుద్ధరణ భారత్‌లో అత్యంత ప్రభావవంతమైన పర్యావరణ, సామాజిక ప్రాజెక్ట్ అవుతుంది, అని పేర్కొన్నారు.

### మూసీ–గోదావరి లింక్ లక్ష్యం

చర్చ గోష్టిలో తెలంగాణ మంత్రి డి.శ్రీధర్ బాబు మాట్లాడుతూ, మూసీ పునరుద్ధరణను దేశానికి బెంచ్ మార్క్‌గా నిలపాలని ప్రభుత్వ లక్ష్యమని చెప్పా రు. 155 కి.మీ. పొడవైన మూసీ నదిని మళ్లీ స్వచ్ఛమైన నదిగా మార్చడమే ముఖ్య లక్ష్యం. సిఎం ప్రత్యే క ఆజెండా ప్రకారం మూసీని గోదావరి నదితో లింక్ చేసి, ఎప్పటికప్పుడు ప్రవాహం ఉండేలా చేస్తామని తెలిపారు. ఒఆర్ఆర్ లోపల 476 చెరువులు, బయట 2,786 చెరువుల పునరుద్ధరణ జరుగుతోందని, కోత్వాల్ గూడలో 85 ఎకరాల్లో 90రకాల పక్షు, జంతు జాతులతో ఎకో పార్క్ నిర్మాణం జరుగుతోందని వివరించారు.

*- తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు*

### నైట్ ఎకానమీకి కూడా అనిలయం

మూసీ నగర ఆర్థిక వ్యవస్థకు మరలా జీవనాడిగా మారాలని ఎం ఆర్ డి సి మేనేజింగ్ డైరెక్టర్ ఇవి. నరసింహ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మూసీ పునరుద్ధరణ అంటే కొత్త ఆర్థిక వ్యవస్థ, నైట్ ఎకానమీకి దారితీయడం. మూసీ మళ్లీ హైదరాబాద్‌కు జీవనాడిగా మారాలి అని ఆయన అన్నారు.

*- ఎంఆర్‌డిసి*

## ఇందిరమ్మ చీర కట్టులో మంత్రి కొండా సురేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రైజింగ్... గ్లోబల్ సమ్మిట్‌లో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ లోకల్ అట్రాక్షన్‌గా నిలిచారు. గ్లోబల్ సమ్మిట్‌లోకి మంత్రి సురేఖ ఇందిరమ్మ చీరలో అడుగు పెట్టిన క్షణం మొదలు... అందరూ ఆత్మీయంగా ఆమెను పలకరించారు. తొలుత డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి, జూపల్లి కృష్ణారావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమెను కలిసిన ప్రతి ఒక్కరూ... సురేఖక్క... ఇందిర్మమ్మ చీర బాగుంది అంటూ కితాబిచ్చారు. సమ్మిట్ త ర్వాత వివిధ స్టాల్స్‌ను పరిశీలిస్తున్న సందర్భంలో మంత్రి సురేఖతో... అందరూ సెల్ఫీలు తీసుకునేందుకు ఆసక్తి చూపించారు. సురేఖమ్మ... ఇందిరమ్మ చీర అదుర్స్ అంటూ చెప్పుకొచ్చారు.






(గ్లోబల్ సమ్మిట్ నుంచి బి.వాసుదేవరాజు)

# ఎకో టూరిజం అభివృద్ధికి తెలంగాణలో విస్తృత అవకాశాలు

## గ్లోబల్ సమ్మిట్ చర్చాగోష్టిలో మంత్రి కొండా సురేఖ

తెలంగాణ రాష్ట్రంలో 7,200 చ.కి.మీ విస్తీర్ణంలో ఉన్న రక్షిత వన్యప్రాంతాలు, సహజసిద్ధమైన ప్రకృతి, ఈ ఎకో టూరిజం అభివృద్ధికి విస్తృతమైన అవకాశాలు కల్పిస్తున్నదని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ లో జరుగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ స మ్మిట్‌లో టెంపుల్ టూరిజంఎకో టూరిజం అం శంపైపై జరిగిన చర్చాగోష్టిలో కొండా సురేఖ మాటల్లో..' తెలంగాణ రాష్ట్ర మొత్తం భూభాగం 1,12,077 చ.కి.మీ. కాగా, అందులో 21,179 చ.కి.మీ మేర అడవులు విస్తరించి ఉన్నాయి. ఇది మొత్తం భూభాగంలో 18.89 శాతంగా ఉం ది. అటవీ వెలుపల ఉన్న ఇతర చెట్లతో (3,518 చ.కి.మీ, 3శాతం) కలిపి రాష్ట్రంలో ఉన్న మొ త్తం పచ్చదనం 24,697 చ.కి.మీ (22శాతం) గా నమోదైంది.ఓ వైపు ప్రకృతిని కాపాడుతూనే మరోవైపు స్థానిక ప్రజల జీవనోపాధులను పెంచే బాధ్యతాయుత ఎకో టూరిజాన్ని ప్రోత్సహించ దం లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందడుగు వేస్తుంది. సరస్సులు, గడ్డి భూములు, జాతీయ ఉద్యానవనాలు, అమ్రాబాద్ కవ్వాల్ వంటి ప్రముఖ టైగర్ రిజర్వులతో రాష్ట్రం సహజసిద్ధమైన సంపదను కలిగి ఉంది. పర్యాటక విధానం 2025–30, ఎకోటూరిజం ఫ్రేమ్ వర్కును ప్రవేశపెట్టి, తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థను నోడల్ ఏజెన్సీగా నిర్ణయించడం జరిగింది. 'తక్కువ నిర్మాణాలు ఎక్కువ అనుభవం' అన్న నినాదంతో పర్యావరణానికి హానీ లేకుండా సందర్శకులకు వన్యప్రదేశ అనుభవం అందించడమే ఈ స్లోగన్ ప్రధాన ఉద్దేశ్యం. ప్రైవేటు రంగంతో కలిసి కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉద్యోగాలు, శిక్షణ, హాస్పిటాలిటీ నైపుణ్యాలు అందించడం ద్వారా ఎకోటూరిజాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళుతున్నం.రాష్ట్రంలో 13 ఎకోటూరిజం సర్క్యూట్లు ఏర్పాటు చేయగా, రామప్పశ్రీశైలం లాంటి వారసత్వఆధ్యాత్మిక కేంద్రాలను ప్రకృతి పర్యాటకంతో అనుసంధానిస్తున్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వులో పులుల సంఖ్య గణనీయంగా పెరిగి 2024 నాటికి 36కు చేరుకున్నది. ఇది పులుల సంరక్షణలో రాష్ట్ర విజయాన్ని ప్రతిబింబిస్తోంది.నందిపేట, తాడ్వాయి, పాఖాల్ వంటి కొత్త ఎకోటూరిజం ప్రదేశాలు అభివృద్ధి దశలో ఉన్నాయి. త్వరలో గైడెడ్ ఫారెస్టు ట్రెక్కులు, ఆన్లైన్ బుకింగ్ యాప్ కూడా అందుబాటులోకి రానున్నది. ఎకోటూరిజం ద్వారా 2047 నాటికి నెట్ జీరో లక్ష్యాల ను చేరేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తున్నది.ఇక దేవాదాయ శాఖలో 12,434 దేవాలయాలు కలవు. అందులో 695 దేవాలయాలు ఆదాయము కలిగి ఉన్నవి. సుమారుగా 3,505 దేవాలయాలకు, ఆయా దేవాలయాలకు కలిగినటువంటి భూముల ద్వారా వచ్చేటువంటి ఆదాయాల ద్వారా, దేవాదాయ శాఖ ద్వారా నిర్వహించబడుతున్నాయి. ప్రస్తు తం 6,439 ఎటువంటి ఆదరణకు నోచుకోనటువంటి దేవాలయాలకు నిత్య ధూప దీప నైవేద్యం నిమిత్తం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుంది అని తెలిపారు. ఈ ప్యానెల్ డిస్కషన్‌లో రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు, టూరిజం కార్పొరేషన్ ఎండి వల్లూరి క్రాంతి, రామోజీ ఫిలిం వైస్ ప్రెసిడెంట్ ఎవి రావు, ఎక్స్పీరియం పార్క్ సిఇఒ రామ్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రతి కుటుంబానికి సొంతిల్లు – ప్రభుత్వం సంకల్పం'

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఉన్నతమైన ప్రమాణాలతో నివసించేందుకు అనువైన సొంత ఇంటి వసతిని కల్పించాలనేది ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ముఖ్యంగా అన్ని వర్గాల ప్రజలకు అనువుగా ఉండే ధరల్లో ఒక సమగ్ర విధాన రూపకల్పనకు 'తెలంగాణా రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్' చక్కటి వేదిక అని ఆయన అన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న 'తెలంగాణా రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్' లో భాగంగా మంగళవారం 'అఫర్డ్ బుల్ హౌసింగ్ పాలసీ ఫర్ అర్బన్ ఫ్యూచర్ తెలంగాణా మోడల్ 2047' అనే అంశంపై జరిగిన సదస్సులో మంత్రి కీలక ఉపన్యాసం చేశారు. నూతన విధాన రూపకల్పనపెరుగుతున్న పట్టణీకరణ, విస్తృతమవుతున్న గృహ అవసరాలను దృష్టిలో ఉంచుకుని దేశానికి ఆదర్శంగా ఉండేలా ఆర్థికంగా సాధ్యమైన, పర్యావరణ పరిరక్షణకు అనుగుణమైన, సాంకేతికత ఆధారిత అంశాలతో కూడిన సమగ్ర పాలసీని రూపొందిస్తున్నామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించే విధానాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రోల్ మోడల్‌గా నిలుస్తాయని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ పథకం ద్వారా ఇప్పటివరకు 42 లక్షల ఇళ్లు నిర్మించగా, ప్రస్తుతం ఇందిరమ్మ ఇండ్ల కింద 3.5 లక్షల ఇండ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మధ్యతరగతి కోసం హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ద్వారా సుమారు ఒక లక్ష ఇళ్లు నిర్మించామని చెప్పారు. అయినప్పటికీ రాష్ట్రంలో గృహాల డిమాండ్ సరఫరా మధ్య పెద్ద అంతరం కొనసాగుతోందని, దీన్ని పూడ్చేందుకు ఆదాయంతో సంబంధం లేకుండా ప్రతీ వర్గానికీ అందుబాటులో గృహాలు కల్పించే సమగ్ర పాలసీ రూపొందిస్తున్నామన్నారు. కొత్త అఫర్డ్ బుల్ హౌసింగ్ పాలసీలో తాజాగా ప్రకటించిన క్యూర్, ప్యూర్, రేర్ జోన్‌లకు అనుగుణంగా విధానాలు రూపొందిస్తున్నామన్నారు. ఈ కా ర్యక్రమంలో ప్రపంచ బ్యాంకు ప్రతినిధి అభిజిత్ శంకర్ రే, రాంకీ సిఎండి నందకిషోర్, హడ్కో ఎం.డి వి. సురేష్, క్రెడై అధ్యక్షుడు జి. రామ్ రెడ్డి, ఎఎస్‌బిఎల్ సిఈఓ అజితేష్, సిబిఆర్‌ఈ ప్రతినిధి ప్రీతం మెహెరా తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక రంగంలో రూ.7,045 కోట్ల పెట్టుబడులు

సిఎం-, మంత్రి జూపల్లి సమక్షంలో ఎంఒయులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులు వెల్లువెత్తాయి. కందుకూరులోని భారత్ ఫ్యూచర్ సిటీలో మంగళవారం జరిగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండో రోజున, పర్యాటక రంగంలో ఏకంగా రూ.7,045 కోట్ల పెట్టుబడి నిబద్ధతలు రాష్ట్రానికి దక్కాయి. సమిట్ ప్రాంగణంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో దేశీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ పెట్టుబడుల ద్వారా 40 వేల మందికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని, ఇందులో ప్రత్యక్షంగా10 వేల, పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి లభిస్తుందని ఆశిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, టిజిటిడిసి మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరు, తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



### పెట్టుబడుల వివరాలు ఇలా ఉన్నాయి..

- రూ. 3,000 కోట్లు ఫుడ్‌లింక్ ఎఫ్‌బి హోల్డింగ్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
- భారత్ ఫ్యూచర్ సిటీలో పిపిపి పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గ్లోబల్ కన్వెన్షన్, ట్రేడ్ &ఎగ్జిబిషన్ సెంటర్
- రూ. 1,000 కోట్లు డ్రీమ్‌వ్యాలీ గోల్ఫ్ & రిసార్ట్స్ , భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచస్థాయి గోల్ఫ్ డెస్టినేషన్
- రూ.1,000 కోట్లు సారస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ భారత్ ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ సాంస్కృతిక కేంద్రం
- రూ.800 కోట్లు అట్మాస్ఫియర్ కోర్ హోటల్స్ (మాల్దీవులు) హైదరాబాద్‌లో ఎలైట్ అంతర్జాతీయ వెల్‌నెస్ రిట్రీట్ (అగ్రశ్రేణి అంతర్జాతీయ ఆరోగ్య కేంద్రం)
- రూ.300 కోట్లు పోలిన్ గ్రూప్ (టర్కీ) మల్టీవర్స్ హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి ఆక్వా మెరైన్ పార్క్ & ఆక్వా టన్నెల్
- రూ. 300 కోట్లు ఫ్లూయిడ్రా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (స్పెయిన్) హైదరాబాద్‌లో కృత్రిమ బీచ్ , లగూన్ & రిసార్ట్ ప్రాజెక్ట్
- రూ. 300 కోట్లు శ్రీ హవిష హాస్పిటాలిటీ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ హైదరాబాద్‌లో స్మార్ట్ మొబిలిటీ వెల్‌నెస్ రిసార్ట్ & కన్వెన్షన్ సెంటర్
- రూ. 200 కోట్లు కేఈఐ గ్రూప్ & అసోసియేట్స్ (కామినేని గ్రూప్) కిస్మత్‌పూర్ గ్రామం, గండిపేట వద్ద గ్లాస్‌హౌస్‌గ్రీన్‌హౌస్ కన్వెన్షన్ సెంటర్
- రూ. 120 కోట్లు రిధిరా గ్రూప్, యాచారం, భారత్ ఫ్యూచర్ సిటీ వద్ద నోవోటెల్ బ్రాండెడ్ హాస్పిటాలిటీ ప్రాజెక్ట్
- రూ. 25 కోట్లు సలాం నమస్తే దోస హట్ ప్రైవేట్ లిమిటెడ్ (ఆస్ట్రేలియా) విజ్యాగ్ రిక్రియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ అడ్వెంచర్&ఈకోటూరిజాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్రమంతటా కారవాన్ పార్కులు

## బిఆర్ఎస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** బిఆర్ఎస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తాళ్ళఖమ్మంపహాడ్ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా పార్టీ బలపర్చిన మండవ వీరాంజనేయులను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి జరిగిన అభివృద్ధి తప్ప కొత్తగా చేసిందేమి లేదన్నారు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల వల్లనే ఏ అభివృద్ధి జరగడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో తిరిగి బిఆర్ఎస్ పార్టీయే అధికారంలోకి రానున్నదని జోస్యం చెప్పారు. అందుకే గ్రామ పంచాయితీ ఎన్నికల్లో బిఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్, వార్డు సభ్యులను ప్రజలు గెలిపించుకోవాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో అంతా ఏకమై కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి జీడి బిక్షం, రఫీతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## మరణించిన వ్యక్తి అవయవాల దానం




**ప్రజాపక్షం/మోటకొండూరు :** ఈనెల 4న కాటేపల్లి గ్రామానికి చెందిన పల్లపు ప్రశాంత్ (27) రాయగిరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో వైద్యులు బ్రెయిన్ డెడ్ అయినట్లు ప్రకటించారు. మానవతా విలువలను నిలబెట్టుతూ ప్రశాంత్ కుటుంబ సభ్యులు ఆయన అవయవాలను జీవందాన్ సంస్థకు అందజేశారు. ఈ మహోన్నత నిర్ణయం మరో కొంత మందికి కొత్త జీవితం అందించింది. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు చిన్న పిల్లలు ఉన్నారు.

## మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్య



**ప్రజాపక్షం/నలగొండ టౌన్ :** పట్టణంలోని రవీందర్ నగర్ బిసి ఈ హాస్టల్‌లో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని శృతి ఇంట్లో పెళ్లిచూపులు జరుగుతున్న నేపథ్యంలో తీవ్రమైన మనస్తాపం చెంది ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నల్లగొండ పట్టణంలో చోటు చేసుకుంది. మృతురాలు కొత్తల మర్రిగూడెం గ్రామానికి చెందిన శృతిగా గుర్తించారు. ఉన్నత చదువులు కొనసాగించాలని కోరుకున్న శృతికి పెద్దలు పెళ్లి నిర్ణయంతో మనస్థాపానికి గురి అయ్యిందని స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు. శృతి హాస్టల్లో స్నానానికి వెళ్లి బాత్రూంలో చాలా సేపు బయటికి రాకపోవడంతో తోటి విద్యార్థులకు అనుమానంతో తలుపు తెరిచిన హాస్టల్ విద్యార్థులు విషాద దృశ్యం చూసి హాస్టల్ సిబ్బంది, తోటి విద్యార్థులు షాక్ అయ్యారు. సమాచారం అందుకున్న టూ టౌన్ ఎస్ఐ సైదులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## భారీ శబ్దంతో పేలిన ట్యాంక్



**ప్రజాపక్షం/చివ్వెంల :** భారీ శబ్దంతో ట్యాంక్ పేలిన సంఘటన చివ్వెంల మండలంలోని బీబీగూడెం శివారులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బీబీగూడెం సమీపంలోని బాలాజీ లైట్‌వెయిట్ బ్రిక్స్ కంపెనీలో పీడన ఫోమ్ తయారీ ట్యాంక్ ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలిపోయిందని తెలిపారు. దాంతో దాని చుట్టూ ఉన్న కంపెనీకి సంబంధించిన నిర్మాణాలు దెబ్బతిన్నాయి. ఆ సమయంలో కార్మికులు గాని, చుట్టుపక్కల జనాలు గాని ఆ ప్రాంతంలో లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఇటువంటి ప్రమాదకరమైన యూనిట్లు జనావాసాల మధ్య ఉండడం ఎప్పటికైనా ప్రమాదమేనని ఈ ప్రాంతం నుండి కంపెనీని తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఇంట్లో చోరీ... మూడు తులాల బంగారం అపహరణ



**ప్రజాపక్షం/మునుగోడు:** ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దొంగలు ఇంట్లోకి దూరి మూడు తులాల బంగారం పదివేల రూపాయలు దొంగలించిన సంఘటన మంగళవారం మునుగోడు మండల కేంద్రంలో శివాలయం పక్కన చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన దొమ్మటి రామకృష్ణ పని నిమిత్తం ఇద్దరు భార్యాభర్తలు వ్యవసాయ పనులకు వెళ్ళగా తిరిగి మూడు గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చేసరికి ఇంట్లో వస్తువులు చిందరవందంగా పడి ఉండడానికి గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలాన్ని స్థానిక ఎస్సై ఇరుగు రవి పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం ఆధారాలను సేకరించారు.. ఇట్టి విషయంపై కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పొనుగోడు గ్రామ శివారులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన జలగం సిద్దయ్య (45) అనే వ్యక్తి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కల్టివేటర్ తగిలి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన సిద్దయ్యను 108 సాయంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమద్యలో చనిపోయినట్లు తెలిపారు. చీకట్లో ట్రాక్టర్ డ్రైవర్ ఆజాగ్రత్తగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. సిద్దయ్య అప్పన్నపేట గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 7వ వార్డు సభ్యుడి అభ్యర్థిగా పోటీ చేస్తున్నాడు. ఊహించని విధంగా రోడ్డు ప్రమాదంలో సిద్దయ్య చనిపోవడంతో గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

## అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి :** గ్రామల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమౌతుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మంగళవారం నార్కెట్‌పల్లి మండలంలోని ఏనుగుల దోరీ గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి రేగట్టె రజితవెంకట్ గోపాల్ రెడ్డి, బ్రాహ్మణవెల్లంల గ్రామ సర్పంచ్ అభ్యర్థి చిరుమర్తి ధర్మయ్య,చౌడంపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి దామెర సుధ నవీన్, కొండపాకగూడెం గ్రామ సర్పంచ్ అభ్యర్థి తిరుగుడు నాగేశ్, చిన్ననారయణపురం గ్రామ సర్పంచ్ అభ్యర్థి మోరుగు అనిత సత్తయ్యలకు, వార్డు సభ్యులకు మద్దతుగా ప్రచారాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత,మండల పార్టీ అధ్యక్షులు బత్తుల ఉషయ్య,జిల్లా నాయకులు బండ సాగర్ రెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విజయ్ దివస్

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** విజయ్ దివాస్ సందర్భంగా బిఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి చౌరస్తా నుండి అమరవీరుల స్తూపం వరకు ర్యాలీగా వెళ్లి అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మాజీ శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ చరిత్రలో డిసెంబర్ 9 ఎంతో ప్రాముఖ్యత కలిగిన రోజు అని కెసిఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి అప్పటి ప్రభుత్వం మెడలు వంచి తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటింప చేసుకొని విజయం సాధించిన సందర్భంగా ఈ రోజున విజయ్ దివాస్‌గా చేసుకుంటున్నామని, అదేవిధంగా ఈ రాష్ట్ర సాధన కోసం అసువులు బాసిన అమరవీరులందరినీ స్మరించుకొని వారికి నివాళులర్పించడం మన బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు, బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పకడ్బందీగా పంచాయతీ ఎన్నికలు

కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నలగొండ :** గ్రామపంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం ఆమె కనగల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల సామాగ్రిని, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బాక్సులను పరిశీలించారు. అలాగే సాయిరాం ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించి అక్కడ కావలసిన పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. ఓటరు జాబితా వివరాలు సరిగా ఉన్నాయో లేదో తనిఖీ చేసుకోవాలన్నారు. బ్యాలెట్ పత్రాలు జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు. బ్యాలెట్ బాక్స్‌లు అన్ని ఓపెన్ అవుతున్నాయో లేదో చెక్ చేసుకోవాలని, డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కల్పించాలని, చివరిగా ఉన్న పోలింగ్ కేంద్రాలకు ముందుగా బస్సులను పంపించాలని చెప్పారు. జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జడ్‌పి సీఈఓ శ్రీనివాసరావు, ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, తహసిల్దార్ పద్మ, ఎంపీడీవో వేద రక్షిత, ఎంఈఓ పద్మ కలెక్టర్ వెంట ఉన్నారు.

**మూడవ విడత ర్యాండమైజేషన్**

మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న పోలింగ్ కేంద్రాలలో విధులు నిర్వహించే సిబ్బందికి సంబంధించిన మూడవ విడత ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకురాలు, కొర్రా లక్ష్మీ సమక్షంలో, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించడం జరిగింది. నల్లగొండ, చండూరు డివిజన్లలోని 14 మండలాలలో మొదటి విడతగా 2870 పోలింగ్ కేంద్రాలలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకుగాను పిఓ, ఓపిఓలు రెండవ ఓపిఓ మొత్తం కలుపుకొని 7892 మందిని విధులు నిర్వహించే విధంగా రాండమైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఇందులో పిఓలు 3444, ఓపిఓలు 4448 మంది ఈ ర్యాండమైజేషన్‌లో ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని కేటాయించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్‌పి సీఈఓ శ్రీనివాసరావు, ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి, కలెక్టర్ కార్యాలయ ఏఓ మోతిలాల్, ఈడియం దుర్గారావు, ఎన్ఐసి అధికారులు ప్రేమ్, తదితరులు హాజరయ్యారు.

# నెహ్రూ చరిత్రను చెరిపేయడం అసాధ్యం

పార్లమెంట్‌లో తెలుగులో మాట్లాడుతూ అందరిని ఆకట్టుకున్న ఎంపి చామల



**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** లోక్‌సభ శీతాకాల సమావేశాల సందర్భంగా 'వందేమాతరం' జాతీయ గేయంపై జరిగిన చర్చను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా సమస్యల నుండి ప్రజల దృష్టిని మరల్చడానికి వాడుకుంటోందని భువనగిరి కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై, ముఖ్యంగా ప్రజా సమస్యలను విస్మరించడంపై ఆయన తెలుగులో మాట్లాడుతూ విమర్శలు గుప్పించారు. 'వందేమాతరం' గీతాన్ని రచించి 150 ఏళ్లు అవుతున్న సందర్భంగా రాబోయే తరాలకు స్ఫూర్తిని అందించడానికి బదులు, ఈ చర్చను ప్రతిపక్షాలను నిందించడానికి కేంద్రం వినియోగిస్తోందని ఎంపీ విమర్శించారు. దేశ ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చరిత్రను చెరిపివేయాలని చూడటం అసాధ్యమని కిరణ్‌కుమార్‌రెడ్డి గట్టిగా చెప్పారు. 'నెహ్రూ దేశానికి మొదటి ప్రధాని ఆయన పంచవర్ష ప్రణాళికలు, ఐఐటీలు, ఐఐఎంలు, స్టీల్ ప్లాంట్లు, బీహెచ్‌ఈఎల్, ఇక్రిశాట్, ఎల్ఐసీ లాంటి సంస్థలు నెలకొల్పారు. రైతుల కోసం భాక్రానంగల్, నాగార్జున సాగర్ లాంటి ప్రాజెక్టులను కట్టిన నెహ్రూ చరిత్రను చెరిపివేయగలరా?' అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'తెలంగాణ రైజింగ్'లో భాగంగా గ్లోబల్ సమ్మిట్ ఏర్పాటు చేశారని, త్రీ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారని తెలిపారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలకే కాకుండా, అన్ని రాష్ట్రాలకు నిధులు, ప్రాజెక్టులు కేటాయించాలని కేంద్రాన్ని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వచ్చి ప్రధానమంత్రి మోదీని, కేంద్ర మంత్రులను కలిసి ట్రిపుల్ ఆర్, మెట్రో రెండవ పేజ్, మూసీ పునరుజ్జీవం గురించి చర్చించారని వెల్లడించారు. వికసిత్ భారత్‌తో పాటు తెలంగాణ రైజింగ్‌ను కలిపి ముందుకు తీసుకువెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. రాజకీయాలు, కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టడం ద్వారా దేశానికి నష్టం జరుగుతుందని కిరణ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు.

# పోస్టల్ బ్యాలెట్ సద్వినియోగం

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** గ్రామ పంచాయితీ ఎన్నికల్లో భాగంగా రెండు, మూడు విడతలలో విధులకు నియమించబడిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రెండవ విడత అనంతగిరి, చిలుకూరు, చివ్వెంల, కోదాడ, మోతె, మునగాల, నడిగూడెం, పెన్‌పహాడ్ మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఇందుకు సంబంధించి అక్కడ విధులు నిర్వహించేందుకు నియమించబడిన ఉద్యోగులు ఈనెల 7 నుండి 10 వరకు ఆయా మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాలలో పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. అలాగే మూడవ విడత ఎన్నికలు జరిగే చింతలపాలెం, గరిడేపల్లి, హుజూర్‌నగర్, మఠంపల్లి, మేళ్ళచెర్వు, నేరేడుచర్ల, పాలకీడు మండలాలలో విధులు నిర్వహించేందుకు నియమించబడిన ఉద్యోగులు ఈనెల 10, 12, 13, 15 తేదీలలో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికలకు నియమించబడిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉపయోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

# వలిగొండలో స్వీప్ -2025 ఓటర్‌పై అవగాహన




కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/వలిగొండ :** ఓటర్లు తమ ఓటు హక్కును డబ్బుకు, మద్యానికి, తదితర వసతులకు లోబడకుండా సరైన నాయకులను ఎంచుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఓటర్లకు సూచించారు. మంగళవారం గ్రామ పంచాయితీ ఎన్నికల్లో భాగంగా రెండవ విడత ఎన్నికలు జరగనున్న వలిగొండ మండల కేంద్రంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వీప్ 2025 ఓటర్ అవగాహన, చైతన్య కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హనుమంతరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలు డబ్బులు, మద్యానికి, బిర్యాని ప్యాకెట్లకు, ఇతర కానుకలకి కాకుండా స్వచంధంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఇటీవల బొమ్మలరామారం మండలంలో ఈ అవగాహన కార్యక్రమం చేపట్టిన తర్వాత జలాల్ పూర్ గ్రామస్థులు స్వచంధంగా వాళ్ళ ఇండ్ల ముందు మద్యానికి, డబ్బులకు ఓటును అమ్ముకోము అని బోర్డులు ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ మార్పు అనేది ఎవరో ఒకరి దగ్గర నుండి అని కాకుండా నా ఇంటి నుండి మొదలు అవ్వాలని అనుకోవాలని తెలిపారు. ఒక మంచి నాయకులను ఎన్నుకుంటే రానున్న 5 సంవత్సరాలలో మీ గ్రామ అభివృద్ధి ఆధారపడి ఉంటుందని తెలిపారు. గ్రామ ఓటర్లు అవగాహన కార్యక్రమాలకు స్పందించి తమ ఓటును గ్రామాల అభివృద్ధి కొరకు కృషి చేసే నాయకులను ఎంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మొదటి విడత ఎన్నికల నిర్వహణకు సంసిద్ధం

జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి నాయక్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణకు సంసిద్ధంగా ఉన్నట్లు గ్రామ పంచాయితీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు రవి నాయక్ రాష్ట్ర ఎన్నికల కమీషనర్ రాణికుమిదినికి తెలిపారు. మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమీషనర్ రాణికుముదిని హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు, గ్రామ పంచాయితీ ఎన్నికల పరిశీలకులతో గ్రామ పంచాయితీ ఎన్నికలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు రవి నాయక్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో మొదటి విడతన ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రతిరోజు తాను నామినేషన్ కేంద్రాలను, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించానని, ఎన్నికల సందర్భంగా అవసరమైన సమావేశాల నిర్వహణ, ప్రవర్తన నియమావళి అమలు, రూట్స్ అన్నింటిని పరిశీలించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ మొదటి విడతన సూర్యాపేట జిల్లాలో 8 మండలాల్లో, 152 గ్రామ పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలను పర్యవేక్షించడం జరిగిందన్నారు. పోలింగ్ సిబ్బందిని నియమించి ఉత్తర్వులు జారీ చేశామని, ఈనెల 10న మరోసారి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను తనిఖీ చేస్తామని వివరించారు. పోలింగ్ రోజున రిపోర్టులు పంపించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలింగ్ తర్వాత కౌంటింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు, ఉపసర్పంచ్ ఎన్నికలకు సైతం ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. జిల్లా ఎస్‌పి నరసింహ మాట్లాడుతూ మొదటి విడత గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేశామని వెల్లడించారు. గ్రామ పంచాయితీ ఎన్నికల జిల్లా వ్యయ పరిశీలకులు హుస్సేన్, జిల్లా పంచాయితీ అధికారి యాదగిరి, జడ్‌పి సిఈఓ వివి అప్పారావు, ఎక్సైజ్ సూపరింటిండెంట్ లక్ష్మ ణ్ నాయక్ ఉన్నారు.

## ఎన్నికల నిర్వహణకు పటిష్ట భద్రత

ఎస్‌సి శరత్ చంద్ర పవార్



**ప్రజాపక్షం/నలగొండ టౌన్:** జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎస్‌సి శరత్ చంద్ర పవార్ వెల్లడించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో మూడు దశల్లో 869 గ్రామ పంచాయతీల్లో జరిగే ఎన్నికలకు ఒక అడిషనల్ యస్పి, ఆరుగురు డియస్పిలు, 23 మంది సీఐలు 84 మంది ఎస్‌ఐలతో కలిపి 1680 మందితో పటిష్ట భద్రత ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ముఖ్యంగా జిల్లా వ్యాప్తంగా 442 గ్రామపంచాయతీలను సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రతీ పోలింగ్ స్టేషన్ పరిధిలో అదనపు బలగాలు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, రూట్ మొబైల్ పార్టీ అదనంగా పర్యవేక్షిస్తుంది. ఎలాంటి ఇబ్బంది లేదా సమస్య తలెత్తినా అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం అన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా ఎవరైనా నగదు, మద్యం, ఇతరత్రా వస్తువులను ఎవరైనా పంపిణీ చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కి సమాచారం అందజేయాలని కోరారు. ఎన్నికల నియమావళి ప్రకారం పోలీసులు చేపట్టే చర్యలను అతిక్రమిస్తే అట్టి వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి



ఎమ్మెల్యే మందుల సామేల్


**ప్రజాపక్షం/అర్వపల్లి :** కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఓటర్లను కోరారు. మొదటి విడత ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని అర్వపల్లి, జాజిరెడ్డిగూడెం, తిమ్మాపురం, అడివెంల, కాసర్లపాడు గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని నన్ను ఆదరించినట్లు ప్రజలు పార్టీ సర్పంచ్‌లను, వార్డు సభ్యులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ వీరవల్లి సోమిరెడ్డి, సామ అభిషేక్‌రెడ్డి, గుడిపల్లి మధుకర్ రెడ్డి, ఇందుర్తి వెంకటరెడ్డి, జీడి వీరస్వామి, కొరపిడత అవిలయ్య, బైరబోయిన మహారాజు ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభ్యర్థులు పాల్గొన్నారు.

## పల్లె ప్రగతి కాంగ్రెస్‌తోనే సాధ్యం



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. మండలంలోని యర్కారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి కుంటిగొర్ల శ్రీనివాస్ యాదవ్ గెలుపును కాంక్షిస్తూ గ్రామంలో నిర్వహించిన ప్రచారంలో వారు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌తోనే పల్లె ప్రగతి సాధ్యమవుతుందని, గ్రామాల్లో మౌళిక సదుపాయాలతోపాటు అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడలేని విధంగా ప్రజలకు సన్నబియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ



**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ఆవరణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మంగళవారం జిల్లా అటవీశాఖాధికారి పద్మజారాణి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి జగన్మోహన్ ప్రసాద్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సూర్యాపేట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయ ప్రాంగణంలో మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జయ జయహే తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, మెప్మా మహిళలు, ఆశా వర్కర్లు, జిల్లా అధికారులు పాల్గొని తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాలు వెదజల్లారు.

## దూసుకుపోతున్న సిపిఐ సర్పంచ్ అభ్యర్థి ప్రచారం



**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండల పరిధిలోని గోపురాజ్‌పల్లి సిపిఐ, బిఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి సలిగంజి వీరస్వామి బ్యాట్ గుర్తుకి ఓటు వేసి గ్రామ అభివృద్ధికి సహకరించాలని అంతేకాకుండా గ్రామ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానని గ్రామంలోని సమస్యలను ప్రతి ఒకటి పరిష్కరిస్తానని అన్నారు. ప్రజలు బ్యాట్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కీసర సత్తిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు పోలేపల్లి రమేష్, సంగిశెట్టి ప్రభాకర్, మండిపల్లి వెంకన్న, పాలకూర్ల తదితరులు పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## అనంతనాగ్, కుల్గాంలో ఎన్ఐఎ సోదాలు



**శ్రీనగర్ :** ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో నవంబర్ 10న జరిగిన పేలుడు దర్యాప్తులో భాగంగా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) మంగళవారం జమ్మూ కశ్మీర్‌లోని అనంతనాగ్, కుల్గాం జిల్లాల్లోని అనేక ప్రదేశాలలో సోదాలు నిర్వహించిందని అధికారులు తెలిపారు. 'వైట్ కాలర్' ఉగ్రవాద మాడ్యూల్‌కు సంబంధించి అరెస్టు చేసిన ఇద్దరు నిందితులు డాక్టర్ అదీల్ రాథర్, జాసిర్ బిలాల్ వానిలను పోలీసులు, సిఆర్‌పిఎఫ్ సహాయంతో ఎన్ఐఎ అధికారులు తీసుకువచ్చారని వారు తెలిపారు. అనంతనాగ్‌లోని మట్టన్ అటవీ ప్రాంతంలో, కుల్గాంలోని ఖాజిగుండ్ ప్రాంతంలోని వాన్‌పోరాలో దాక్కున్న ప్రదేశాల గురించి దర్యాప్తుదారులకు చెప్పిన ఇద్దరు నిందితుల సూచన మేరకు ఈ సోదాలు జరిగాయి.

## రాజ్యసభలో వందేమాతరంపై చర్చ...
# షా, ఖర్గే మధ్య మాటల యుద్ధం

- బుజ్జగింపు రాజకీయాలు కోసం గేయాన్ని విభజించారు : షా
- ఆ తీర్మానాన్ని నెహ్రూ ఒంటరిగా చేయలేదు : ఖర్గే

**న్యూఢిల్లీ :** 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఈ గేయంపై సోమ, మంగళవారాల్లో ప్రత్యేక చర్చ జరిగింది. సోమవారం చర్చను లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించగా, మంగళవారం రాజ్యసభలో హోంమంత్రి అమిత్‌షా షురూ చేశారు. ఈ నేపథ్యంలో అమిత్ షా, కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత నేత మధ్య మాటల యుద్ధం కొనసాగింది. అమిత్ షా మాట్లడుతూ 'వందేమాతరం' గేయాన్ని బుజ్జగింపు రాజకీయాల కోసం విభజించడంతో అది భారతదేశ విభజనకు దారితీసిందన్నారు. జాతీయ గేయం 150 ఏళ్ల చర్చను రానున్న పశ్చిమ బెంగాల్ ఎన్నికలతో అనుసంధానించినందుకు ప్రతిపక్షాలను ఆయన తీవ్రంగా విమర్శించారు. వందేమాతరం భారతదేశ సాంస్కృతిక జాతీయతను మేల్కొల్పిన 'మంత్రం' అని, స్వాతంత్ర్య పోరాట కాలంలో ఉన్నంత సందర్భోచితంగా నేటికీ అది అలాగే ఉందని అన్నారు. దేశాన్ని విక్షిత్ భారత్ వైపు తీసుకెళ్లడంలో ఈ గేయం రానున్న రోజుల్లో కూడా సందర్భోచితంగా ఉంటుందని ఆయన ఉద్ఘాటించారు. వందేమాతరంపై చర్చ అవసరాన్ని ప్రశ్నించినందుకు కాంగ్రెస్‌పై షా విమర్శలు చేశారు. మొదటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ గేయాన్ని 'విభజించి' రెండు చరణాలకు పరిమితం చేశారని ఆరోపించారు. లోక్‌సభలో కొంతమంది ఎంపీలు వందేమాతరం గురించి చర్చించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారని, అయితే చర్చ అవసరమని, ఈ గేయాన్ని స్వాతంత్ర్య ఉద్యమ సమయంలోనే కాకుండా నేటికీ అంతే సందర్భోచితంగా ఉందన్నారు. 2047లో విక్షిత్ భారత్ సాధించినప్పుడు కూడా అంతే సందర్భోచితంగా ఉంటుందని షా ఆశాభావం వ్యక్తం చేశారు. కొంత మంది పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు వస్తున్నందున వందేమాతరం గురించి చర్చిస్తున్నామని చెబుతున్నారని, బెంగాల్ ఎన్నికలతో అనుసంధానించడం ద్వారా వందేమాతరం ప్రాముఖ్యతను తగ్గించడానికి వారు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. వందేమాతరం సందేశ స్ఫూర్తిని దేశ యువతకు తీసుకెళ్లాలని హోంమంత్రి సభ్యులను కోరారు. ఈ గేయాన్ని బెంగాల్‌లో బంకిం చంద్ర చటోపాధ్యాయ రాశారని, అయితే ఇది దేశవ్యాప్తంగా వ్యాపించిందని, భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి ఒక నినాదంగా మారిందని ఆయన అన్నారు. భారతదేశం 'ఇస్లామిక్ దాడులను సహించిన సంవత్సరాల తర్వాత ఇది రాయబడిందని, బ్రిటిష్ వారు దేశంపై కొత్త సంస్కృతిని రుద్దడానికి ప్రయత్నించారని హోంమంత్రి అన్నారు. వందేమాతరం పాడినందుకు ప్రజలను కొట్టి జైలులో పెట్టినప్పటికీ, అది ప్రజల హృదయాలను తాకిందని, కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు వ్యాపించిందన్నారు.





'భారతదేశం మాత్రమే సరిహద్దులను ఏ చర్య ద్వారా నిర్ణయించబడని ఏకైక దేశం, దాని సరిహద్దులను మన సంస్కృతి ద్వారా నిర్ణయించారు, సంస్కృతి దానిని ఏకం చేసింది. అందుకే సాంస్కృతిక జాతీయవాదం అనే ఆలోచన, ఈ సాంస్కృతిక జాతీయతను బంకిం చంద్ర చటోపాధ్యాయ మేల్కొలిపింది' అని షా అన్నారు. కాంగ్రెస్ మరియు నెహ్రూ ఈ గేయాన్ని 'విభజించారని' ఆయన ఆరోపించారు. ఈ ఈ క్రమంలో ప్రతిపక్ష సభ్యుల నుండి తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. అనంతరం కాంగెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతదూ నరేంద్ర మోదీతో సహా బిజెపి నాయకులు జవహర్‌లాల్ నెహ్రూను అవమానించారని మండిపడ్డారు. 'వందేమాతరం' మొదటి రెండు చరణాలను మాత్రమే జాతీయ గేయంగా ఉపయోగించాలనే నిర్ణయం మహాత్మా గాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి నాయకులందరూ సమిష్టిగా తీసుకున్నారని ఆయన అన్నారు. బంకిమ్ చంద్ర చటోపాధ్యాయ రాసిన పాటను కాంగ్రెస్ విభజించిందని అధికార బిజెపి ఆరోపించడంతో, ఖర్గే అధికార పార్టీని ప్రతిఘటించారు. కాంగ్రెస్ నాయకులు ఎల్లప్పుడూ వందేమాతరం ఆలపిస్తారన్నారు. 'మేము ఎప్పుడూ వందేమాతరం పాడుతున్నాము. కానీ వందేమాతరం పాడని వారు కూడా ఇప్పుడు దానిని పాడటం ప్రారంభించారు. ఇది వందేమాతరానికి ఉన్న శక్తి. ఇది జాతీయ పండుగ, చర్చ కాదు. 1921లో సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారంభమైనప్పుడు, కాంగ్రెస్ సభ్యులు వందేమాతరం జపిస్తూ జైలుకు వెళ్తున్నారు... మీరు ఏమి చేస్తున్నారు? మీరు బ్రిటిష్ వారి కోసం పనిచేస్తున్నారు' అని ఖర్గే అధికార బిజెపిపై ధ్వజమెత్తారు. 'మీరు మాకు దేశభక్తిని బోధిస్తున్నారా? మీరు దేశభక్తికి భయపడి బ్రిటిష్ వారికి సేవ చేస్తున్నారు. జవహర్‌లాల్ నెహ్రూను అవమానించడానికి ప్రధాని మోదీ ఎటువంటి అవకాశాన్ని వదిలిపెట్టరు, హోంమంత్రి కూడా... చరణాలను తొలగించినందుకు ప్రధాని నెహ్రూను నిందించడం నేను విన్నాను' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆ మోదించిన గేయంలోని రెండు చరణాలను మాత్రమే పాడాలనే తీర్మానాన్ని నెహ్రూ ఒంటరిగా చేయలేదని, మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, మదన్ మోహన్ మాలవ్య, ఆచార్య జె.బి. కృపలానీ వంటి నాయకులు హాజరైనట్లు ఖర్గే అన్నారు. మొదటి రెండు చరణాలను మిగిలిన పాటతో విడదీయడంలో తనకు ఎటువంటి ఇబ్బంది లేదు అని ఠాగూర్ చెప్పారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఉటంకించారు.

## 5,371 ఎరువుల సంస్థల
# లైసెన్స్‌లు రద్దు

ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాష్



**న్యూఢిల్లీ :** బ్లాక్ మార్కెటింగ్, హోర్డింగ్, నాసిరకం పదార్థాల పంపిణీ చేయడంతో 5,371 ఎరువుల సంస్థల లైసెన్స్‌లను ప్రభుత్వం రద్దు చేసిందని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా మంగళవారం రాజ్యసభలో తెలిపారు. బిజెపి సభ్యుడు కిరణ్ చౌదరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా, రాష్ట్రాలకు దుష్ప్రవర్తనలపై చర్యలు తీసుకునే అధికారం ఉన్నప్పటికీ, కేంద్రం 1955 నిత్యావసర వస్తువుల చట్టం, ఎరువుల నియంత్రణ ఉత్తర్వుల కింద మళ్లింపు, హోర్డింగ్, అధిక ధర నిర్ణయించడం వంటి దుష్ప్రవర్తనలను అరికట్టడానికి చర్యలు తీసుకుంటుందని నడ్డా అన్నారు. ఏప్రిల్ 1 నుండి నవంబర్ 28 వరకు, బ్లాక్ మార్కెటింగ్‌లో 5,058 షోకాజ్ నోటీసులు వచ్చాయి, 442 కేసులలో ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యాయి. 3,732 లైసెన్స్‌లు రద్దు చేయబడ్డాయన్నారు. అదేవిధంగా, హోర్డింగ్‌లో 687 షోకాజ్ నోటీసులు, 202 లైసెన్స్ రద్దులు, 446 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, నాణ్యత లేని వస్తువులను పంపిణీ చేసిన కేసులో 3,811 సంస్థలకు షోకాజ్ నోటీసులు ఇచ్చామని, 1,437 లైసెన్స్‌లు రద్దు చేశామని, 65 ఎఫ్ఐఆర్‌లు దాఖలు అయినట్లు ఆయన వివరించారు. అక్రమంగా మళ్లింపులో 3,058 షోకాజ్ నోటీసులు, 464 లైసెన్స్ రద్దులు, 96 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని మంత్రి తెలియజేశారు. కేంద్రం ప్రతి రాష్ట్రానికి ఎరువులను సరఫరా చేసిందని, ఇంటిగ్రేటెడ్ ఫెర్టిలైజర్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా సరఫరాలను రియల్ టైమ్‌లో పర్యవేక్షిస్తుందని మంత్రి చెప్పారు. ఎరువులు దారి మళ్లించబడుతున్నాయని తమకకుతెలిసినప్పటికీ, డీలర్లు నిల్వ చేస్తున్నారని అందరికీ తెలిసిన విషయమేనన్నారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఒక రైతు 10 బస్తాలను ఉపయోగించగల సామర్థ్యం కలిగి ఉండవచ్చు కానీ అతను 50 బస్తాలను తీసుకువెళ్తాడని, వీటిని జాగ్రత్తగా చూసుకోవాలని, దానిని నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి మద్దతు ఇవ్వాలన్నారు.

## శబరిమల భక్తులు అటువైపు వెళ్లకండి.. అటవీ శాఖ

**తిరువనంతపురం:** అయ్యప్ప స్వామి దర్శనం కోసం శబరిమల వెళ్లే భక్తులకు కేరళ అటవీ శాఖ అధికారులు మంగళవారంనాడు కీలక సూచనలు చేశారు. సన్నిధానానికి సమీపంలోని ఉరుక్కుళి జలపాతాన్ని సందర్శించవద్దని సూచించారు. వన్యప్రాణుల నుంచి ముప్పు పొంచి ఉండటం, తరచు ప్రమాదాలు జరుగుతుండటంతో ఈ సూచనలు చేసింది. ఈ మేరకు సన్నిధానం స్పెషల్ డ్యూటీ రేంజ్ అధికారి అరవింద్ బాలకృష్ణన్ ఒక అడ్వయిజరీ జారీ చేశారు.

## ప్రయాణికుల భద్రతపై రాజీపడం

పౌరవిమానయాన శాఖమంత్రి రామ్మోహన్ నాయుడు



**న్యూఢిల్లీ :** ఎంత పెద్ద విమానయాన సంస్థ అయినా ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తే సహించేది లేదని పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ఇండిగో సంక్షోభంపై లోక్‌సభలో మాట్లాడిన ఆయన, దీనికి ఇండిగో బాధ్యత వహించాలని చెప్పారు. సేవలు క్రమంగా సాధారణస్థితికి చేరుతున్నాయని లోక్‌సభకు వెల్లడించారు. రద్దయిన విమానాలకు సంబంధించిన రిఫండ్, లగేజీ విషయాలతో పాటు ఎయిర్‌పోర్టుల్లో రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని ఆయన వివరించారు. 'రోస్టరింగ్ అంశంపై ఇండిగోలో సమస్య తలెత్తింది. ఇండిగో సాఫ్ట్‌వేర్ సమస్యపై విచారణకు ఆదేశించాం. ప్రయాణికుల భద్రతపై రాజీపడే ప్రసక్తి లేదు. ప్రయాణికులు ఇబ్బంది పడితే యాజమాన్యాలే బాధ్యత వహించాలి. జవాబుదారీగా వ్యవహరించాల్సిన బాధ్యత యాజమాన్యానిదే. ఎంత పెద్ద సంస్థ అయినా, ప్రయాణికులకు ఇబ్బంది కలిగించకూడదు. పైలట్ల కొరత నివారించేందుకు శాస్త్రీయంగా రివైజ్డ్ ఫ్లైట్ టైమ్ లిమిటేషన్ అమలు చేశాం. ప్రయాణికుల భద్రతకు ఈ సంస్కరణలు తప్పనిసరి. వీటిపై రాజీపడే ప్రసక్తే లేదు. ప్రభుత్వం బలమైన, పోటీతత్వ విమానయాన పర్యావరణ వ్యవస్థను నిర్మించాలని నిశ్చయించుకుంది. అంతకుముందు సంబంధిత భాగస్వాములను సంప్రదించిన తర్వాత డిజిసిఎ దశలవారీగా ఆ ప్రణాళికను అమలుచేసింది. ఈ నిబంధనను అమలు చేసేందుకు ఇండిగో సమ్మతి తెలిపింది. శీతాకాల షెడ్యూల్ సన్నద్ధతను నిర్ధారించింది. కానీ అంతర్గత రోస్టరింగ్ అంతరాయాల కారణంగా పెద్దసంఖ్యలో సర్వీసులను రద్దుచేయటం వల్ల వేలాదిమంది ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. పౌర విమానయాన శాఖ సూచన మేరకు డిజిసిఎం దర్యాప్తునకు ఆదేశించింది. ఇండిగో సిఇఒ, సిఒఒలకు షోకాజు నోటీసులు ఇచ్చాం. విమానాల షెడ్యూల్‌ను మార్చాలని, సిబ్బందిని పెంచాలని, ప్రయాణికుల సేవలు మెరుగుపర్చాలని, ఆలస్యం చేయకుండా విమానాల రాకపోకలను సాధారణస్థితి తేవాలని సూచించా' అని స్పష్టం చేశారు.

**దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఎయిర్‌పోర్టుల్లో సాధారణ పరిస్థితులు**

ఇండిగో ఎయిర్‌లైన్స్ సేవలు క్రమంగా సాధారణ స్థితికి చేరుకుంటున్నట్లు పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు లోక్‌సభలో చెప్పారు. 'ఇండిగోలో తలెత్తిన సంక్షోభం వేగంగా సాధారణ పరిస్థితికి చేరుకుంటుంది. డిసెంబర్ 5న కేవలం 706 ఇండిగో విమాన సర్వీసులు నడవగా, సోమవారం దాదాపు 1,800 విమాన సర్వీసులను నడిపింది. ప్రస్తుత ఇండిగో సంక్షోభం క్రమంగా సాధారణ స్థితికి వస్తుంది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఎయిర్‌పోర్టుల్లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి.' అని అన్నారు.

# 8వ రోజూ అంతరాయం

- 422 ఇండిగో విమానాలు రద్దు 'ఇండిగో'
- విమానాల సంస్థలో 5 శాతం తగ్గించిన కేంద్రం

**న్యూఢిల్లీ :** సంక్షోభంలో చిక్కుకున్న ఇండిగో విమానయాన సంస్థలో వరుసగా ఎనిమిదవ రోజు కూడా అంతరాయం కొనసాగింది. దీంతో మంగళవారం ఆరు మెట్రో విమానాశ్రయాల నుండి 422 విమానాలను ఇండిగో రద్దు చేసిందని వర్గాలు తెలిపాయి. రద్దు చేయబడిన 422 విమానాలలో, ఢిల్లీ విమానాశ్రయంలో 152 విమానాలు, బెంగళూరు విమానాశ్రయంలో 121 విమానాలు రద్దు చేసినట్లు వారు తెలిపారు. హైదరాబాద్‌లో 58, ముంబైలో 41 రద్దయినట్లు వర్గాలు పేర్కొన్నాయి. చెన్నై విమానాశ్రయం నుండి కూడా 50కి పైగా విమానాలను ఇండిగో రద్దు చేసిందని వారు గుర్తించారు. అంతకు ముందు ఇండిగో విమానాల సంఖ్యలో 5 శాతం తగ్గిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రకటన చేసింది. ఆమోదించబడిన షెడ్యూల్‌ను ఎయిర్‌లైన్స్ నడపడంలో విఫలమైనందున వాటిని ఇతర విమానాశ్రయాలకు ఇవ్వాలని నిర్ణయించింది. భారతదేశంలోని మొత్తం దేశీయ ట్రాఫిక్‌లో 65 శాతానికి పైగా ఆధీనంలో ఉన్న గురుగ్రామ్ ఆధారిత క్యారియర్ సోమవారం ఆరు మెట్రో విమానాశ్రయాల నుండి మాత్రమే 560కి పైగా విమానాలను రద్దు చేసింది. శీతాకాలపు షెడ్యూల్ 24 (డబ్ల్యుస్24)తో పోలిస్తే ఇండిగో తన నిష్క్రమణలను 9.66 శాతం, వేసవి షెడ్యూల్ 25 (ఎస్ఎస్ 25)తో పోలిస్తే 6.05 శాతం పెంచింది. అయితే, ఈ షెడ్యూల్‌లను సమర్థవంతంగా నిర్వహించే సామర్థ్యాన్ని ఎయిర్‌లైన్ ప్రదర్శించలేదు. అందువల్ల, సెక్టార్లలో షెడ్యూల్‌ను 5 శాతం తగ్గించాలని, ముఖ్యంగా అధిక డిమాండ్ ఉన్న, అధిక ఫ్రీక్వెన్సీ విమానాలపై, ఇండిగో ఒక సెక్టార్‌లో సింగిల్‌ఫ్లైట్ ఆపరేషన్లను నివారించాలని ఆదేశించినట్లు డిజిసిఎ తన ఉత్తర్వులో పేర్కొంది. సవరించిన విమానాల షెడ్యూల్‌ను బుధవారం సాయంత్రం 5 గంటలకల్లా సమర్పించాలని ఇండిగోను ఆదేశించింది. ప్రస్తుతం ఇండిగో ఎయిర్‌లైన్స్ 2వేల 2వందల సర్వీసులను నడుపుతోంది.



**సంక్షోభం ముగిసింది : ఇసిఒ**

మరోవైపు ఇండిగో సంక్షోభం ముగిసిందని, తమ కార్యకలాపాలు అన్నీ ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతున్నాయని ఈ సంస్థ సిఇఒ పీటర్ ఎల్బర్స్ మంగళవారం తెలిపారు. ఇండిగో విమాన సర్వీసుల రద్దు వల్ల ఇబ్బందిపడిన ప్రయాణికులు అందరికీ ఆయన మరోసారి క్షమాపణలు చెప్పారు. కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్లు తెలిపారు. 'విమాన ప్రయాణానికి ఉన్న గొప్పదనం ఏమిటంటే, అది ప్రజలను, వారి భావోద్వేగాలను, ఆశయాలను, ఆకాంక్షలను గమ్యస్థానాలకు చేర్చుతుంది. మా కస్టమర్లు ఇలా అనేక కారణాలతో ప్రయాణానికి సిద్ధమయ్యారు. కానీ ఫ్లైట్ల రద్దుతో వారు గమ్యస్థానాలకు వెళ్లలేక, రాలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అందుకు మేము చింతిస్తున్నాం. క్షమాపణలు చెబుతున్నాం. ఇప్పుడు మా మొదటి ప్రాధాన్యత ఏమిటంటే, ఫ్లైట్లు లేక చిక్కుకుపోయిన ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చడమే. ఇందుకోసం మా ఇండిగో బృందం మొత్తం కష్టపడుతోంది' అని ఇండిగో సిఇఒ పీటర్ ఎల్బర్స్ అన్నారు. కాగా, ఇండిగో విమానాల రద్దు వల్ల చాలా మంది టికెట్లు క్యాన్సిల్ అయ్యాయని, వారందరికీ ఇప్పటికే పూర్తిగా రీఫండ్ చేసినట్లు పీటర్ ఎల్బర్స్ తెలిపారు. అంతేకాదు వారి బ్యాగేజీని (సామగ్రి) తిరిగి అప్పగించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే చాలా బ్యాగులు కస్టమర్ల ఇంటికి పంపించామని, మిగిలిన బ్యాగులను అతి త్వరలో డెలివరీ చేయడానికి తమ బృందం కృషి చేస్తోందన్నారు.

## కేంద్రానికి మాత్రమే తమిళనాడు, పుదుచ్చేరి వేర్వేరు

టివికె చీఫ్ విజయ్



**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే తమిళనాడు, పుదుచ్చేరి వేర్వేరు అని, తాము మాత్రం అందరం కలిసే ఉన్నామని నటుడు, టీవీకే చీఫ్ విజయ్ అన్నారు. పుదుచ్చేరిలోని ఉప్పాలంలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగించారు. కరూర్ తొక్కిసలాట అనంతరం జరిగిన ఈ తొలి బహిరంగసభలో ఆయన.. తమిళనాడులోని డిఎంకె సర్కారుపై తీవ్ర విమర్శలు చేశారు. పుదుచ్చేరికి మద్దతు ఇవ్వడం తన బాధ్యత అని విజయ్ పేర్కొన్నారు. సిఎం రంగసామి నేతృత్వంలోని అక్కడి ప్రభుత్వం డిఎంకె ప్రభుత్వం వంటిది కాదని, ప్రతిపక్ష పార్టీలతోనూ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నదని మెచ్చుకున్నారు. మాకు ప్రత్యర్థి అయినా మా పార్టీ నిర్వహిస్తున్న ర్యాలీకి అడగగానే భద్రత రంగస్వామి ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ రాష్ట్ర పాలనకు సంబంధించిన విషయాలను పుదుచ్చేరి ప్రభుత్వం నుంచి నేర్చుకోవాలని సూచించారు. కానీ ఆయన (స్టాలిన్) ఎప్పటికీ నేర్చుకోరని విజయ్ వ్యాఖ్యానించారు. వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డిఎంకెకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. మాజీ సిఎం, దివంగత ఎంజీ రామచంద్రన్‌కు పుదుచ్చేరితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ.. పుదుచ్చేరికి పూర్తి రాష్ట్ర హోదా ఇవ్వాలని పునరుద్ఘాటించారు. తమకు రాష్ట్ర హోదా కల్పించాలని కోరుతూ పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నో సంవత్సరాల నుంచి 16 తీర్మానాలను ప్రవేశపెట్టినా కేంద్రం పట్టించుకోవట్లేదని విమర్శించారు.

## మణిపూర్‌లో నలుగురు
# ఉగ్రవాదులు అరెస్టు

**ఇంఫాల్ :** మణిపూర్‌లోని ఇంఫాల్ వెస్ట్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి నలుగురు ఉగ్రవాదులను అరెస్టు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. సోమవారం అరెస్టులు జరిగాయని, వారందరూ దోపిడీకి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని పోలీసులు మంగళవారం తెలిపారు. యుఎన్ఎల్ఎఫ్ (పాంబే)కి చెందిన ఇద్దరు కార్యకర్తలను అవాంగ్ వాబాగై నుండి అరెస్టు చేశారు. వారిని నింగ్‌థౌజామ్ నోంగ్‌పోక్నగంబా మెయిటే (31), కొంథౌజామ్ నెల్సన్ సింగ్ (23)గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. యుఎన్ఎల్ఎఫ్ (పాంబే) 2023లో కేంద్రంతో శాంతి ఒప్పందంపై సంతకం చేసింది, కానీ ఆ సంస్థ సభ్యులు దోపిడీ, ఇతర నేరాలకు పాల్పడుతూనే ఉన్నారని వారు తెలిపారు. ఎస్ఒఆర్ఇపిఎకి చెందిన ఇద్దరు సభ్యులను కూడా అరెస్టు చేశారు. నింగ్థెంకోల్ నుండి చుంగ్‌ఖామ్ నానావో మచా అలియాస్ మిత్లాంగ్ (24) ను అరెస్టు చేయగా, చంగంగీ నుండి అరంభం తోయితోయ్ సింగ్ (41)ను అరెస్టు చేశారు. వారి వద్ద నుండి లెక్కల్లో చూపని రూ. 3.90 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సోమవారం జిల్లాలోని నైరాంగ్‌బామ్ మాయై లంబి లౌకాన్ నుండి ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. రెండు సింగిల్‌బారెల్డ్ తుపాకులు, ఒక స్టన్ గ్రెనేడ ఒక స్మోక్ గ్రెనేడ డిటోనేటర్ లేని ఒక 36–హెచ్‌ఇ గ్రెనేడ్ 54 మందుగుండు సామగ్రి, రెండు రేడియో సెట్‌లు స్వాధీనం చేసుకున్న వస్తువులలో ఉన్నాయి.



## లూథ్రా బ్రదర్స్ కోసం వేట..
## ఇంటర్‌పోల్ బ్లూకార్నర్ నోటీసు



**పనజి:** గోవా నైట్‌క్లబ్‌లో శనివారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగి 25 మంది ప్రాణాలు కోల్పోయిన గంటల్లోనే ఇండియా విడిచి పారిపోయిన లూథ్రా బ్రదర్స్ కోసం గాలింపు మొదలైంది. 'బిర్చ్ బై రోమియో లేన్' యజమానులైన గౌరవ్ లూథ్రా, సౌరబ్ లూథ్రాలపై ఇంటర్‌పోల్ తాజాగా బ్లూకార్నర్ నోటీసులు జారీ చేసింది. పరారీలో ఉన్న సోదరుల జాడను తెలుసుకునేందుకు గోవా పోలీసులు ఇంటర్‌పోల్ సాయం కోరడంతో ఈ నోటీసులు జారీ అయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం, శనివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో ఐదుగురు టూరిస్టులతో సహా పలువురు అగ్నిప్రమాదంలో మరణించిన కొద్ది గంటలకే లూథ్రా సోదరులు పరారయ్యారు. డిసెంబర్ 7వ తేదీ తెల్లవారుజామున 5.30 గంటలకు పుకెట్ (థాయిలాండ వెళ్లే ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం ఎక్కినట్టు చెబుతున్నారు. కాగా, విచారణలో భాగంగా పోలీసులు లూథ్రా సోదరుల కోసం లూకౌట్ నోటీసులు జారీ చేశారు. ఢిల్లీలోని జిటిబి నగర్ నివాసానికి ఒక టీమ్ వెళ్లింది. అయితే ఆ ఇంటికి తాళం వేసి ఉంది. దీంతో లూథ్రా సోదరుల సన్నిహితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. లూథ్రా బ్రదర్స్‌కు సన్నిహితుడు, మూడో పార్టనర్‌గా ఉన్న అజయ్ గుప్తా కోసం గాలిస్తున్నారు. ప్రస్తుతం అతని ఆచూకీ కూడా తెలియలేదు. కాగా, మేనేజిమెంట్ టీమ్‌లో కీలకమైన ఆపరేషనల్ స్టాఫ్ మెంబర్ భరత్ కోహ్లిని పోలీసులు అరెస్టు చేశారు. క్లబ్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజీవ్ మోదక్, జనరల్ మేనేజర్ వివేక్ సింగ్, బార్ మేనేజర్ రాజీవ్ సంఘానియా, గేట్ మేనేజర్ రియాన్ష ఠాకూర్‌లను కూడా అరెస్టు చేశారు. మంగళవారం ఉదయం గోవా పోలీసులు ఢిల్లీలోని లూథ్రా బ్రదర్స్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ప్రశ్నించారు.

## ఓటర్లలో భయాన్ని కలిగించేందుకే సర్ ప్రక్రియ

పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ

**కూచ్‌బెహర్ :** పశ్చిమ బెంగాల్‌లో ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) కొనసాగుతోంది. అయితే ఈ ప్రక్రియ పూర్తి తరువాత ఫిబ్రవరిలో తుది ఓటరు జాబితా ప్రచురించిన వెంటనే రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తారని, జాబితాపై చట్టసవరణ సవాళ్లను నివారించడానికి దీనిని ఉపయోగించుకుంటున్నారని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. మంగళవారం కూచ్ బెహర్‌లోని రాస్ మేళా మైదానంలో జరిగిన బహిరంగ సభలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఓటర్లలో భయాన్ని కలిగించడానికి సర్ ప్రక్రియను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. 100 రోజుల పని పథకం కింద నిధులను నిలిపివేసినట్లు ఆరోపణలు రావడంతో ఆమె కేంద్రంపై మండిపడ్డారు. చెల్లింపులను తిరిగి ప్రారంభించడానికి కేంద్ర ప్రభుత్వం విధించిన అవమానకరమైన పరిస్థితులుగా ఆమె పేర్కొన్న నోట్‌ను వేదికపై చింపేశారు. ఫిబ్రవరిలో సర్‌తుది జాబితాలు విడుదలైన వెంటనే ఎన్నికలను ప్రకటిసారని, తద్వారా ఎవరూ చట్టబద్ధంగా జాబితాపపై సవాలు చేసే అవకాశం ఉండదని, ఆ జాబితా ఆధారంగా ఎన్నికలు జరిగేలా జరుగుతాయని బెనర్జీ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నవంబరు 4న సర్‌ను అమలు చేయడం వల్ల ప్రజల్లో 'విస్తృత భయాన్ని' సృష్టించారని, ఓటర్ల జాబితా నుండి తమ పేర్లు ఏకపక్షంగా తొలగిపోతాయని వారు భయపడుతున్నారని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఇప్పుడు మనం మన పౌరసత్వాన్ని నిరూపించుకోవాలా? దీనికంటే పెద్ద అవమానం ఏముంటుంది? తరతరాలుగా ఇక్కడ నివసిస్తున్న ప్రజలను తాము ఎవరో నిరూపించుకోవాలని అడుగుతున్నారని మండిపడ్డారు. బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం 'అరాచక, నిరంకుశ' పాలనను నడుపుతోందని, కాషాయ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే 'బెంగాల్ సంస్కృతి, భాష, వారసత్వాన్ని నాశనం చేస్తుందని బెనర్జీ ఆరోపించారు. తన ప్రభుత్వం సర్‌ను ప్రక్రియను అడ్డుకుని ఉంటే, కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించి ఉండేదన్నారు. వారు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. కలకత్తా హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, ఒక సంవత్సరం గడిచినా కేంద్రం బకాయిలను విడుదల చేయలేదని, బదులుగా పని పథకం అమలుపై అనేక షరతులు విధిస్తూ ఒక లేఖ పంపిందని బెనర్జీ అన్నారు. తాము ఈ షరతులను అంగీకరించమి తేల్చి చెప్పారు. బెంగాల్ 100 రోజుల పని పథకాన్ని స్వయంగా నిర్వహిస్తుందని, ప్రకటిస్తూ వేదిక నుండి నోట్‌ను ముక్కలుగా చింపివేశారు. గ్రామీణ ఉపాధి పథకం కింద నిధులు నాలుగు సంవత్సరాలుగా నిలిపివేయబడ్డాయని పేర్కొం టూ, గ్రామీణ గృహనిర్మాణం, గ్రామ రహదారి ప్రాజెక్టులు వంటి ఇతర సంక్షేమ కార్యక్రమాలను కూడా కేంద్రం నిలిపివేసిందని బెనర్జీ ఆరోపించారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు తన ప్రభుత్వం రాష్ట్ర ఖజానా నుండి పని అందించడం ద్వారా 'కర్మశ్రీ' అనే ప్రత్యామ్నాయ పథకాన్ని ప్రారంభించిందని, ఈ కార్యక్రమం విజయవంతమైందని ఆమె చెప్పారు. తాము ఎవరి భిక్షనూ కోరుకోవడం లేదని, బెంగాల్ తన సొంత కాళ్ళపై ఎలా నిలబడాలో తెలుసని సిఎం ఉద్ఘాటించారు. కేంద్రం పంపిన నోట్‌ను చదివిన బెనర్జీ కార్మిక శాఖ త్రైమాసిక కార్మిక బడ్జెట్‌లను సమర్పించాల్సిన ఒక షరతును ఉదహరించారు. ఫిబ్రవరిలో ఎన్నికలు ప్రకటిస్తారని, ఇవన్నీ ఎప్పుడు చూపిస్తామని ప్రశ్నించారు.



సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
"విద్యుత్ అదా చేయడం అంటే విద్యుత్‌ను ఉత్పత్తి చేయడమే"
టెండరు ప్రకటన నెం. 13/25-26
... మరిన్ని వివరాలకు దయచేసి మా వెబ్‌సైటు https://tgsouthernpower.org) చూడగలరు. ఫోన్:040-23431333/1112/1125).
సం/- సూపరింటెండింగ్ ఇంజినీరు/ఎస్‌సిపిడిఎ
DIPR R.O. No. : 11836-PP/CL/ADVT/1/2025-26, Date: 09-12-2025

ప్రజాపక్షం
బుధవారం, 10 డిసెంబరు

# విమానయానంలో కల్లోలం

దేశంలో అంతర్గత విమాన ప్రయాణాల్లో గతవారం ఆకస్మికంగా సంభవించిన కల్లోలం లక్షలాది ప్రయాణీకులను కనీసం వారంరోజులపాటు తీవ్రమైన ఇబ్బందులకు, ఆవేదనకు గురిచేసింది. ఈ మంగళవారానికి పరిస్థితి చాలావరకు కుదుటపడినా పూర్తిగా సాధారణ పరిస్థితుల పునరుద్ధరణకు కనీసం మరో పక్షం రోజులు పట్టవచ్చు. ఒక్క ఇండిగో విమానయాన సంస్థ కాడికింద పడేస్తే ఇంత అల్లకల్లోలం సంభవించటానికి కారణం దాని గుత్తాధిపత్యం. ప్రభుత్వ రంగాన్ని రద్దుచేసి సురక్షిత ప్రయాణానికి గ్యారంటీగా ప్రైవేటు ఎయిర్‌లైన్స్‌కు లైసెన్సులు ఇవ్వటం మొదలుపెట్టాక దాదాపు 10 ప్రైవేటు సంస్థలు దేశీయ విమాన సర్వీసుల నిర్వహణ రంగంలో ప్రవేశించాయి. ప్రతిష్టాత్మకమైన ఎయిర్‌ఇండియా, ఇండియన్ ఎయిర్‌లైన్స్ టాటాల చేతికి వెళ్లింది. రెండోవైపున, దేశంలో విమాన ప్రయాణం అనేకరెట్లు పెరిగింది. దీన్ని అవకాశంగా తీసుకున్న ప్రైవేటు ఎయిర్‌లైన్స్ లాభాపేక్షే ప్రధానంగా విమానాల సంఖ్యను, రూట్లను పెంచారుగాని అందుకు తగినట్లుగా పైలెట్లు, ఇతర సిబ్బందిని పెంపుచేయలేదు. పైలెట్లపై పని గంటల భారం పెరిగింది, విశ్రాంతి తగ్గిపోయింది. ఇది విమాన ప్రయాణ భద్రతకు ప్రమాదకరం. పైలెట్లు పనిగంటల పాటింపు, విశ్రాంతి కోసం ఆందోళన చేశారు. ఎట్టకేలకు మేల్కొన్న కేంద్రప్రభుత్వం, దాని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) కొత్త ఫ్లయిట్ క్రూ రోస్టరింగ్ రూల్స్ పాటించాలని ఆదేశించింది. పైలెట్లకు విశ్రాంతి గంటలు, వారి రాత్రి డ్యూటీ సమయంపై పరిమితులు పాటించేందుకు తమకు సమయం కావాలని ఇండిగో యాజమాన్యం కోరింది. ఇచ్చిన కాలవ్యవధిలో పైలెట్లను రిక్రూట్ చేసుకోకుండా తమపై ఒత్తిడి తెచ్చే వైఖరిని డిజిసిఎ అనుమతించలేదు. అంతే, ఇండిగో యాజమాన్యం చెప్పాపెట్టకుండా ఆకస్మికంగా విమాన సర్వీసులు నిలుపుచేసింది. దేశీయ విమాన ప్రయాణీకుల్లో 60–70 శాతాన్ని క్యారీచేసే విమానాలు నిలిచిపోతే సంభవించగల కల్లోలాన్ని టివిలద్వారా కళ్లారా చూశాం. నిలిచిపోయిన లక్షలాదిమంది అప్పటికప్పుడు విమానాశ్రయాలకు వచ్చినవారు కాదు. 15రోజులు, నెల–రెండు నెలల ముందు అడ్వాన్సుబుకింగ్ చేసుకున్నవారు. అత్యవసర పనులమీద, ఇంటర్వ్యూలకు, వివాహాలకు హాజరయ్యేందుకు, తమ కుటుంబాలను చేరుకునేందుకు ప్రయాణమై విమానాశ్రయాలకు చేరినవారు. వారికి ముందస్తు సమాచారం ఇవ్వకపోవటం, విమానం బయలుదేరే సమయానికి కొద్దిగా ముందుగా సర్వీసు రద్దు ప్రకటించటం, మళ్లీ ఫ్లయిట్ ఉంటుందో లేదో చెప్పే దిక్కు లేకపోవ టం, లగేజి తీసుకుని బోర్డింగ్ పాస్ ఇచ్చాక రద్దు సమాచారం ఇవ్వటం ఇండిగో సంస్థ బాధ్యతారాహిత్యం. ఇది ప్రయాణీకులను నరకయాతనకు గురిచేసింది. లగేజీ బ్యాగులతో నిండిపోయిన విమానాశ్రయ దృశ్యాలు, పిల్లాపాపలతో, వృద్ధులతో, నేలమీదే రోజుల తరబడి పరుండటం, సరైన ఆహారం, వసతి చూపని విమానయాన సంస్థ నిర్లక్ష్యం హృదయవిదారక దృశ్యాలను కళ్లకు కట్టాయి.

ఇందుకు ఎవరిది బాధ్యతః ఇండిగో ఎయిర్‌లైన్స్‌ది, కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖది. ఇండిగో అనేక సంవత్సరాలుగా మార్కెట్‌ను, ప్రభుత్వాన్ని, డిజిసిఎను తమ చెప్పుచేతల్లో పెట్టుకుని ఆపరేషన్స్‌పై దాదాపు గుత్తాధిపత్యం సంపాదించిందనే ఆరోపణలున్నాయి. తక్కువ చార్జీలు, ఎక్కువ విమానాలతో ప్రత్యర్థులను నష్టాల పాల్జేసింది. స్పైస్ జెట్, జెట్ ఎయిర్‌వేస్‌లాంటివి తలవంచక తప్పలేదు. ఆ విధంగా హై మార్కెట్ రూట్లలో దాదాపు గుత్తాధిపత్యం సంపాదించింది. ఇదంతా ప్రభుత్వం కనుసన్నల్లోనే జరిగింది. రెగ్యులేటర్ డిజిసిఎ కళ్లప్పగించి చూస్తూ ఉండిపోయింది. అంటే ఉన్నతాధికారవర్గం ఇండిగో ప్రలోభాలకు గురై ఉండవచ్చు, పౌర విమానయానశాఖ చారిత్రకంగానే అవినీతికి ప్రసిద్ధి చెందిన ప్రభుత్వ విభాగం. పైలెట్ల నుంచి, ప్రయాణ భద్రత విషయంలో ఒత్తిడి పెరిగాక అది నవంబర్ నుంచి కొత్త ఎఫ్‌డిటిఎల్ రూల్సు అమలులోకి తెచ్చింది. ఇండిగో ఉల్లంఘించింది. ఒక్కసారి వెయ్యికిపైగా సర్వీసులు రద్దు చేసి ఒకరకంగా బ్లాక్ మెయిల్‌కు పాల్పడింది. డిజిసిఎ వెనువెంటనే 10 ఫిబ్రవరి 2026 వరకు తాత్కాలిక ఉపశమనలు ప్రకటించింది. ఇతర డొమెస్టిక్ ఎయిర్‌లైన్స్ డిజిసిఎ రూల్సు పాటిస్తున్నాయి.

ఇండిగో సృష్టించిన కల్లోలంతో గంగవెర్రులెత్తిన ప్రభుత్వం ఆదరాబాదరా కొన్ని ఆదేశాలు జారీ చేసింది. ఆ ప్రకారం ఇండిగో రూ.810కోట్లు ప్రయాణీకులకు రిఫండ్ చేసింది. ప్రభుత్వం దర్యాప్తు సంఘాన్ని నియమించింది. తప్పు చేసిన బాధ్యులకు శిక్షలు తప్పవంటోంది. పార్లమెంటులో ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీశాయి. ప్రైవేటు సంస్థల గుత్తాధిపత్యాన్ని బద్దలు కొట్టగల ధైర్యం ఉంటేనే ఇటువంటి బ్లాక్ మెయిల్ పరిస్థితుల పునరావృతాన్ని అరికట్టటం సాధ్యం.

# మోదీ పాలనలో శ్రమకు విలువ, కార్మికునికి రక్షణ లేదు



వియస్.బోస్
ఎఐటియుసి మాజీ ప్రధాన కార్యదర్శి
9391356527

భారతదేశంలో మోదీ అహంకారపూరితమైన నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నాడు. దానిలో భాగమే 29 కార్మిక చట్టాలను కుదించి 4 కోడ్‌లుగా మార్చి కార్మికులకు అన్యాయం, కార్పొరేట్ శక్తులకు కావాల్సిన లాభం చేకూర్చుతున్నాడు. చట్టాల పేరు తీసివేసి కోడ్‌లని పేరు పెట్టాడంటేనే అసలు మోదీ నీతి బయటపడుతుంది. చట్టమంటే అగ్రిమెంట్. కోడ్ అంటే కోరలు లేనిది. అగ్రిమెంట్ స్థానంలో ఉన్న 29 చట్టాలను మార్చి 4 కోడ్‌లుగా తెచ్చాడంటే కేంద్ర ప్రభుత్వం అసలురంగు బయటపడుతున్నది. ప్రతి కార్మిక చట్టం వెనుక అనేక పోరాటాలు, త్యాగాలు, కమీషన్లు కమిటీలు సంబంధిత వర్గాలతో చర్చోపచర్చలు జరిపి అంతిమంగా చేసిన నిర్ణయాలను తరువాత చట్టాల రూపం దాల్చటం జరిగింది. ఇప్పుడు ఎలాంటి సంప్రదింపులు లేకుండా ప్రధానిమోదీ అంత:పురంలో పారిశ్రామిక వేత్తలు చెప్పింది కోడ్‌ల రూపంలో తీసుకొచ్చి కార్మిక హక్కులను హరించటం జరుగుతున్నది. కార్మిక సంబంధాల విషయం ఉమ్మడి జాబితాలో ఉంటే అనేక రాష్ట్రాలు వ్యతిరేకించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నియంతృత్వంతో 4 కోడ్‌లను బలవంతంగా రుద్దటం జరిగింది. దీనిమూలంగా రాజ్యాంగబద్ధమైన కార్మిక హక్కులు అదే సందర్భంలో రాష్ట్రాల హక్కులను కేంద్రప్రభుత్వం హరించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది.

ఏదైన ఉత్పత్తి జరగాలంటే అది కర్మాగారంలో జరుగుతుంది. పెట్టుబడి ఉన్నా కార్మికులు లేకుండా ఉత్పత్తి జరగదని చరిత్ర చెప్పిన సత్యం. అలాంటి సత్యాన్ని గతంలో బుద్ధుడు, వివేకనందుడు, మహాత్మాగాంధీ లాంటి ప్రముఖులు కూడా చెప్పటం జరిగింది. మోదీ మాత్రం కార్మికులు లేకుండానే పెట్టుబడి ఉంటే ఉత్పత్తి జరుగుతుందని వాస్తవ విరుద్ధంగా చెపుతూ దోపిడీదారుల పక్షాన ప్రచారం చేస్తున్నాడు. మోదీ చెప్పిందే నిజమైతే తొలినాటి నుండి ఉత్పత్తి కేంద్రాలను కర్మాగారాలుగా ఎందుకు నామకరణం చేశారు. పెట్టుబడి ఆరాలుగా ఎందుకు అనలేదు. ప్రజలంతా వారు వారి తల్లిదండ్రులకు పుట్టామని ప్రకటించుకుంటుంటే మోదీ మాత్రం తాను ప్రత్యక్షంగా దేవదూతగా వచ్చానని చెప్పటం ఎంతనిజమో, ఉత్పత్తిపై మోదీ చేస్తున్న ప్రచారం కూడా అంతే నిజమని తెలియజేస్తున్నాము.

బ్రిటీష్ వారి దోపిడీపాలనలో వచ్చిన పాత కార్మిక చట్టాలను బూజుదులిపి కొత్త చట్టాలు ప్రవేశపెడతానని విషప్రచారం చేసిన మోదీ కార్మికుల దుమ్ముదులిపి కార్పొరేట్ సంస్థలకు కనకవర్షం కురిసే విధంగా 4 కోడ్‌లు తీసుకొచ్చాడు. 1926 బ్రిటీష్ కాలంలో తెచ్చిన చట్టంలో యూనియన్ పెట్టుకోవటానికి 7గురు సభ్యులు సరిపోతారని ఉంటే కొత్త కోడ్‌లలో 10శాతం లేక 100 మంది సభ్యుల సమ్మతితోనే యూనియన్ పెట్టుకోవాలని చెప్పటం దేనికి నిదర్శనమో విజ్ఞులు ఆలోచించాలి. కార్మిక సంఘంలో ఒక వ్యక్తి సంస్థలోని కార్మికుల ఆమోదంతో ఎన్నిసార్లయినా ఆఫీసు బేరర్‌గా ఉండవచ్చునని ఉంటే కొత్త కోడ్‌లలో ఒక వ్యక్తి కార్మికుల ఆమోదం ఉన్నప్పటికీ 2 సార్లు కన్నా ఎక్కువసార్లు ఉండకూడదని చెప్పబడింది. అలాగే యూనియన్ ఆఫీసు బేరర్స్‌లో 25శాతం బయటవారు ఉండవచ్చునని గత చట్టంలో ఉంటే ప్రస్తుతం కోడ్‌లలో దానిని రద్దు చేశారు. దీని మూలంగా కార్మికులు అనుభవం కలిగిన కార్మిక నాయకులను పొందే అవకాశం లేకుండా చేసి కార్మికులకు మోదీ ద్రోహం చేశాడు. అలాగే 1936లో వేతనాలపై సంప్రదింపుల హక్కులతో కూడిన చట్టం బ్రిటీష్ కాలంలో సాధించుకుంటే ప్రస్తుతం కోడ్‌లలో మోదీ దాన్ని మింగేశాడు. వేతనాల కోసం సమ్మెలు చేయకూడదు, వేతనాల పై డిమాండ్ చేయరాదు, కష్టాలు చెప్పుకోవటానికి ప్రస్తుతం ఉన్న లేబర్ కమీషన్ వ్యవస్థను మోదీ రద్దుచేసి సంఘాలకు ఉన్న హక్కులను తొలగించాడు. కార్మికునికి కర్మాగారంలో ప్రమాదాలు జరిగినప్పుడు నష్టపరిహారం చెల్లించే చట్టాన్ని బ్రిటీష్ కాలంలో 1923లోనే సాధించుకోవటం జరిగింది. కానీ నేటి కోడ్‌లలో నష్టపరిహారం కోసం ప్రమాదాన్ని పరిశీలించి సిఫార్సు చేసే ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ వ్యవస్థను రద్దు చేయటం ఎవరికి లాభం చేయటానికో సులువుగానే అర్థమవుతుంది.

కాంట్రాక్టు కార్మికులను శాశ్వత తరహా ఉద్యోగాల్లో నియమించరాదని చట్టంలో ఉంటే మోదీ ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ అనే కొత్త తరహా విధానం ప్రవేశపెట్టి యాజమాన్యాల దోపిడీకి మరింత బలం చేకూర్చాడు. గతంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, క్యాజువల్ విధానాలకు ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ అదనంగా చేర్చి పారిశ్రామిక వేత్తల అదనపు దోపిడీకి మోదీ సహకరించాడు. 1970లో ఆనాటి ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టంలో సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఉన్నప్పటికీ 2014 నుండి దాని అమలుకు మోదీ ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదు. 2016లో సుప్రీంకోర్టు దీనిపై అనుకూలమైన తీర్పుతో సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని చెప్పినప్పటికీ మోదీ ప్రభుత్వం మొండిగా ప్రవర్తించి ఆ తీర్పును అమలు చేయలేదు. అలాంటి మోదీ తాను తెచ్చిన కోడ్‌ల మూలంగా కార్మికులకు సంక్షేమం మరియు లాభం జరుగుతుందని తన కార్పొరేట్ శిష్యులతో ప్రచారం చేయించటం మరింత ద్రోహం. కార్మికులు తాత్కాలికంగా కాకుండా పర్మినెంట్ ఉద్యోగాల్లో ఉంటే కార్మికుడు పనిదొంగగా మారుతాడని దోపిడీదారులు చేస్తున్న ప్రచారానికి మోదీ కూడా వంతపాడుతున్నాడు. మేడే స్ఫూర్తితో రక్తతర్పణతో కార్మికులు 8గంటల పనిదినాన్ని సాధించుకుంటే మోదీ 10 గంటలు లేక 12 గంటలు రోజుకు పనిచేయించుకోవచ్చు అని కోడ్‌ల ద్వారా దోపిడీదారులకు వజ్రాయుధాన్ని అందించాడు.

ప్రస్తుతం ఉన్న ఫ్యాక్టరీ యాక్ట్ ద్వారా కర్మాగారంలో కార్మికునికి కల్పించవల్సిన మౌలిక సౌకర్యాలైన నీరు, వెలుతురు, మరుగుదొడ్లు, భద్రతా సౌకర్యాలు లాంటి వాటిని పరిశీలించే ఇన్‌స్పెక్టర్ వ్యవస్థను తొలగించి యాజమాన్యాలకు కార్మికున్ని కొత్తతరం బానిసలుగా అందించాడు. అదే రకంగా కర్మాగారాల్లో కార్మికుడు పొందవల్సిన ఇయస్‌ఐ, పిఎఫ్, బోనస్, కనీస వేతనాలు లాంటి వాటి అమలు కొరకు పరిశీలించే వ్యవస్థను కూడా మోదీ ప్రభుత్వం కోడ్‌ల ద్వారా హరించి వేయటం జరిగింది.

కార్మికుడు తనకు యాజమాన్యం నష్టం చేసినప్పుడు లేక కష్టానికి గురిచేసినప్పుడు నేరుగా కోర్టును ఆశ్రయించే విధానాన్ని రద్దుచేసి కార్మికులను దిక్కులేనివారిగా కోడ్‌ల ద్వారా చేయటం జరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికుడు న్యాయం పొందాలంటే వైకుంఠపాళి ఆట చవిచూడాల్సివస్తుంది. ప్రస్తుతం ఉన్న చట్టాల ప్రకారం 100మంది కార్మికులు పనిచేస్తున్న కర్మాగారం మూసివేయాలంటే యజమాని తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి పొందాలి. దానిని కోడ్‌లలో ఆ సంఖ్యను 300కు పెంచటం జరిగింది. కర్మాగారాల్లో కాంట్రాక్టు వ్యవస్థ మరియు ఫిక్స్‌డ్‌టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ లాంటి వ్యవస్థలు ఉంటే యజమాని 300ల కన్నా ఎక్కువ కార్మికులను నియమించుకుంటాడనేది కలలో మాట. 95 శాతం పరిశ్రమలు నేటికి 300లు కన్నా తక్కువ కార్మికులనే కల్గివున్నాయనేది వాస్తవం. ఇప్పుడున్న పారిశ్రామిక వివాదాల చట్టంలో కార్మికున్ని తొలగించాలంటే యాజమాన్యం అనేక నిబంధనలు పాటించాలి. కానీ ప్రస్తుతం ప్రవేశపెట్టిన 4 కోడ్‌ల ప్రకారం కార్మికున్ని తీసివేయటానికి యాజమాన్యానికి ఎలాంటి అడ్డంకులు లేవు. కూరలోని కరివేపాకులా తీసిపడేయటానికి యాజమాన్యానికి మోదీ హక్కు కల్పించాడు. పరిశ్రమల మూసివేతకు మోదీ ప్రభుత్వం యాజమాన్యాలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా కోడ్‌లు తెచ్చింది. కార్మికులు కష్టాలు, బాధలు పడుతుంటే యాజమాన్యాలు లాభాలతో ఆనందపడటం భవిష్యత్తులో జరిగేది వాస్తవం. ఇలాంటి పరిస్థితి రావటానికి పూర్తిగా కోడ్‌ల ప్రభావం అనేది తేలికగానే అర్థం చేసుకోవచ్చు. కార్మికులపై కోడ్‌ల మూలంగా పడుతున్న వ్యతిరేక ప్రభావాన్ని కాదని కోడ్‌లు మూలంగా కార్మికులకు న్యాయం జరుగుతుందని, వేతనాలు పెరుగుతాయని, కొత్త ఉద్యోగాలు ఏర్పడతాయని వక్రబుద్ధితో ప్రచారం చేస్తున్న వారిని దోపిడీదారుల తొత్తులుగా భావించాలి.

ఉన్న చట్టాలను సక్రమంగా అమలు చేయలేనివాడు కొత్త కోడ్‌ల తెచ్చి కార్మికులకు మేలు చేస్తానని చెప్పటం నక్క నీతి వచనాలను గుర్తు చేస్తున్నాయి. అంతిమంగా కోడ్‌లు అమలుచేస్తే కార్మికులు బానిసలుగా మారటం తప్పనిసరి. బానిసకాలంలో బానిసలు తిరుగుబాటు చేసి ఆనాడు యంత్రాలే వారి కష్టాలకు కారణమని భావించి ఆ యంత్రాలను పగలగొట్టారు. అప్పుడు యజమానులే దిగివచ్చి కార్మికుల డిమాండ్లను పరిష్కరించారు. నేటి కార్మికుడు తమకు కష్టాలకు యాజమాన్యాలే కారణం అని తెలుసుకుంటే వారి ఆవేశం యాజమాన్యాలపై సారించి తిరుగుబాటు చేసే అవకాశాలు నిండుగా ఉన్నాయి. ఇలాంటి సంఘటనలు గతంలో అనేక రాష్ట్రాల్లో జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయని ప్రభుత్వం తెలుసుకోవాలి. కెనడా దేశ ప్రధాని "మా దేశం అమ్మకానికి లేదని" ప్రకటించినట్లుగానే మన దేశ కార్మికులు మేము బానిసలము కాదు అనే ఉద్యమం భారతదేశంలో తప్పనిసరిగా తీసుకువస్తారని ప్రభుత్వాలు గర్తించాలి. భారతదేశంలో కార్మికులను బానిసలుగా దోచుకోవటానికి ప్రభుత్వాన్ని లోబరుచుకొని కార్మికుల హక్కులను హరించి ఈ దేశంలో పెట్టుబడులు పెడితే వారు ఊహించినట్లు పారిశ్రామిక శాంతి కాకుండా పారిశ్రామిక విప్లవం వస్తుందని వారు తెలుసుకోవాల్సిన చారిత్రక సత్యాలు చాలా ఉన్నాయి. కార్మికుల ఆవేశాన్ని ప్రక్కదోవ పట్టించటానికి మోదీ ప్రభుత్వం కొత్త నాటకానికి తెరలేపటం జరిగింది. అదే "కార్మిక శక్తి నీతి 2025" పేరుతో చట్టం తెచ్చి ప్రచారం చేస్తున్నది. దాని ప్రకారం కార్మికుడు పనిచేయటానికే పుట్టాడు అది ప్రకృతి ధర్మం, కావున కార్మికుడు తన ధర్మాన్ని తాను నెరవేరిస్తే యజమాని తన ధర్మాన్ని నిర్వహిస్తాడని తప్పుడు ప్రచారం చేయటం మనువాద కాలంలో ప్రజలు అనుభవించిన పరిస్థితులను గుర్తుచేస్తున్నది.

ఉట్టికి ఎగరలేనమ్మ, స్వర్గానికి ఎగిరినట్టుగా ఉన్నచట్టాలను అమలు చేయని మోదీ ప్రభుత్వం యాప్ ఆధారిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు న్యాయంచేస్తానని ప్రచారం చేయటం పెద్ద బూటకం. భవన నిర్మాణ కార్మికులకు ఉన్న చట్టాన్ని న్యాయపరంగా అమలు చేయటంలో విఫలమైన ప్రభుత్వం వారు దాచుకున్న డబ్బును ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేయటంపై ఆ రంగంలోని కార్మికులు పోరాటం చేస్తున్నా పరిష్కారం లేదు. అలాంటిది యజమాని అనే వాడు లేని యాప్ ఆధారిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు గుర్తింపు కార్డు ఇస్తామని, ఇయస్‌ఐ, పిఎఫ్ కలుగజేస్తామని ఇంకా అనేక సౌకర్యాలు ఇస్తామని చెప్పటంలో నీతిలేదు అనేది అర్థం చేసుకోవాలి. ప్రస్తుతం దేశంలో పనిచేస్తున్న లక్షలాది మంది కాంట్రాక్టు కార్మికులకు, అనేక లక్షలమంది పనిచేస్తున్న ప్రైవేటు కర్మాగారాల్లో ఏ చట్టం అమలు కాకపోతే కేంద్ర ప్రభుత్వం కుంభకర్ణునిలాగా నిద్రపోతున్నది. అలాగే దేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్కీం బేస్డ్(ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, సాక్షర భారతిలాంటి) అనేక రంగాల్లో ఎన్నో సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, సెలవులు, ఇయస్‌ఐ, పిఎఫ్, గ్రాట్యుటీ లాంటి ఎలాంటి సౌకర్యం లేక చాలీచాలని వేతనాలతో పనిచేయటం కేంద్ర ప్రభుత్వానికి కనపడటం లేదా? మోదీ తెచ్చిన కోడ్‌లతో సంభవించిన బానిస విధానాన్ని, యజమానుల దోపిడీని ఎదిరించటం కార్మికుల ముందున్న జీవన్మరణ సమస్య. ఎవరు అడ్డుపడినా గత చరిత్ర ప్రకారం కార్మికుల తిరుగుబాటు తప్పదనే సూచనలు కనపడుతున్నాయి. దోపిడీ చరిత్రను అంతం చేయాల్సిన కర్తవ్యం కార్మికుల ముందు ఉన్నదని ప్రస్తుత పరిస్థితులు తెలియజేస్తున్నాయి.

# ఓటరు చైతన్యమే గ్రామాభివృద్ధికి మూలం



ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646

భారతీయ ప్రజాస్వామ్యంలో అత్యంత బలమైన పునాది గ్రామం. గ్రామం బలపడితేనే దేశం బలపడుతుంది. గ్రామ అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం. ఈ గ్రామ పాలనలో అత్యంత ప్రధానమైనవి గ్రామపంచాయతీ ఎన్నికలు. చట్టసభల ఎన్నికల కంటే సాధారణంగా చిన్నవి అనుకున్నా, నిజంగా చూసుకుంటే మన దైనందిన జీవితంపై ప్రతిరోజూ ప్రభావం చూపేది గ్రామస్థాయి పరిపాలనే.గ్రామాల అభివృద్ధిలో ప్రథమ పౌరుడు సర్పంచితో పాటు వార్డు సభ్యులే క్రియాశీలక పాత్ర. వారు సమర్ధంగా వ్యవహరిస్తే. ప్రజలు ఆదరించి, పదవులు కట్టబెడతారు. గ్రామపంచాయతీలు, పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తులతో కూడిన మూడంచెల గ్రామీణ స్థానిక ప్రభుత్వ సంస్థల వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం చేత నియమించబడిన బలవంతరాయ్ మెహత కమిటీ 1957లో సిఫార్స్ చేయడం జరిగింది. ఈ సిఫార్సులను అనుసరించి రాజస్థాన్ ప్రభుత్వం 1957 అక్టోబర్ 2న మొట్టమొదటిసారిగా పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టింది.ఆ తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1959 అక్టోబర్ 11 తేదీన తేదీన పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టింది. ఆ తరువాత అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత రాష్ట్రాలు పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టాయి.

**73 వ రాజ్యాంగ సవరణతో రాజ్యాంగ ప్రతిపత్తి..**

భారత రాజ్యాంగంలోని మూడంచెల వ్యవస్థలో ప్రజలకు దగ్గరగా పనిచేస్తున్న సంస్థలు గ్రామపంచాయతీలను బలోపేతం చేయడానికి పంచాయత్ రాజ్ అంశం రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో చేర్చడం జరిగింది. ఆదేశిక సూత్రాలలోని అంశాలను ప్రభుత్వాలు విధిగా పాటించాలన్న నియమం లేదు. ఈ కారణంగా మన దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థ కొంత నిరాదరణ కు గురైంది.1992 సంవత్సరంలో అమలులోకి వచ్చిన 73 వ రాజ్యాంగ సవరణ పంచాయతీరాజ్ సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పించి జవసత్వాలను ఇచ్చింది. 73వ రాజ్యాంగ సవరణను అనుసరించి ప్రతి గ్రామపంచాయతీలో అనివార్యంగా గ్రామసభ సమావేశాలను ప్రతి సంవత్సరంలో కనీసం రెండుసార్లు నిర్వహించాలి. గ్రామంలోని ఓటర్లందరూ గ్రామసభలో సభ్యులు. గ్రామసభ గ్రామస్థాయి శాసనసభ వలే పని చేయాలి. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల లబ్ధిదారుల ఎంపికలో ఈ సభ ప్రధాన పాత్రను పోషిస్తుంది. అయితే దురదృష్టవశాత్తు ఈ గ్రామసభ సమావేశాలు మొక్కుబడిగా మారాయి అన్న విమర్శ ఉంది.

గ్రామపంచాయతీలకు రాజ్యాంగ భద్రత లభించింది. రాజ్యాంగం అధికరణ 243 జి గ్రామపంచాయతీలను బలోపేతం చేయాలని ఆదేశాలు ఇచ్చింది. 11వ షెడ్యూల్ లో చెప్పిన విధంగా రాష్ట్ర ప్రభుత్వాలు 29 శాఖలను సంబంధించిన పనులు గ్రామపంచాయతీలకు బదలాయింపులు చేయాలని చెప్పడం జరిగింది.

పార్లమెంటుకు, రాష్ట్ర శాసనసభకు క్రమం తప్పకుండా ఎన్నికలు ఎలా జరుగుతాయో అలాగే పంచాయతీలకు, మున్సిపాలిటీలు కూడా వాటి పదవి కాలం ముగిసే ముందే ఎన్నికలు జరపాలి. కొత్త పాలకవర్గం పాత వారి పదవీకాలం ముగిసేనాటికి సిద్ధంగా ఉండాలి.

**తెలంగాణలో 20 నెలలు ఆలస్యంగా ఎన్నికలు:**

తెలంగాణ రాష్ట్రంలోని12,769 పంచాయతీలతో పాటు 539 మండల ప్రజా పరిషత్తుల పాలకవర్గ గడువు 2024 ఫిబ్రవరి 1 తో ముగిసినా స్థానిక సంస్థల్లో బీసీల కు 42 శాతం రిజర్వేషన్ అంశం పెండింగ్ లో ఉన్న కారణంగా పంచాయతీ ఎన్నికల అంశం కొంత గందరగోళానికి గురైంది. నేడు రాష్ట్ర హైకోర్టు ఆదేశాలతో 20 నెలలు ఆలస్యంగా ఈనెల 11, 14, 17 తేదీలలో మూడు దశలలో రాష్ట్రంలో12769 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగుతున్నాయి. సర్పంచులకు, వార్డు సభ్యులకు నామినేషన్ల పర్వం ముగిసింది. పార్టీల ప్రమేయం లేకుండా స్వతంత్ర గుర్తులతో ఎన్నికలు నిర్వహణ జరుగుతున్నందున సర్పంచులకు, వార్డు సభ్యులకు పోటీలు పడి నామినేషన్లు వేసి ప్రచారం ఊపు అందుకుంది.

**అభివృద్ధికి పాటుపడే వ్యక్తులను ఎన్నుకోవాలి :**

ఎన్నికల ముందు అభ్యర్థులు హామీల వరద పారిస్తారు. వారి మాయమాటలకు లోనుకాకుండా ఓటర్లు ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి.' ఇప్పటి వరకు అభ్యర్థి ఏం చేశారు', అని ప్రశ్న అత్యంత ప్రధానమైనది. గతంలో పదవిలో ఉన్న అభ్యర్థి అయితే అతని పనులు పరిశీలించాలి. కొత్త అభ్యర్థి అయితే గ్రామం కోసం చేసిన సామాజిక సేవలు చూసుకోవాలి. వాగ్దానాల జాబితా పొడవుండొచ్చు. కానీ హామీలను సాధించే, నెరవేర్చే కృతనిశ్చయం అభ్యర్థి కలిగి ఉండాలి. అభ్యర్థి వ్యక్తిత్వం అత్యంత కీలకం. నిజాయితీగా ఉన్నవాడై, ప్రజల మాట వినగలడా, వివాదాలను శాంతితో పరిష్కరించగలడా? గ్రామ రాజకీయాలకు తావివ్వకుండా.. ప్రజలతో మమేకమై అన్ని వర్గాలను కలుపుకునే వాడుగా ఉంటు గ్రామాభివృద్ధిపై దృష్టి పెట్టే అభ్యర్థిని సర్పంచ్ గా ఎన్నుకోవాలి.

**ఓటర్స్ డబ్బు,బహుమతులకు లోనుకాగూడదు:**

ఎన్నికల సమయంలో డబ్బు ఉన్నటువంటి వారు అనేక భ్రమలు కల్పిస్తారు. ముఖ్యంగా డబ్బు, బహుమతులు,త్రాగుడు, విందులు ఇవ్వడం సాధారణం. అవి తీసుకొని ఓటు వేయడం మన వ్యక్తిగత ప్రయోజనం అనిపించగా, గ్రామ భవిష్యత్తుకు అది పెద్ద నష్టం. డబ్బు ఇచ్చే నాయకుడు పదవిలోకి వెళ్లాక మరింత డబ్బు సంపాదించడానికి ప్రయత్నిస్తాడు. అందువల్ల ఓటర్సు 'ఈరోజు ప్రయోజనం' కన్నా 5 సంవత్సరాల అభివృద్ధి గురించి ఆలోచించాలి. గ్రామాభివృద్ధికి ఆలోచించాలి. గ్రామాన్ని ముందుకు నడిపేది సర్పంచ్ మాత్రమే. మంచి నాయకుడు ఉంటే గ్రామం అద్భుత మార్పులు చూడగలదు. చెడు నాయకుడు ఉంటే గ్రామం సంవత్సరాలపాటు వెనుకబడిపోవచ్చు. అందుకే ఓటు వేయడానికి ముందు ఓటరు నిశితంగా ఆలోచించాలి.ఓటర్ డబ్బు, విందు, వినోదానికి, భ్రమలకు దూరంగా ఉండాలి. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓటు వేయడం అంటే.. గ్రామ భవిష్యత్తుకు నిర్ణయం తీసుకోవడం. గ్రామ అభివృద్ధికి బాటలు వేయటం. గ్రామ అభివృద్ధి చెందితేనే రాష్ట్ర అభివృద్ధి చెందుతుంది. రాష్ట్రం అభివృద్ధి చెందితేనే దేశం బలపడుతుంది. ఆ బలం మన చేతుల్లో మన ఓటుతో ప్రారంభమవుతుంది.

# సమష్టి బాధ్యతతోనే మానవ హక్కులకు రక్షణ

భూమిపై పుట్టిన ప్రతి మనిషికి స్వతంత్రంగా జీవించేందుకు కొన్ని హక్కులుంటాయి. కానీ అనేక సందర్భాల్లో ఆ హక్కులను ఎవరూ గౌరవించడం లేదు. సాటి మనిషిని మనిషిగా కూడా చూడడం లేదు. కొన్ని సందర్భాల్లో సమాజం కూడా ఈ హక్కులను హరించివేస్తోంది. ఈ అనంత విశ్వంలోని జీవులలోకెల్లా ప్రత్యేకమైన జాతి మానవజాతి. సృష్టిలోని అనేక జీవులలో మనిషిని ఉన్నత స్థాయిలో నిలబెట్టేది అతని ఆలోచనాశక్తి, వివేచన, సృజనాత్మకత మరియు పరస్పర సహకార భావనలు. మానవజాతి యావత్తూ ఏకతాటిపై నిలబడే సందర్భమే ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం. ఈరోజు మనిషి పట్ల సాటి మనిషి వ్యవహరించాల్సిన తీరును బోధించి, మానవత్వం, సమానత్వం వంటి విలువలను గుర్తుచేసేందుకు గాను ప్రతి సంవత్సరం డిసెంబర్ 10వ తేదీన ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

మానవుని జీవితాన్ని గౌరవప్రదంగా, భద్రంగా, స్వేచ్ఛగా జీవించగలిగే పరిస్థితుల్ని కల్పించడానికి, అందరికీ సమాన అవకాశాలు కల్పించడానికి, ఒక మెరుగైన సమాజస్థాపనకు ఐక్యరాజ్య సమితి 1948, డిసెంబర్ 10న 'సార్వత్రిక మానవ హక్కుల ప్రకటన'ను ఆమోదించింది. కుల, జాతి, వర్ణ, దేశ, లింగ బేధాలు లేకుండా అందరికీ వర్తించేలా 30 హక్కులను ఈ ప్రకటనలో పొందుపర్చారు. జీవించే హక్కు, సమానత్వ హక్కు, స్వేచ్ఛ హక్కు, విద్యా హక్కు, వ్యక్తిగత గౌరవం, మత స్వేచ్ఛ, ఉద్యోగ భద్రత, సమాన ఉద్యోగావకాశాలు,చట్టం ముందు సమానత్వం, బానిసత్వ వ్యతిరేక హక్కులు,అభిప్రాయ స్వేచ్ఛ. ప్రజాస్వామ్య పాలనలో పాల్గొనే హక్కు, చట్ట ఉల్లంఘనలకు చట్టపరమైన పరిష్కార హక్కు, నిర్దోషిగా భావింపబడడం మరియు శిక్షాహక్కు, ఆస్తిస్వామ్య హక్కు, దేశంలో స్వేచ్ఛ, ప్రయాణ హక్కు, వివాహం మరియు కుటుంబ స్థాపన హక్కు, విద్యాహక్కు మొదలైనవి ఈ ప్రకటనలో పేర్కొన్న కొన్ని హక్కులు. ఇవి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వ్యక్తులందరికీ వర్తిస్తాయి. ప్రపంచ దేశాల రాజ్యాంగాలు, న్యాయ వ్యవస్థలు కూడా ఈ హక్కులను అనుసరిస్తున్నాయి.

1950, డిసెంబర్ 4న జనరల్ అసెంబ్లీ యొక్క ప్లీనరీ సమావేశంలో మానవ హక్కుల దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించారు. అన్ని ఐక్యరాజ్య సమితి సభ్యదేశాలు మరియు ఆసక్తిగల ఇతర సంస్థలు ఈ దినోత్సవాన్ని జరుపుకోవాలని నిర్ణయించాయి. మానవ హక్కుల రంగంలో నిర్విరామ కృషిచేస్తు న్న ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర సంస్థలు కూడా ఈ దినోత్సవాన్ని స్మరించుకోవడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాయి. 2025 సంవత్సరానికి గాను ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం అధికారిక ఇతివృత్తం మన రోజువారీ అమూల్య వస్తువులు'. ఈ అమూల్య వస్తువులు 'సురక్షిత జీవితం, గౌరవం, స్వేచ్ఛ, సమానత్వం మొదలైనవి మన రోజువారీ దినచర్యలో భాగంగా పరిగణించాలని గుర్తుచేస్తున్నాయి. మనిషి మనిషిగా జీవించడానికి హక్కులు అత్యవసరం. కానీ అనేక సందర్భాల్లో అవి ఉల్లంఘనలకు గురవుతున్నా యి. భారతదేశంలో అనాదిగా పాతుకుపోయిన కుల వ్యవస్థ, అస్పృశ్యత, అంటరానితనం వల్ల బడుగు బలహీన వర్గాలు వివక్షకు గురైనాయి. కులం ఆధారంగా మనుషులపై వివక్ష చూపడం భారతదేశంలో శతాబ్దాలుగా కొనసాగింది. ఇప్పటికీ జైల్లో కూడా కుల వివక్షత కొనసాగుతుంది. ఈ విషయాన్ని ఇటీవల సుప్రీం కోర్టు తప్పుపట్టింది. షెడ్యూల్ కులాల ఖైదీల చేతనే మరుగుదొడ్లు కడిగించడం,ట్యాంకులు శుభ్రం చేయించడం వంటి పనులు చేయించడంపై ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. అగ్ర కులాల ఖైదీలకు సులభమైన వంట పనులు అప్పగించడం ముమ్మాటికీ వివక్షే అవుతుందని పేర్కొన్నది. అలాగే అనేక సంఘటనల్లో అమాయకులైన దళిత, గిరిజనులనే నేరస్థులుగా చూపిస్తున్నారు.

మానవ హక్కుల దినోత్సవాలు ఎన్ని జరుపుకుంటున్నా ఇప్పటికీ చాలా దేశాల్లో మానవ హక్కుల ఉల్లంఘనలు యథేచ్ఛగా జరుగుతుండడం శోచనీయం. ప్రభుత్వ విధానాలు, వాటి అమలు, వాటిపై ప్రజల అవగాహన మొదలైనవి మానవ హక్కులపై ప్రభావం చూపుతాయి.

(డిసెంబర్ 10 అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా)

సుధాకర్ ఎవి, 9000674747

# సర్పంచ్ ఎన్నికలలో వలస ఓటర్ల కోసం వేట

రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుతోనే తమలాంటి వలస ఓటర్లకు తమ సొంత ప్రాంతంలో గౌరవ, మర్యాదలు దక్కుతున్నాయని వలస ఓటర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత రాజ్యాంగం యొక్క గొప్పతనం అని వారు ప్రజాస్వామ్య స్ఫూర్తిని, రాజ్యాంగ గొప్పతనాన్ని గుర్తు చేశారు. తెలంగాణలో సర్పంచు ఎన్నికలు వచ్చాయంటే గ్రామాలన్నీ ఒక కొత్త ఉల్లాసంతో కదలికలోకి వస్తాయి. అయితే గత ఐదేళ్లలో పెద్ద సంఖ్యలో యువత, మధ్య వయస్సు వారు హైదరాబాదులో పనికోసం స్థిరపడి ఉండటంతో, ఇప్పుడు గ్రామాల ఓటు సమీకరణాలు మారిపోయాయి.

**గెలుపును నిర్ణయించేది వలస ఓటర్లే**

ఎన్నికల్లో నిజంగా ఎవరిది బలం? గ్రామాల్లో ఉన్న ఓటర్లదా? లేదా హైదరాబాదులో ఉన్న వలస ఓటర్లదా? అసలు ఫలితాలను తేల్చేది నగరాల్లో పనిచేస్తున్న ఈ ఓటర్లేనని రాజకీయ నాయకులు అర్థం చేసుకున్నారు. అందుకే ఇప్పుడు గ్రామాలు హైదరాబాద్ రూట్‌లో పొలిటికల్ ట్రాఫిక్ గరిష్ట స్థాయిలో ఉంది. వలస ఓటర్ల కోసం ఆపరేషన్ హైదరాబాద్ సర్పంచ్ అభ్యర్థులు, వారి అనుచరులు, మద్దతు దారులు ఎవరు చూసినా హైదరాబాదులోనే తిరుగుతున్న దృశ్యం కనిపిస్తుంది. హయత్‌నగర్, పటాన్ చెరువు, కూకట్‌పల్లి, బోర్లగూడ, చింతల్, అల్వాల్ ఇలా కార్మికులు పెద్ద సంఖ్యలో ఉండే ఏ ప్రాంతంలో చూసినా రెండు రోజులుగా అద్దె బస్సులు, ట్రావెల్స్ వాహనాలు వరుసగా కనిపిస్తున్నాయి. ఒక్క గ్రామం నుంచే 12 బస్సులు ప్రతి బస్సులో 40నుండి 50 ఓటర్లు ప్రతి ఓటరుకి వసతి, భోజనం భరోసా ఇది సాధారణ విషయం కాదు. ఇది రాజకీయ పెట్టుబడి. ఓటు వేయటానికి గ్రామాలకు వెళ్లాలంటే రెండు రోజులు వేతనం పోతుంది. హైదరాబాద్‌లోని పనిచేసే కార్మిక కుటుంబాలు ఈ విషయాన్ని స్పష్టంగా చెబుతున్నారు. మీ లాస్ మేము చూసుకుంటాం అన్నయ్యా... అక్కా, మీరువస్తే సరిపోతుంది, సర్ చూసుకుంటాడు. అంటూ నచ్చజెప్పి, బస్సులో ఎక్కిస్తున్నారు. కొన్నిచోట్ల, కాంట్రాక్టర్లు కూడా అభ్యర్థుల దగ్గరే ప్యాకేజ్ తీసుకుని కార్మికుల సెలవు చూసుకుంటున్నారు.

**గ్రామాల్లో స్వాగత వాతావరణం :** హైదరాబాద్ నుండి ఓటర్లు గ్రామాలకు చేరడం మొదలైతే అక్కడే పండుగ మూడ్ ప్రారంభమవుతుంది. వసతిభోజన ఏర్పాట్లు, బడి భవనాల్లో గదులు, కమ్యూనిటీ హాళ్లలో పడకలు, రాత్రి భోజనం, ఉదయం టిఫిన్లు వంటచేసే ప్రత్యేక బృందాలు, ఒక్కో అభ్యర్థి కింద 200 నుండి 500 మంది వలస ఓటర్లు ఇలా ప్రత్యేక అతిథ్యం పొందుతున్నారు.

**సాంప్రదాయ స్వాగతం :** కొన్ని గ్రామాల్లో వలస ఓటర్లకు గంగిరెద్దుల ఆడింతలు, బొమ్మలాట ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువకులు, ఎవరైనా వచ్చారంటే అందరూ ఆనవాయితీగా కలిసి మాట్లాడుతున్నారు.

కేవలం గ్రామాల్లో కాకుండా హైదరాబాదులోనే ప్రచారం పెరిగింది.మార్కెట్ ప్రాంతాల్లో ప్రచారం బీర్ల తయారీ గోదాములు, కర్మాగారాలు, నిర్మాణ సైట్లు, షాప్‌లతో నిండిన సెంటర్లు ఇక్కడే అభ్యర్థులు స్వయంగా వచ్చి వారిని ఒప్పించడం మొదలుపెట్టారు. అన్న ఈసారి ఓటు చాలా ముఖ్యం మనకొక అవకాశం ఇవ్వండి. అంటూ చేతులు కలుపుతున్నారు.

**వలస ఓటర్ల లెక్క :** భారీ సంఖ్యలో వలస వచ్చిన వారి వల్ల మొత్తం ఓట్లలో 20 నుండి 40 % ఓటర్లు హైదరాబాదులోనే ఉన్నారని లెక్కలు చెబుతున్నాయి. ఒక్క గ్రామంలో 300 నుండి 800 మంది వరకు నగరాల్లో ఉండటం సాధారణం అయిపోయింది. వలస వచ్చిన యువత ఎక్కువగా కొత్త అభ్యర్థుల పట్ల ఆకర్షితులు. పెద్ద వారు మాత్రం సంప్రదాయం ప్రకారం పాత నేతలకు మొగ్గు. మహిళలు అభ్యర్థుల ఆత్మీయత, భద్రత హామీలను చూసుకుని నిర్ణయం. ఈ భిన్నతలు ఓటు బ్యాంకులను చీల్చేస్తున్నాయి. పెద్ద గ్రామాల్లో అభ్యర్థులు వలస ఓటర్ల డేటాను పూర్తిగా సేకరించి, చిరునామా కుటుంబ సభ్యుల పేర్లు ఓటింగ్ బూత్ నెంబర్లు ఇలా వివరాలను తయారు చేసి, వచ్చేవారు, రానివారు అనే రెండు జాబితాలు తయారు చేసుకున్నారు. ఓటర్లను పంపించేందుకు వాడే యాప్‌లు కొంతమంది యువకులు వాట్సాప్ గ్రూపులు, ఎక్సెల్ షీట్లు, గూగుల్ మ్యాప్స్ పిన్‌లోకేషన్లతో డిజిటల్ పద్ధతిలో మొత్తం ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.




ఇది నిజంగా చిన్న ఎన్నికల ఆపరేషన్ కమాండ్ రూం లాంటి దే.

**గ్రామాల్లో పోటీ తీరు :** పాత నాయకులు, గ్రామంలోని వృద్దులు మన కుటుంబం, మన వంశం చేసిన సేవలు అంటూ ఓటర్లను ఒప్పిస్తున్నారు. అభివృద్ధి కావాలంటే కొత్త వాళ్లే పట్టణాల్లో ఉన్న యువత గ్రామాల్లో రోడ్లు, స్ట్రీట్ లైట్లు, నీటి సమస్యలు, డిజిటల్ సదుపాయాలు, వృద్ధుల నిర్వహణ వంటి అంశాలను ఎత్తిచూపుతూ కొత్త అభ్యర్థులలకు మద్దతు ఇస్తున్నారు. ఎన్నికల రోజు... ఎన్నికల రోజు గ్రామం మొత్తం పండుగలా మారిపోతుంది. ఉదయం నుంచే ట్రాఫిక్ బస్సులు వరుసగా గ్రామాలకి చేరుతుండగా, టెంట్ల వద్ద చాయ్, బూత్ దగ్గర నీళ్ల బాటిళ్లు, ఓటర్లకు ఆఖరి నచ్చజెప్పుట ఇతర కార్యక్రమాలు జరుగుతూనే ఉంటాయి.

ప్రజాపక్షం ప్రతినిధి, వనపర్తి

## పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి..



ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట : మండలంలోని పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని రోగాల బారిన పడవద్దని ఎల్లారెడ్డిపేట మండల వైద్యాధికారిణి సరియా అంజుమ్ అన్నారు.మంగళవారం అక్కపల్లి గ్రామంలో యూసిఎస్ స్కూల్‌లో విద్యార్థుల కోసం మెడికల్ క్యాంపు నిర్వహించారు.సీజనల్ వ్యాధులు ప్రభలకుండా గ్రామస్థులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే సిబ్బంది,డాక్టర్‌సాయిచంద్ర,డాక్టర్ సంద్యారాణి,ఇందిర,స్నేహ,ఆశాలు,ఏఎన్‌ఎంలు వైద్యసిబ్బంది ఉన్నారు.

## ఇంటి పన్ను వసూలుపై దృష్టి

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో ఇంటి పన్ను వసూలు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో ఇంటి, నీటి పన్ను వసూలు, ట్రేడ్ లైసెన్స్, తడి, పొడి చెత్త సేకరణ, వివిధ అభివృద్ధి పనుల పురోగతి, సిబ్బంది, వాహనాల అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో ఇప్పటి దాకా ఇంటి, నీటి పన్ను వసూలుపై ఆరా తీశారు. అధికారులు, సిబ్బందితో ఒక ప్రణాళిక ప్రకారం వసూలు చేయాలని సూచించారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, అన్వేష్, డీటీసీపీఓ అన్సార్, డీఈలు, టీపీవోలు తదితరులు పాల్గొన్నారు.



## తీగల రాజు ఆశయాలు కొనసాగించాలి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మడ్డి ఎల్లాగౌడ్



ప్రజాపక్షం/పెద్దపల్లి : కామ్రేడ్ తీగల రాజు ఆశయాలను కొనసాగించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎలా గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం రోజున పెద్దపల్లి జిల్లా ఓదేల మండల కేంద్రము తొలి అమరుడు సిపిఐ నాయకులు తీగల రాజు స్మారక స్తూపం వద్ద నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఎర్ర జెండా పార్టీ సిపిఐ లో పని చేసి ప్రజా, కార్మిక పోరాటాలు నిర్వహించి తమ జీవితాన్ని త్యాగం చేసిన తొలి అమరుడు తీగల రాజు ఆశయాలను కొనసాగించాలని, స్మారక స్తూపం రంగు వెలిసి పోయినందున మండల కేంద్రము లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు స్పందించి స్తూపం కు రెడ్ కలర్ వేసే విధంగా కృషి చేయాలని కోరారు.

## దోనూర్ సర్పంచ్‌గా పురుషోత్తం



ప్రజాపక్షం/ధర్మపురి : జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దోనూర్ గ్రామ సర్పంచిగా దాసరి పురుషోత్తం ఎన్నికయ్యారు.నామినేషన్ ఉపసంహరణ గడువైన మంగళవారం ఆయన ప్రత్యర్థి మామిడి సత్యం బరిలోనుండి తప్పుకోవడంతో పురుషోత్తం ఎన్నిక ఏకగ్రీవం అయింది. దీంతో గ్రామంలో హర్షాతిరేకాలు నెలకొన్నాయి.సర్పంచ్ పదవి ఏకగ్రీవానికి ధర్మపురి ఎఎంసి వైస్ చైర్మన్ సంగ నర్సింహులు ప్రత్యేక చొరవ చూపారు.యువకుడు గ్రామ సమస్యలపై అవగాహన ఉన్న పురుషోత్తం ఎన్నికకై సహకరించిన గ్రామ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి లక్ష్మ ణ్ కుమార్ ను పురుషోత్తం మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పురుషోత్తంను అభినందించారు. సంగ నర్సింహులు, నన్నెపు సురేందర్, తోట సరెందర్, తోట రమేష్,కల్యాడపు శంకర్,ముత్యం బంగారం, తదితరులు ఉన్నారు.

## 'ఆల్ఫోర్స్'లో రక్తదాన శిబిరం



ప్రజాపక్షం/కరీంనగర్: కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్ లోని తెలంగాణ చౌక్ లో మంగళవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తో కలిసి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, నేడు దేశవ్యాప్తంగా సోనియా గాంధీ జన్మదినోత్సవ వేడుకలను చాలా గొప్పగా కాంగ్రెస్ కార్యకర్తలు నిర్వహిస్తున్నారని, తెలంగాణ ప్రదాతగా సోనియా గాంధీ తెలంగాణ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. అర్బన్ బ్యాంక్ కోఆపరేటివ్ అధ్యక్షుడు కర్ర రాజశేఖర్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పెంద్యాల కేశవ రెడ్డి, కార్యదర్శి ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి, మాజీ ప్రభుత్వ విప్ ఆరేపల్లి మోహన్, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కిం ఫహద్, యువజన కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్, ప్రశాంత్, రాహుల్, అనిల్, అజీమ్, వివిధ విభాగాల కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో రోడ్స్ అండ్ బిల్డింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గడ్డం నగేష్ ఆవిష్కరించారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది హాజరు కాగా, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పాటిస్తూ అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఈఈ నరసింహాచారి, సీపీఓ శ్రీనివాసాచారి, డోర్స్ అధ్యక్షుడు డీవీ హెచ్ ఓ రవీందర్ రెడ్డి, ఏవో రాంరెడ్డి పాల్గొన్నారు.

## కారులో తరలిస్తున్న మద్యం పట్టివేత

ప్రజాపక్షం/ముస్తాబాద్:ముస్తాబాద్ మండలం మోహిని కుంటగ్రామానికి చెందిన పల్లటి కుమార్ అక్రమంగా మద్యం 30 క్వాటర్ బాటిల్లు కారులో మద్దికుంట గ్రామానికి తరలిస్తున్న సమయంలో పోలీసులు పట్టుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి మద్యంతో పాటు కారును సీజ్ చేశారు. అక్రమ మద్యం రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గణేష్ తెలిపారు.

## పోలింగ్ కేంద్రాలు పరిశీలన



ప్రజాపక్షం/ముత్తారం :పెద్దపల్లి జిల్లా ముత్తా రం పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఎస్ఐ రవికుమార్ మంగళవారంసందర్శిం చారు. ముత్తారం మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఎస్సై పరిశీలించారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించరాదని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రత్యేక నిఘా ఉందన్నారు.

## 90 ఏళ్లుగా విద్యార్థుల సమస్యలపై పోరాటం

### విద్యార్థులకు ఇచ్చిన హామీలు ఒక్కటీ అమలు కాలే.. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల : దేశంలో 90 సంవత్సరాలుగా విద్యార్థుల సమస్యల కోసం పోరాటాలు నిర్వహిస్తున్న చరిత్ర ఎఐఎస్ఎఫ్‌కు ఉందని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అన్నారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా 4వ మహాసభలను పురస్కరించుకొని మంగళవారం విద్యార్థులతో పాత బస్టాండ్ నుండి అంబేద్కర్ మీదుగా వస్త్ర వ్యాపార సంఘం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కుర్ర రాకేష్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు.భారతదేశానికి స్వాతంత్ర్యం కావాలని ఏర్పడి విద్యార్థులను చైతన్యం చేసి పోరాడిన ఏకైకవిద్యార్థి సంఘం మని కొనియాడారు. రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనలో విద్యార్థులకుఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. అందాల పోటీలకు ఉన్న నిధులు ,మెస్సీ తో ఫుట్ బాల్ ఆటపై ఉన్న శ్రద్ధ విద్యార్థులపై ఎందుకు లేదని ప్రశ్నించారు. మెస్సీతో ఫుట్ బాల్ ఆట కాదని విద్యార్థుల హాస్టళ్లను సందర్శించి నిధులు కేటాయించాలని ఎద్దేవ చేశారు.దేశంలో మోడీ ప్రభుత్వం 11 ఏళ్ల పాలనలోవిద్యార్థులను విస్మరించిందని దేశంలో విద్య ప్రవేటీకరణ,కార్పొరేటీకరణ,కాషాయికరణ చేయడానికికుట్ర చేస్తుందన్నారు. కరీంనగర్ ఎంపీ కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలంగాణ విభజన హామీల ప్రకారం తెలంగాణకి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకి రావలసిన కేటాయింపులను తీసుకురావడంలో విఫలమయ్యారన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చి రెండేళ్ల పాలన ప్రజా విజయోత్సవ సంబరాలు నిర్వహిస్తూన్నారని, విద్యార్థినిలకు ఎలక్ట్రిక్ స్కూటీలు, విద్యార్థి ఇంటింటికి ఉచిత ఇంటర్నెట్, 5లక్షల విద్య భరోసా కార్డు, మండలానికి ఇంటర్నేషనల్ పాఠశాల, యూనివర్సిటీ విద్యార్థులకు స్కాలర్షిప్‌లు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు ఏకకాలంలో విడుదల చేస్తామన్న హామీలు ఎందుకు అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో ఉన్న సంక్షేమ హాస్టల్ సందర్శించి వి ద్యార్థులు సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేనిపక్షంలో మంత్రులను ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు.మాజీ విద్యార్థి నాయకుడు జిల్లా ఏఐఎస్ఎఫ్ నిర్మాణ బాధ్యుడు మంద సుదర్శన్ ,ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కడారీ రాములు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర గర్ల్స్ కో కన్వీనర్ కండె విజేత, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శి కుర్ర రాకేష్, మంద అనిల్, పెండల అధిత్య, ముద్రకోల శశికుమార్, బం డారి చందు,బండి ప్రణయ్, వంశీ,శ్రీహరి, శివసాయి తదితరులున్నారు.

## అవినీతి రహిత సమాజమే లక్ష్యం

### కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్: అవినీతి రహిత సమాజం మనందరి లక్ష్యమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం పురస్కరించుకొని అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన పోస్టర్ ఆవిష్కరణ, ప్రతిజ్ఞ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. అవినీతి వ్యతిరేక దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. అవినీతిని నిరోధిస్తామని అధికారులు, ఉద్యోగులు కలెక్టర్ తో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అవినీతి నిర్మూలనలో విద్యార్థి, యువత పాత్ర చాలా కీలకమని అన్నారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే 1064 టోల్ ఫ్రీ నంబర్ కు సమాచారం అందించాలని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది తమ కర్తవ్యాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటేశ్వర్లు, ఏసీబీ డిఎస్‌పి విజయ్ కుమార్, ఇన్స్‌స్పెక్టర్ కృష్ణ కుమార్, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

## సబ్బండ వర్గాల ఆకాంక్షలకు స్ఫూర్తి..తెలంగాణ తల్లి

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి : సబ్బండ వర్గాల ఆకాంక్షలకు స్ఫూర్తిగా తెలంగాణ తల్లి విగ్రహం కలెక్టరేట్ వద్దరూపుదిద్దుకుందనిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ డి. వేణు తో కలిసి మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 60 ఏళ్ల ప్రజల సుదీర్ఘ పోరాటాల ఫలితంగా డిసెంబర్ 9న అప్పటి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పై మొదటి సారి సానుకూల ప్రకటన చేసిందని, ఆ రోజు ప్రజల పోరాట ఫలితాలను స్మరించుకుంటూ నేడు కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఉద్యమకారులను, తెలంగాణ నిపుణులతో చర్చించి ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహానికి అధికారిక గుర్తింపు తెచ్చిందని, రాష్ట్ర సచివాలయం తో పాటు ప్రతి జిల్లా కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాలు ఏర్పా టు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా పరిపాలన అధికారి బి.ప్రకాష్ , ఆర్ అండ్ బి ఈఈ బావ్ సింగ్, అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో టిఆర్‌టిఎఫ్‌ది కీలకపాత్ర

### సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్



ప్రజాపక్షం/ధర్మపురి : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి,వారి సంక్షేమంకోసం ప్రభుత్వాల ద్వారా ఎన్నో జీవోలను తీసుకురావడంలో తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్టీఎఫ్) కీలకపాత్ర పోషించిందని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం టీఆర్టీఎఫ్ 80 వసంతాల అభ్యుదయ ఉత్సవ సన్నాహ కార్యక్రమంలో భాగంగా మంత్రి అడ్లూరి చేతులమీదుగా కరపత్రం ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్ మాట్లాడుతూ విద్యాప్రగతి,సమాజ శ్రేయస్సు,ఉపాధ్యాయుల సంక్షేమం లక్ష్యాలుగా ఏర్పడిన ఎపిటీఎఫ్,తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత టీఆర్టీఎఫ్‌గా మొత్తం 80 వసంతాలు పూర్తి చేసుకుని ఈనెల 21న హైదరాబాద్ లో జరిగే అభ్యుదయ ఉత్సవానికి సిద్ధమైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రమేష్ కోరారు. టీఆర్టీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గజాభీమ్కార్ గోవర్ధన్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ దాసరి భీమయ్య, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బండారి సతీష్,మెరుగు రమేష్,జిల్లా బాధ్యులు కాసర్ల వెంకటరమణ, సాధు శ్రీకాంత్, వొజ్జల మహేష్,మండల బాధ్యులు ఈశ్వరుడు, సొందారికారి రాజేష్,గొల్లపల్లి మండల బాధ్యులు అన్వర్,డైరీ కన్వీనర్ ఎస్.ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలపరిచే అభ్యర్థులనే ఎన్నుకోండి

### ఎమ్మెల్యే విజయ రమణారావు

### పెద్దపల్లి నియోజకవర్గంలో ఆరుగురు సర్పంచులు ఏకగ్రీవం



ప్రజాపక్షం/సుల్తానాబాద్ : ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గడప గడపకు చేరేందుకు గాను పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచే అభ్యర్థులనే గెలిపించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు.పెద్దపల్లి నియోజకవర్గంలోని ఆరు గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సర్పంచులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సుల్తానాబాద్ మండలం లోని నారాయణరావుపల్లి సర్పంచ్ గా నామని రాజిరెడ్డి, గొల్లపల్లి సర్పంచ్ గా కొత్తూరి స్వరూప, రాముని పల్లి సర్పంచ్ గా సబ్బని అనసూయ, పెద్దపల్లి మండలం రాంపల్లి సర్పంచ్ గా కానపర్తి సంపత్ రావు, ఓదెల మండలం పిట్టల ఎల్లయ్య పల్లి సర్పంచ్ గా పిట్టల రవీందర్, ఎలిగేడు మండలం రేకలేవ్వపల్లి సర్పంచ్ గా మద్దెల రమాదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని ఎమ్మెల్యే విజయ రమణారావు కాంగ్రెస్ పార్టీ కండువాలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉండే సర్పంచులను కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిని ఎన్నుకుంటే మరింత అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు చేరువ అవుతుందని చెప్పారు. ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన ప్రజలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు వివిధ పక్షాలకు అయినా కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లోనూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇదే సాంప్రదాయాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు,శ్రీగిరి శ్రీనివాస్, వేగోళం అబ్బయ్య మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరి మహేందర్, పడాల అజయ్ ,కాంగ్రెస్ పార్టీ లీడర్లు పాల్గొన్నారు.

## శాంతియుతంగా ఎన్నికలు

ప్రజాపక్షం/గొల్లపల్లి : శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి అన్నారు. గొల్లపల్లి మండలంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉండడంతో గ్రామాలలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం మంగళవారం మండలంలోని రాఘవపట్నం,గుంజపడుగు, వెనుగుమట్ల , చందోలి, దమ్మన్నపేట,శ్రీరాములపల్లి గ్రామాలలో పర్యటించి ఎన్నికల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఓటు హక్కు చాలా విలువైనదని ప్రలోభాలకు లేదా ఒత్తిడులకు లోను కాకుండా ప్రజలు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్సై సూచించారు . ఎన్నికల నేపథ్యంలో వాట్సాప్ ,ఫేస్బుక్ ఇతర సోషల్ మీడియా లో ఇతరులను ఉద్దేశించి అనుచిత,వ్యాఖ్యలు చేయడం రెచ్చగొట్టే మెసేజ్ లు షేర్ చేయొద్దని ఎస్ఐ సూచించారు.వాట్సాప్ గ్రూపులతో పాటు ఇతర సోషల్ మీడియా వేదికలాన్ని పోలీస్ శాఖ పర్యవేక్షణలో ఉన్నాయని అన్నారు.ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు.స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.


## హుస్నాబాద్‌లో ఉపసంహరణ ముగిసింది..

### ఏకగ్రీవంగా ఎన్నికైన ముగ్గురు సర్పంచులు, 35మంది వార్డు సభ్యులు

ప్రజాపక్షం/హుస్నాబాద్: హుస్నాబాద్ మండలంలోని 17 గ్రామపంచాయితీలకు గాను 3 ఏకగ్రీవం కాగా 14 గ్రామ పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. 105 వార్డు సభ్యులకు గాను 59 మంది సర్పంచు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. తోటపెల్లి గ్రామ సర్పంచుగా బంక లక్ష్మి చందు, రాముల పల్లి గ్రామ సర్పంచుగా కాటం సప్నశ్రీనివాస్, వంగరామయ్యపల్లి సర్పంచుగా భూక్య రాజేశ్వరి తిరుపతి నాయక్ ఏన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

## 'సిద్దిపేట'లో మొదటి విడత ప్రచారానికి తెర..ప్రలోభాలకు ఎర

ప్రజాపక్షం/ సిద్దిపేట : సిద్దిపేట జిల్లాలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రచారానికి తెర పడింది. జిల్లాలోని గజ్వేల్ డివిజన్ పరిధిలో ఈనెల 11న పోలింగ్ నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నారు. మొదటి విడుతలో గజ్వేల్ డివిజన్ పరిధిలోని జగదేవ్‌పూర్, గజ్వేల్, మర్కూక్, ములుగు,వర్గల్, దౌల్తాబాద్, రాయపోల్ మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. 163 గ్రామపంచాయతీ ఎన్నికలకు 16 స్థానాలు, 224 స్థానాలు ఏకగ్రీవమైనాయి. 147 గ్రామపంచాయతీలకు 480 అభ్యర్థులు బరిలో ఉన్నారు. అలాగే 2797 మంది వార్డు సభ్యులు బరిలో నిలిచారు. అభ్యర్థులు తమకు కేటాయించిన గుర్తులతో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. జిల్లాలోని మొదటి విడుతల్లో 147 గ్రామపంచాయతీల్లో అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మంగళవారం సాయంత్రం 5గంటలకు ప్రచారానికి తెరపడింది. మొదటి విడుతలో ఏకగ్రీవమైన 16 స్థానాలు బిఆర్ఎస్ ఆదిక్యతను చాటింది.




**ప్రలోభాలకు ఎర**

సిద్దిపేట జిల్లాలో 7 మండలాల్లో జరుగుతున్న మొదటి విడుత ఎన్నికల్లో మంగళవారానికి ప్రచారానికి తెరపడటంతో ప్రలోభాలకు తెరలేపారు. ఏలాగైన ఓటర్లను మభ్య పెట్టి తాము ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఓటర్లను మద్యం, డబ్బులు పంపిణీ చేస్తున్నారు. గ్రామాల్లోకులసంఘాల పెద్దలను కలసి తమకే మద్దతుఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నట్టు సమాచారం.

## ఐదు మండలాల్లో నిషేధాజ్ఞలు అమలు

### పటిష్ట బందోబస్తు..సిపి గౌస్ ఆలం

ప్రజాపక్షం/కరీంనగర్: జిల్లాలో ఈ నెల 11న (గురువారం) జరగనున్న తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. ఆ తర్వాత బహిరంగ ప్రచారానికి అనుమతి ఉండదని అధికారులు పేర్కొన్నారు. జిల్లాలో తొలి విడతలో జరుగనున్న చొప్పదండి, గంగాధర, రామడుగు, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల్లోని మొత్తం 92 గ్రామ పంచాయతీల పరిధిలో ఎన్నికలు జరుగనున్నాయి. ఇందుకు జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంపై అధికారులు కీలక ఆదేశాలు జారీ చేశారు. తొలి విడత ఎన్నికలు జరిగే చొప్పదండి,గంగాధర, రామడుగు, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల పరిధిలో మంగళవారం సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే అభ్యర్థులు తమ ప్రచారాన్ని ముగించాలని స్పష్టం చేశారు. ఎన్నికల సజావుగా నిర్వహించేందుకు ఇప్పటికే ఐదు మండలాల్లో నిషేధాజ్ఞలు మంగళవారంసాయంత్రం ఐదు గంటల నుండి సెక్షన్ 163 బిఎన్ ఎస్ ఎస్ అమలులో ఉంటుందని, ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటంనిషేధమని అధికారులు స్పష్టం చేశారు.

**మద్యం దుకాణాలు బంద్**

మంగళవారం సాయంత్రం ఐదు గంటల నుంచి పోలింగ్ మరియు ఓట్ల లెక్కింపు ముగిసే వరకు ఈ ప్రాంతాలలో అన్ని మద్యం దుకాణాలను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. పోలింగ్ డిసెంబర్ 11వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించబడుతుంది. పోలింగ్ ముగిసిన అనంతరం, అదే రోజు (డిసెంబర్ 11నాడు) సాయంత్రం ఓట్ల లెక్కింపు మరియు ఫలితాల వెల్లడి చనున్నారు.

**కట్టుదిట్టమైన భద్రత..సిపి గౌస్ ఆలం**

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన ఎన్నికల బందోబస్తు ప్రణాళిక వివరాలను వెల్లడించారు. గత సంఘటనల ఆధారంగా, శాంతి భద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి, వాటిని సున్నితమైన/సమస్యాత్మక కేంద్రాలుగా వర్గీకరించారు. ఈ కేంద్రాలు కమిషనరేట్ పరిధిలోని మొత్తం పోలింగ్ కేంద్రాల్లో 19 శాతం వరకు ఉన్నాయని సీపీ తెలిపారు. ఈ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరిస్తారు. ఈ ప్రాంతాల్లో ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించడానికి ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ లేదా మైక్రో అబ్జర్వర్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఒక స్టాటిక్ పోలీసు పార్టీ,ప్రతి మార్గంలో (రూట్) ఒక రూట్ మొబైల్ పార్టీ ఉండేలా ప్రణాళిక రూపొందించారు. ప్రతి మండలానికి ఒక ఏసీపీ స్థాయి అధికారిని ఇంచార్జిగా నియమించారు.

## కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు

### గ్రామాల్లో సుడా చైర్మన్ సుడిగాలి పర్యటన



ప్రజాపక్షం/కరీంనగర్: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను ప్రజలు ఎన్నుకోవాలని, గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ సర్కారు కట్టుబడి ఉంటుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల్లోని 10 గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేసి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. గత బిఆరెస్ సర్కార్ సర్పంచులను అవమానించిందని, నిధులు ఇవ్వకుండా విధులు నిర్వర్తించకుండా మోసం చేసిందని సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచ్ లకు పెద్దపీట వేస్తుందని, గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉంటుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు సుడా తరపున గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామని తెలిపారు. సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి తో కలిసి మండల కాంగ్రెస్ అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల అవగాహనపై పోలీసుల విస్తృత ప్రచారం



ప్రజాపక్షం/బాల్కొండ :గ్రామపంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా వారిలో చైతన్యం తీసుకరావటానికి బాల్కొండ పోలీసు బృందం మంగళవారం పిఎస్ పరిధిలో పెద్ద ఎత్తున అవగాహన శిబిరాలను ఏర్పాటు చేసింది.ఎన్నికల్లో కొంతమంది నేరాలకు పాల్పడే అవకాశముందని ఇందులో భాగంగా మీ కుటుంబ సభ్యులు డిజిటల్ అరెస్ట్ అయ్యారని, విడిచి పెట్టడానికి బ్యాంకు లావాదేవీలు జరుపుతూ డబ్బులు పంపమని డిమాండ్ చేస్తుంటారని ఈ టైపు మోసాలకు ఎవరు గురి కావద్దని పోలీసులు సూచించారు. అనుమానిత ఫోన్ కాల్స్‌పై, తక్షణమే స్థానిక పిఎస్‌లో గానీ, నేషనల్ సైబర్ సెక్యూరిటీ టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ శిబిరంలో హెడ్‌కానిస్టేబుల్ వాసుదేవ్, భాస్కర్, రమేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

## మొదటి విడత ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు: ఎస్‌పి



ప్రజాపక్షం /ఆసిఫాబాద్ :జిల్లాలో మొదటి విడత స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్‌పినితికా పంత్ తెలిపారు. వాంకిడి, కేరమేరి, జైనూర్, సిర్పూర్ (యు), లింగపూర్ మండలాల్లో ఈ నెల 11న జరగనున్న ఎన్నికలను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. పోలింగ్ కు 44 గంటల ముందు నుంచి అంటే బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి సైలెంట్ పీరియడ్ అమల్లో ఉంటుందని, ఈ సమయంలో ప్రచారం, ర్యాలీలు, సభలు నిషేధమని స్పష్టం చేశారు. ఎన్నికల కోసం 550 మంది పోలీసులు, 200 మంది ఇతర శాఖల సిబ్బందితో కలిపి మొత్తం 750 మందిని నియమించినట్లు వివరించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు జిల్లాలో 163 బిఎన్‌ఎస్‌ఎస్ (144 సెక్షన్) అమల్లో ఉంటుందని, పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల పరిధిలో జనం గుమిగూడరాదని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించి ఎన్నికలను ప్రశాంతంగా జరపాలని కోరారు.

## రెబ్బెనలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



ప్రజాపక్షం /రెబ్బెన:గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో భద్రతా భావం కల్పించేందుకు రెబ్బెన మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. రెబ్బెన మండల సీఐ సంజయ్ ఆధ్వర్యంలో మంగళవారం రెబ్బెన, నంబల, నారాయణపూర్ గ్రామ పంచాయతీల పరిధిలో ఈ కవాతు జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలందరూ గ్రామ పంచాయతీ ఎన్నికలను సజావుగా జరుపుకోవాలని, ఎన్నికల వేళ ఎవరైనా గొడవలకు దిగితే ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులకు శాంతి భద్రతల పరిరక్షణే ముఖ్యమని, ఎల్లప్పుడూ ప్రజలకు తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నిబంధనలకు లోబడి వ్యవహరించాలని, ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన మండల ఎస్సై వెంకట కృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ



ప్రజాపక్షం/సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్ కాంప్లెక్స్ ఆవరనలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని అడిషనల్ కలెక్టర్ మా ధురి( రెవెన్యూ) ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి విగ్రహా ఆవిష్కరణ కా ర్యక్రమంలో జిల్లా అధికారులు డిఆర్ఓ కలెక్టరేట్ లోని అన్ని విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతియుత ఎన్నికల నిర్వహణే లక్ష్యం : డిసిపి



ప్రజాపక్షం /జన్నారం: రాబోయే పంచాయతీరాజ్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా జన్నారం మండలంలోని పో నాకల్ గ్రామంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు మంచిర్యాల డిసిపి ఏ. భాస్కర్ ఆధ్వర్యంలో ఈ కవాతు జరిగింది.ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ ప్రజల్లో నమ్మకం కల్పించడం, శాంతి భద్రతలు కాపాడడం, ఎన్నికల ప్రక్రియలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించడమే తమ ఉద్దేశమని తెలిపారు. గ్రామాల్లో చట్ట వ్యతిరేక, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో గందరగోళం సృష్టించడం, బెదిరింపులకు పాల్పడటం, కోడ్ ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, లక్షెట్టిపేట సీఐ రమణ మూర్తి, జన్నారం ఎస్ఐ అనూష, దండేపల్లి ఎస్ఐ తైసినోద్దీన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను సన్మానించిన విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గం



ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. సోమవారం రాత్రి వరకు జరిగిన ఎన్నికల ప్రక్రియలో 2025–2028 సంవత్సరాలకు ఎన్నికైన ఈ కొత్త కార్యవర్గం కలెక్టర్‌కు పరిచయం చేసుకుంది. అనంతరం సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఉద్యోగుల సమస్యలను, రిటైర్డ్ అయిన వారి పెండింగ్ బిల్లుల చెల్లింపుల విషయాన్ని కలెక్టర్‌కు వివరించారు. అలాగే జిల్లా ట్రెజరీ అధికారి ఎస్ రాజగోపాల్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ యాదయ్యలను కలిసి తమ సమస్యలను దృష్టికి తీసుకెళ్లగా వారు సానుకూలంగా స్పందించారు. జిల్లా నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దూస కృష్ణ, బెజ్జంకి జగన్, కోశాధికారి పి పాపారావు, సహ అధ్యక్షులు ,సంయుక్త కార్యదర్శులు ఎల్ ప్రేమ్ రావు, కె మల్లయ్య, నిర్వాహక కార్యదర్శులు ,నాయకుడు రాష్ట్రపతి అవార్డు గ్రహీత గుండేటి యోగేశ్వర్ పాల్గొన్నారు.

## నస్కల్, రాంపూర్ గ్రామాలలో ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీలు



ప్రజాపక్షం/నిజాంపేట్ :మండల పరిధిలోని నస్కల్ రాంపూర్ గ్రామాలలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రమ్యశ్రీ తనిఖీలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.ఎవరైనా 50 వేల కంటే ఎక్కువ తీసుకు వెళ్లినట్లయితే స్వాధీనం చేసుకోవడం జరుగుతుందన్నారు. మద్యం, డబ్బులు ఓటర్లకు పంచరాదని అలా ఏ అభ్యర్థి అయినా పంచినట్లయితే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# కోతుల నుండి విముక్తి కల్పిస్తేనే ఓటేస్తాం

### కోతుల సమస్యతో అభ్యర్థులకు కొత్త సవాలు..!డ్రైనేజీలు,రోడ్లు కాదు..



ప్రజాపక్షం/నిర్మల్‌రూరల్ :నిర్మల్ జిల్లాలోని గ్రామాల్లో ప్రస్తుతం జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల ప్రచారం ఓ అనూహ్య మలుపు తిరిగింది.సాధారణంగా,ప్రతి ఎన్నికల్లోనూ ఓటర్లు డ్రైనేజీ వ్యవస్థ,రోడ్ల నిర్మాణం,తాగునీటి సరఫరా వంటి మౌలిక వసతుల సమస్యల పరిష్కారాన్ని కోరుకుంటారు.అయితే,ఈసారి నిర్మల్ ఓటర్లు ఆ సాంప్రదాయ సమస్యలన్నింటినీ పక్కనపెట్టి,కోతుల బెడద నుంచి విముక్తి కల్పించడాన్ని తమ ప్రధాన అజెండాగా ముందుంచారు.

**ఓటర్ల నిరసన,కోతుల దాడులు,పంట నష్టంతో విసిగివేసారిన ప్రజలు**

జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో కోతుల సమస్య పతాక స్థాయికి చేరింది.ఇవి ఇళ్లలోకి చొరబడి నిత్యం వస్తువులను ఎత్తుకెళ్లడం,ఆహార పదార్థాలను ధ్వంసం చేయడం పరిపాటిగా మారింది.అంతేకాకుండా, ముఖ్యంగా మహిళలు,పిల్లలపై కోతులు దాడులు చేసి గాయపరచడం వంటి సంఘటనలు తరుచుగా చోటుచేసుకుంటున్నాయి.వ్యవసాయంపై ఆధారపడిన గ్రామస్థులకు పొలాల్లోకి వెళ్లి పంటలను నాశనం చేయడం మరో పెద్ద తలనొప్పిగా మారింది.ఈ తీవ్రమైన ఇబ్బందులతో విసిగిపోయిన ప్రజలు,ఎలాగైనా ఈ సమస్యకు పరిష్కారం లభించాలని బలంగా కోరుకుంటున్నారు.

**అభ్యర్థులకు గట్టి షరతులు..కోతు-లను నియంత్రించే వారికే మా ఓటు..!**

ఈ నేపథ్యంలో,సర్పంచ్ అభ్యర్థులు తమ ఓట్ల వేటలో కొత్త వ్యూహాలను అనుసరించక తప్పడం లేదు. గ్రా మాల్లో ప్రచారానికి వెళ్తున్న అభ్యర్థులను ఓటర్లు నేరుగా నిలదీస్తున్నారు.డ్రైనేజీలు,రోడ్ల గురించి మాట్లాడటం కంటే,కోతులను శాశ్వతంగా నివారించే ప్రణాళిక ఏమి టో చెప్పాలని షరతులు విధిస్తున్నారు.ఎవరు మాకు కో తుల బెడద నుంచి విముక్తి కల్పిస్తారో,వారికే మా ఓటు వేస్తాం,అంటూ ఓటర్లు స్పష్టం చేస్తుండటంతో,పోటీలో ఉన్న అభ్యర్థులు దిక్కు తోచని పరిస్థితిలోకి నెట్టబడ్డారు.

ఎన్నికల హామీ..కోతులను పట్టి అటవీ ప్రాంతంలో వదిలిపెడతాం..

దీంతో,ఓట్ల కోసం అభ్యర్థులు తమ ప్రచారంలో కోతుల సమస్య పరిష్కారానికి హామీలివ్వడం తప్పనిసరిగా మా రింది"ఎన్నికైన వెంటనే అటవీశాఖ అధికారుల సహకారంతో కోతులను సురక్షితంగా వదిలిపెడతాం" అని హా మీలు ఇస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నా రు.మౌలిక వసతుల కన్నా కోతుల సమస్యే ఎన్నికల ఫ లితాలను ప్రభావితం చేయబోతుండటం,నిర్మల్ జిల్లా ఎ న్నికల చరిత్రలో ఒక విభిన్నమైన,ఆసక్తికరమైన అంశం గా నిలుస్తోంది.

## నూతన ఇఎస్ఐ భవన నిర్మాణానికి చర్యలు

### ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు



ప్రజాపక్షం /కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఇఎస్ఐ ఆసుపత్రికి నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు సిర్పూర్ శాసనసభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఆయన ఆసుపత్రిని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత భవనం శిథిలావస్థకు చేరిందని, దాన్ని కూల్చివేసి దాని స్థానంలో నూతన 30 పడకల ఆసుపత్రితో పాటు డయాగ్నొస్టిక్ సెంటర్ నిర్మాణం కోసం గత నెలలో ముఖ్యమంత్రికి ప్రతిపాదన పంపామని వెల్లడించారు. దీనిపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ఇఎస్ఐ కార్పొరేషన్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రాజీవ్‌లాల్‌కు ప్రతిపాదనలు పంపిందన్నారు. కేంద్ర కా ర్మిక శాఖ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, తాత్కాలికంగా ఆసుపత్రిని వేరే చోటకు తరలించే ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్మిక సంక్షేమానికి పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఇఎస్ఐ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జగన్, ఆఫీస్ సూపరింటెండెంట్ త్రిశూల, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి కొండ తిరుపతి, పట్టణ ఎస్‌సిమోర్చా అధ్యక్షుడుచిప్పకుర్తి శ్రీనివాస్, హనుమంత్ రావు, వలుపదాసు రమేష్, శ్రీనివాస్, సదానందం పాల్గొన్నారు.

## ఉత్పత్తి లక్ష్య సాధనలో రక్షణ మరువొద్దు


### జిఎం మునిగంటి శ్రీనివాస్



ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :సంస్థ నిర్దేశించిన లక్ష్య సాధనలో కంపెనీ వ్యాప్తంగా ఉద్యోగులు ఎట్టి పరిస్థితులలో రక్షణ సూత్రాలను మరువకూడదని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ సూచించారు. 56వ వార్షిక రక్షణ పక్షోత్సవాల సందర్భంగా మంగళవార ం శ్రీరాంపూర్ లోని ఆర్కే7 గనిలో ఇన్స్పెక్షన్ కమిటీ కన్వీనర్, కార్పొరేట్ జనరల్ మేనేజర్ ఎన్విరాన్‌మెంట్ బి సైదులుతో కలిసి ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం జిఎం మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా రక్షణలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రక్షణపై అవగాహన కలిగి ఉండాలని, విధులు నిర్వర్తిస్తున్నప్పుడు రక్షణ పరికరాలను తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. సంస్థ 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి దిశగా ముందుకు వెళుతుందని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఇన్స్పెక్షన్ కమిటీ కన్వీనర్ సైదులు మాట్లాడుతూ ఆర్కే7 గని రక్షణ విషయంలోనూ, నూతన యంత్రాల వినియోగంలో సింగరేణి వ్యాప్తంగా మంచి గుర్తింపు తె చ్చుకుందని కొనియాడారు. 55వ రక్షణ పక్షోత్సవాల లో గ్రూప్ వన్ విభాగంలో ప్రథమ బహుమతి, స్టవింగ్ విభాగంలో ద్వితీయ బహుమతి రావడం అభినందించదగిన విషయమని పేర్కొన్నారు. ఉద్యోగుల రక్షణ అ నేది వారి ఇంటి నుండే ప్రారంభం కావాలని గుర్తు చే శారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జి ఎం రఘు కుమార్, ఎస్ఒ టు జిఎం ఎన్ సత్యనారాయ ణ, ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, ఇంజనీ ర్ రమణ రావు, ఏజెంట్ కుర్మా రాజేందర్, రక్షణాధికా రి , మేనేజర్ తిరుపతి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## హామీలు నెరవేర్చకపోతే... పదవికి రాజీనామా చేస్తా

### అంబేద్కర్ విగ్రహానికి రాజీనామా బాండ్‌పేపర్‌ను అందజేసిన పిట్లం సర్పంచ్ అభ్యర్థి సుదర్శన్ గౌడ్




జుక్కల్ : 'నా పదవీకాలం 2.5 ఏళ్లు అని, అది పూర్తయ్యేలోగా ప్రజల కు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైతే, ఎలాంటి పదవీమో హం లేకుండా స్వయంగా సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తా' అని కా మారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం పిట్లం సర్పంచ్ అభ్యర్థి ప్రకటించా రు. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి రాజీనామా బాండ్ పేపర్‌ను అం దజేశారు. తమ మాట, తమ హామీల పరిరక్షణ పట్ల ప్రజల ముందే ప్ర మాణం చేస్తున్నానని స్పష్టం చేశారు. గ్రామ అభివృద్ధి కోసం పారదర్శక పాలన, మౌలిక వసతుల మెరుగుదల, పంచాయతీ పనుల్లో ప్రజా భాగస్వామ్యం పెంపు వంటి అంశాలను ప్రధాన ప్రాధాన్యాలుగా తీసుకొని ముందు కు సాగనున్నట్లు తెలిపారు. గ్రామ సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ప్రజల ఆ శలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తానని నవాబ్ సుదర్శన్ గౌడ్ తె లిపారు. పిట్లం గ్రామాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలపడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

## ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించబోం



ప్రజాపక్షం /సంగారెడ్డి :ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించబోమని నిర్లక్ష్యానికి మూ ల్యం చెల్లించక తప్పదని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. మంగళవారం జోగిపేట ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగ ఆమె హాజరు రిజిస్టర్‌ను పరిశీలించగా పలువురు వైద్యులు విధులకు హాజరు కాకపోవడంపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన వైద్యులు సిబ్బంది వివరాలను డిప్యూటేషన్ ఉన్న సిబ్బంది వివరాలను కలెక్టర్ ఆరా తీసా రు. విధులకు గైర్హాజరైన 11 మంది వైద్యులకు వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డిసిహెచ్‌ఒను ఆదేశించారు. ఒపి డయాలసీస్, ఐసియుతో సహా అన్ని విభాగాలన ఆమె పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలు, పరికరాల వినియోగం శుభ్రత మందుల లభ్యత వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న కొంతమంది రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అత్యంత ప్రా ధాన్యత ఇస్తుందని ప్రభుత్వ ఆసుపత్రిలలో పేద మధ్యతరగతి కుటుంబాలకు ఎలాంటి ఆర్థిక భా రం లేకుండా మెరుగైన వైద్య చికిత్సల అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రోగులకు వైద్య సేవలు అందించడంలో వైద్యులు వైద్య సిబ్బంది ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని చర్యలు తప్పవ ని స్పష్టం చేశారు. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్య సిబ్బంది స్నే హపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. కలెక్టర్ వెంట రెవెన్యూ డివిజనల్‌అధికారిపాండు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ హయాంలోనే పల్లెల్లో అభివృద్ధి



ప్రజాపక్షం/పాపన్నపేట:గ్రామాలను కాంగ్రెస్ సర్కారు పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, రైతులు, మహిళలు, యువతను సీఎం రేవంత్ రెడ్డి మోసం చేశారని, మోసం చేసిన కాంగ్రెస్‌కు పల్లె ఓటర్లు గుణపాఠం చెప్పాలి. మాజీ డిప్యూటీ స్పీకర్ మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు యం . పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు.. మంగళవారం నాడు మండలంలో నీ పలు గ్రామాలలో బీఆరెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్, వార్డు మెంబర్లను పంచాయతీ ఎన్నికల్లో గెలిపించాలని పద్మాదేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, ప్రజలను కోరారు. గాంధారిపల్లి, జయపురం,ఎల్లాపూర్,కొత్తపల్లి,అబ్లాపుర్ ,ఎన్కెపల్లి, సీతానగర్, కుర్తివాడ గ్రామాలలో ఇల్లు ఇల్లు తిరుగుతూ, ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రెండేండ్ల పాలనలో కాంగ్రెస్ పల్లెలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో చేసిన అభివృద్ధి పనులు ఇప్పటికీ జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో కనిపిస్తున్నాయని చెప్పారు. ఆరుగ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్‌కు పంచాయతీ ఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టాలని కోరారు. తెలంగాణలో అధికార పార్టీ నుండి సర్పంచు స్థానాలకు అభ్యర్థులను పెట్టని నియోజకవర్గం ఏదైనా ఉందంటే అది మెదకే అన్నారు. అధికార పార్టీకి సర్పంచ్ స్థానానికి క్యాండెట్లు దొరకక పోవడంతో బిజెపి పార్టీకి సపోర్ట్ చేస్తున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన కార్యకర్తలను గుంజుకొని అనైతికంగా కండువాలు కప్పుతున్నారని పేర్కొన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్ అభ్యర్థులు.నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు, ఏరియర్స్ చెల్లించాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



ప్రజాపక్షం /ఆసిఫాబాద్ : జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) లో పనిచేస్తున్న కాంటీజెంట్, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు మూడు నెలలుగా పెండింగ్ లో ఉన్న వేతనాలు, ఏరియర్స్ వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం కుమురం భీం జిల్లా డిఎంహెచ్ఒ కార్యాలయంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో ఉద్యోగులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలకు సంబంధించిన పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరారు. ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు హెల్త్ కార్డులు, హెల్త్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ. 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 2021లో జారీ చేసిన జిఒ60 ఆధారంగా ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 11 95 ప్రకారం కాంటీజెంట్ వర్కర్లకు రూ. 15,600, డా టా ఎంట్రీ ఆపరేటర్లకు రూ. 19,500 చొప్పున చెల్లించాలని పేర్కొన్నారు. మూడు నెలలుగా జీతాలు అందకపోవడంతో ఇంటి అద్దెలు, పిల్లల ఫీజులు, కుటుంబ పోషణ భారమై ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆ వేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించని యెడల డి సెంబర్ 20 నుంచి ఎఐటియుసి ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ( ఎఐటియుసి) జిల్లా ప్రధాన కార్యదర్శి మధుకర్, ఉపాధ్యక్షులు ముస్తాక్, జిల్లా కోశాధికారి నగేస్, సహాయ కార్యదర్శి సంగీత, సిబ్బంది పాల్గొన్నారు.

## ఐదుగురు సర్పంచ్ అభ్యర్థులు పోటాపోటీ

* ఇద్దరూ ఎంబిఎ చేసిన అభ్యర్థులు
* ఒకరు రెండు సార్లు ఓటమి చెందిన అభ్యర్థి* ఇద్దరూ తొలిసారి పోటీ చేస్తున్న అభ్యర్థులు

ప్రజాపక్షం/దిలావర్‌పూర్:కంజర్ గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికలలో గ్రామం నుండిఐదుగురు అభ్యర్థులు బరిలో ఉండడం విశేషం. నిర్మల్ జిల్లాలోని దిలావర్ పూర్‌మండలంలో చిన్న గ్రామపంచాయతీ అయినప్పటికీ అధిక సంఖ్యలో సర్పంచ్ అభ్యర్థులు బరిలో నిలవడంతో గ్రామంలో పోట పోటీ ప్రచారలతో సందడిగా మారింది.గ్రామంలో అనేక సమస్యలతో గ్రామ అభివృద్ధి కుంటుపడింది.రెండు సంవత్సరాలుగా సర్పంచ్ లేకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలనలో ప్రభుత్వం నుండి నిధులు రాక గ్రామంలో సమస్యలు మరింత పెరిగాయి .డ్రైనేజీ,రోడ్లు,వీధిలైట్లు,పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు ,చెత్త ట్రాక్టర్ మెయింటెనెన్స్‌సరిగా లేక సమస్యలు ఏర్పడుతున్నాయి.సమస్యలు అధిగమించి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని సర్పంచ్ అభ్యర్థులు గ్రామంలో పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

**కండెల వినోద్ కుమార్..**

యం.బి.ఎ చదువు పూర్తి చేసి మొదటిసారిగా ప్రజలకు గ్రామానికి సేవ చేయాలని ఉద్దేశంతో 2013 సంవత్సరంలో సర్పంచ్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించాడు.అలాగే 2019లో జరిగిన సర్పంచ్ ఎలక్షన్ కు వినోద్ కుమార్ యొక్క అమ్మ కండెల గంగవ్వ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు.మూడు సంవత్సరాల తర్వాత అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది.ప్రస్తుతం జరుగుతున్న సర్పంచ్ ఎన్నకలల్లో వినోద్‌కుమార్ బరిలో నిలవడం జరిగింది.గ్రామ ప్రజలు ఓటు వేసి గెలిపించాలని గ్రామని అభివృద్ధి చేస్తానని తెలిపారు.

**నిమ్మ గంగన్న(గణేష్) ..**

యం.బి.ఎ చదువు పూర్తి చేసుకుని రాజకీయాల్లో చేరాలనే ఉద్దేశంతో బిఎస్‌పి పార్టీలో చేరి సామాజిక కార్యక్రమాలు చేయడంతో జాతీయ జ్యోతిబాపూలే అవార్డు అందుకోవడం జరిగింది.గ్రామ ప్రజలకు సేవ చేయాలన్న ఉద్దేశంతో స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడం జరిగింది.గ్రామ ప్రజలు ఓటు వేసి గెలిపించాలని గ్రామాన్ని అభివృద్ధి చేసి ముందుకు తీసుకువెళ్తారని తెలిపారు.

**షేక్ ఆఫీస్..**

మైనార్టీ వర్గానికి చెందడంతో తమ వర్గ ప్రజలు గ్రామంలోని ప్రజలు ఓటు వేసి గెలిపిస్తారని ఉద్దేశంతో 2013 సంవత్సరంలో జరిగినటువంటి సర్పంచ్ ఎన్నికలలో పోటీ చేసి ఓడిపోవడం జరిగింది.2019 సంవత్సరంలో జరిగినటువంటి సర్పంచ్ ఎలక్షన్‌కు ఆఫీస్ యొక్క భార్యను సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిపి ప్రచారం నిర్వహించాడు.ఎలక్షన్ ఫలితాల్లో మూడు ఓట్లతో ఓడిపోవడం జరిగింది.ప్రస్తుతం జరుగుతున్న సర్పంచ్ ఎలక్షన్‌లో సర్పంచ్ అభ్యర్థిగా పోటీపడి చేసి గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్నాడు.ఈసారైనా ప్రజలు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నాడు.

**సేరు చందు..**

గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తారని ప్రచారం నిర్వహిస్తున్నాడు.గతంలో టిఆర్ఎస్ పార్టీలో చేరి కాల్వ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం పాలకమండలి సభ్యుడిగా చేయడం జరిగింది.ప్రస్తుత సర్పంచ్ ఎలక్షన్లు మొదటిసారిగా పోటీ చేస్తున్నారని ప్రజలు ఓటు వేసి సర్పంచ్ గా గెలిపంచాలని కోరుతున్నాడు.

**షేక్ సోయల్ ..**

యువకులు రాజకీయాల్లోకి రావాలని ఉద్దేశంతో తొలిసారిగా సర్పంచ్ ఎలక్షన్లో పోటీ చేస్తున్నానని గ్రామ ప్రజలు ఓటు వేసి సర్పంచ్‌గా గెలిపించాలని గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు.

# క్రీడ



# 2026 ఐపిఎల్ కోసం ఆటగాళ్ల వేలం..

## తుది జాబితాలో 350 మంది క్రికెటర్లు

**2026** ఐపిఎల్ సీజన్‌కు ఈ నెల 16వ తేదీన ఆటగాళ్ల వేలం జరగనున్నది. ఆ వేలంలో సుమారు 350 క్రికెటర్లు పాల్గొననున్నారు. దాంట్లో 240 మంది భారతీయ క్రికెటర్లు ఉన్నారు. టీ20 క్రికెట్ లీగ్ కోసం అబుదాబిలో వేలం జరగనున్నది. సౌతాఫ్రికా బ్యాటర్ క్వింటన్ డీకాక్.. వేలం తుది లిస్టులో చేరాడు. వన్డే రిటైర్మెంట్ నుంచి వెనక్కి వచ్చిన అతను.. తాజా భారత్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో పాల్గొన్న విషయం తెలిసిందే. కోటి బేస్‌ప్రైజ్‌పై అతను అందుబాటులో ఉన్నాడు. ఆసీస్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ కూడా 2 కోట్ల బేస్‌ప్రైజ్‌పై వేలానికి రెఢీ అయ్యాడు. 2021లో చివరి సారి స్టీవ్ స్మిత్ ఐపీఎల్ ఆడాడు. వాస్తవానికి ఐపిఎల్ ప్లేయర్ ఆక్షన్ కోసం 1390 మంది రిజిస్టర్ చేసుకున్నారు. దాంట్లో నుంచి 350 మందిని షార్ట్‌లిస్ట్ చేశారు. తొలి సెట్‌లో భారత బ్యాటర్లు పృథ్వీ షా, సర్ఫరాజ్ ఖాన్.. 75 లక్షల బేస్ ప్రైజ్‌పై వేలంలో నిలిచారు. ఇక ఆసీస్ ప్లేయర్ కెమరూన్ గ్రీన్, జేక్ ఫ్రేజర్ మెక్‌గార్క్, కివీస్ ప్లేయర్ డేవాన్ కాన్వే, సౌతాఫ్రికా బ్యాటర్ డేవిడ్ మిల్లర్ 2 కోట్ల బేస్‌ప్రైజ్‌పై లిస్టులో ఉన్నారు. తాజాగా జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో అత్యధిక రన్స్ చేసిన కునాల్ చండేలా, వికెట్లు తీసిన అశోక్ కుమార్ 2 కోట్ల బేస్‌ప్రైజ్‌లో ఉన్నారు. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు ఈసారి ప్లేయర్ల కోసం 64.3 కోట్లతో వేలంలో పాల్గొననున్నది. అయిదు సార్లు టోర్నీ గెలిచిన చెన్నై జట్టు 43.4 కోట్లతో , సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 25.5 కోట్ల పర్స్‌మనీతో వేలంలో పాల్గొననున్నాయి. ఈసారి వేలం కోసం 21 మంది ఇంగ్లాండ్ క్రికెటర్లు పోటీపడుతున్నారు. వికెట్ కీపర్, బ్యాటర్ జేమీ స్మిత్, గస్ అట్కిన్‌సన్, లివింగ్‌స్టోన్, బెన్ డక్కెట్ రేసులో ఉన్నారు.

ఆస్ట్రేలియాకు చెందిన 19 మంది ఆటగాళ్లకు వేలంలో పాల్గొంటున్నారు. దాంట్లో గ్రీన్ టాప్ లిస్టులో ఉన్నారు. జోష్ ఇంగ్లిష్, షార్ట్, కూపర్ కొన్నలీ, వెబ్‌స్టర్ కూడా ఉన్నారు. 15 మంది దక్షిణాఫ్రికా ఆటగాళ్లలో డీకాక్, మిల్లర్ ఉన్నారు. ఫాస్ట్ బౌలర్లు నోర్జే, లుంగి ఎంగిడి, గెరాల్డ్ కోయిట్జ్, ముల్డర్ ఉన్నారు. వెస్టిండీస్‌కు చెందిన అల్జరీ జోసెఫ్, షామర్ జోసెఫ్, అకీమ్ అగస్టీ, షాయ్ హోప్, రోస్టన్ చేజ్‌తో పాటు 9 మంది ఉన్నారు. శ్రీలంక క్రికెటర్లలో హసరంగ, దునిత్ వెల్లలగే, తీక్షణ, ట్రావీన్ మాథ్యూ, నిషాంక, కుశాల్ మెండిస్, పెరీరా ఉన్నారు.

కాన్వే, రవీంద్రతో పాటు 16 మంది కివీస్ క్రికెటర్లు వేలంలో ఉన్నారు. ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన గుర్బాస్, నవీన్ ఉల్ హక్‌తో పాటు మొత్తం 19మంది ప్లేయర్లు వేలం జాబితాలో ఉన్నారు.

# టీ20ల్లో భారత కుర్రాడి విధ్వంసం

## ఒకే ఓవర్లో 4, 4, 6, 6, 4..



**టీ**20 ఫార్మాట్ అంటే చాలు కుర్రాళ్లు రెచ్చిపోతున్నారు. నువ్వానేనా అంటూ పోటీపడి మరీ బౌలర్లను ఊచకోత కోస్తున్నారు. దేశవాళీ టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అమిత్ పస్సీ రికార్డు సెంచరీని మరువక ముందే.. తమిళనాడు బ్యాటర్ సన్నీ సంధు బౌండరీల మోతతో చెలరేగాడు. ఛేదనలో ప్రత్యర్థి బౌలర్‌కు చుక్కలు చూపిస్తూ ఒకే ఓవర్లో 26 పరుగులు పిండుకొని జట్టును ఒంటిచేత్తో గెలిపించాడు. సౌరాష్ట్రతో జరిగిన మ్యాచ్‌లో విధ్వంసక ఆటతో చెలరేగిన సన్నీ వరుసగా.. 4, 4, 6, 6, 4 తో తమిళనాడుకు విజయాన్ని కట్టబెట్టాడు. కుర్రాళ్ల విధ్వసంక ఆటతో రంజుగా సాగుతున్న సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో మరో క్రికెటర్ దంచేశాడు. తమిళనాడు బ్యాటర్ సన్నీ సంధు ఆకాశమే హద్దుగా విరుచుకుపడి సౌరాష్ట్ర నుంచి విజయాన్ని లాగేసుకున్నాడు. మొదట బ్యాటింగ్ చేసిన సౌరాష్ట్ర నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి183 పరుగులు చేసింది. ఛేదనలో ఓపెనర్ సాయి సుదర్శన్(101 నాటౌట్) అజేయ శతకంతో తమిళనాడును గెలుపు దిశగా నడిపాడు.

అయితే.. మిడిలార్డర్ తడబాటుతో సౌరాష్ట్ర పైచేయి సాధించింది. 139కే ఆరు వికెట్లు పడిన వేళ.. క్రీజులోకి వచ్చిన సన్నీ సంధు (30 : 9 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లు) ధనాధన్ ఆటతో ప్రత్యర్థి బౌలర్లను బెంబేలెత్తించాడు. చేతన్ సకారియా వేసిన 17వ ఓవర్లో వరుసగా.. 4, 4, 6, 6, 4 బాది 26 పరుగులు రాబట్టాడీ చిచ్చరపిడుగు. సన్నీ మెరుపులతో 18.4 ఓవర్లలోనే తమిళనాడు లక్ష్యాన్ని అందుకుంది.

# ఇంగ్లాండ్ ప్రధాన పేసర్ ఔట్..

## అడిలైట్ టెస్టుకు సిద్ధమైన కమిన్స్!



**యా**షెస్ సిరీస్‌లో ఇంగ్లాండ్‌కు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. రెండు మ్యాచుల్లో చిత్తుగా ఓడిన బెన్ స్టోక్స్ సేన సిరీస్‌లో బోణీ కొట్టాలనుకున్న వేళ మరో షాక్ తగిలింది. ఆ జట్టు ప్రధాన పేసర్ మార్క్ వుడ్ అనూహ్యంగా సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. మోకాలి గాయం కారణంగా గబ్బా టెస్టులో ఆడని వుడ్. మిగతా మూడు టెస్టులకూ అందుబాటులో ఉండడం లేదు. సిరీస్‌లో 2–0తో ఆధిక్యంలో ఉన్న ఆస్ట్రేలియా సైతం పేసర్ జోష్ హేజిల్‌వుడ్ సేవల్ని కోల్పోనుంది. స్వదేశంలో భారత్‌తో సిరీస్ పంచుకున్న ఇంగ్లాండ్ యాషెస్‌లో చెలరేగానులకుంది. బ్యాటర్లు, బౌలర్ల వైఫల్యంతో తొలి రెండు మ్యాచుల్లో ఘోర పరాజయాలు చవిచూసింది. అడిలైడ్‌లోనైనా విజయంతో సిరీస్‌లో నిలవాలనుకున్న ఇంగ్లాండ్ పేసర్ మార్క్ వుడ్ సేవల్ని కోల్పోనుంది. ఏడాది కాలంగా గాయాలతో సతమతమవుతున్న వుడ్ మోకాలి గాయం తిరగబెట్టడంతో యాషెస్ సిరీస్ నుంచి నిష్క్రమించాడు. త్వరలోనే ఈ స్పీడ్‌స్టర్ స్వదేశంలో రిహాబిలిటేషన్ సెంటర్‌లో చేరనున్నాడు. అక్కడ.. ఇంగ్లాండ్ వేల్స్ క్రికెట్ బోర్డు వైద్యులు అతడి ఆరోగ్యాన్ని పర్యవేక్షించనున్నారు. పెర్త్ టెస్టులో 11 ఓవర్లు వేసి ఒక్క వికెట్ తీయలేకపోయాడు వుడ్ గుడ్‌న్యూస్ ఏంటంటే.. ఫిట్‌నెస్ సాధించిన ప్యాట్ కమిన్స్ అడిలైడ్ టెస్టులో ఆడనున్నాడు. ఇంగ్లాండ్ ఆసీస్ మధ్య డిసెంబర్ 17న మూడో టెస్టు జరుగనుంది. రెగ్యులర్ కెప్టెన్ కమిన్స్ రాకతో రెండు టెస్టుల్లో జట్టును నడిపించిన స్టీవ్ స్మిత్ అతడికి డిప్యూటీగా వ్యవహరించనున్నాడు.

# ఫోకస్ మహిళ



# పెరుగుతున్న ట్రామా సమస్య!

**తీ**వ్రమైన మానసిక వ్యధ 'ట్రామా' కేసులు ఇటీవల కాలంలో పెరుగుతున్నాయని, ముఖ్యంగా మహిళల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని వివిధ నివేదికలు, గణాంకాలు పేర్కొంటున్నాయి. వెలుగులోకి వస్తున్న కేసుల కంటే, తాము ట్రామాతో బాధపడుతున్నామని తెలియకుండానే కుంగిపోతున్న మహిళలు ఎక్కువగా ఉన్నారన్న అభిప్రాయం కూడా ప్రచారంలో ఉంది. మానసిక ఆందోళన, భావోద్వేగాలతో కూడుకున్న ట్రామా గురించిన అవగాహన ఉంటే, దాని పరిష్కారం సాధ్యమవుతుంది. జీవితం మెరుగుపడుతుంది. వైద్య శాస్త్ర నిపుణులను అనుసరించి, చాలా మంది మహిళలు చిన్ననాటి లోతైన భావోద్వేగ గాయాలు గుర్తించరు. మరో రకంగా చెప్పాలంటే, నిర్లక్ష్యం చేస్తారు. అయితే, అవి దశాబ్దాల పాటు వారి జీవితాలను ప్రభావితం చేస్తూనే ఉంటాయి. ఎక్కువ కాలం చికిత్స చేయించుకోకుండానే, జీవితాలు గడిచిపోతుంటాయి. ఏదైనా ఒక సంఘట లేదా బలమైన ఒత్తిడే 'ట్రామా'కు కారణమవుతుందనే అభిప్రాయం చాలా మందిలో ఉంది.

కానీ, అన్ని సందర్భాల్లోనూ ఈ సూత్రం వర్తించదు. ఆదరణ లభించకపోవడం, తాను ఉంటున్న ప్రాంతం సురక్షితమైనది కాదనే అభిప్రాయం, ప్రేమను పొందలేకపోవడం వంటి అనేకానేక అంశాలు ట్రామాను ప్రేరేపించే అవకాశం ఉంది. అందుకే చాలామంది మహిళలు బయట ప్రపంచంలో సమర్థులుగా కనిపిస్తున్నా, తమతమ రంగాల్లో రాణిస్తున్నా, అంతర్గతంగా ఆందోళనలు, ఒంటరితనం, అభద్రతా భావం వంటి సమస్యలతో సతమతమవుతుంటారు. ఈ విధంగా బయటపడని ఐదు రకాల రహస్య ట్రామా నమూనాలు ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.

### 1. భావోద్వేగ మూర్ఛ

భావోద్వేగ మూర్ఛలో ఉన్న వ్యక్తులు బయటికి ఎలాంటి సమస్యలు లేనివారిగా కనిపించినా, లోపల ఒక ఖాళీ గోడలా అనుభూతి చెందుతారు. ఇది చిన్ననాట భావాలను వ్యక్తం చేయడం సురక్షితం కాకపోవడం వల్ల ఏర్పడుతుంది. బాధను వ్యక్తం చేయకపోవడం వల్ల అది మాత్రమే కాదు, ఆనందం, ప్రేమ, తృప్తి కూడా కోల్పోతారు.

### 2. బలహీనత భయం

చిన్నతనంలో అకారణంగా నిందలకు, శిక్షలకు లేదా నిర్లక్ష్యానికి గురైన వారు పెద్దయ్యాక కూడా అవే భావాలను దాచుకుంటారు. దీని వల్ల ఇతరులతో వారి సంబంధాలు లోతైనవిగా కాకుండా, నామమాత్రంగా మాత్రమే ఉంటాయి. చాలా మంది ఈ స్వభావాన్ని సిగ్గుగా భ్రమపడుతుంటారు. కానీ, ఇది అంతర్గతంగా అత్యంత తీవ్రమైన అభద్రతా భావానికి, చిన్నతనంలో ఎదురైన అనుభవాలకు దర్పణం.

### 3. బరువు–బాధ్యతలు

చాలా మంది మహిళలు చిన్నతనం నుంచే ఏదో ఒక విధానంలో బరువుబాధ్యతలు మోస్తూ ఉంటారు. తల్లికి ఇంటి పనిలో సాయం చేయడం నుంచి కుటుంబాన్ని పోషించడానికి ఏదో ఒక ఆదాయ మార్గాన్ని ఎంచుకోవడం వరకూ ఎన్నో రకాలుగా శ్రమిస్తుంటారు. ఒక రకంగా చెప్పాలంటే, వీరే తల్లిదండ్రులు నిర్వర్తించాల్సిన బాధ్యతలను తన భుజాలపై వేసుకుంటారు. అందరికీ సాయం చేస్తారు. కానీ, తమకు ఎవరైనా సాయం చేయడానికి ముందుకొస్తే ఒప్పుకోరు. దీనిని కారుణ్యం.. ఆత్మాభిమానం కలగలసిన గుణంగా భావించడం సహజం. కానీ, ఈ రకంగా వ్యవహరిస్తున్న వారు చిన్నతనం నుంచి అలాంటి పరిస్థితులను ఎదుర్కొన్న వారే. ఆలోచనలను మార్చుకోకపోతే, జీవితమంతా బాధ్యతలతోనే గడుస్తుంది.. బాధ్యలతోనే ముగుస్తుంది.

### 4. పరిపూర్ణతావాదం

కొంతమంది మహిళలు 'పర్‌ఫెక్షనిస్ట్' అనిపించుకునే ప్రయత్నంలో మునిగిపోతారు. ప్రతి పనీ పరిపూర్ణంగా ఉండాలన్నది వారి అభిప్రాయంగా అంతా భావిస్తారు. కానీ, నిజానికి వారు ఎక్కువగా అభద్రతాభావానికి గురవుతూ ఉంటారు. రక్షణ యంత్రాంగాన్ని సిద్ధం చేసుకునే ప్రయత్నంలో, పనులను అత్యంత జాగ్రత్తగా చేయాలనే తపన మొదలవుతుంది. తప్పులు అంగీకరించని లేదా షరతులు నచ్చని గుణం ఇలాంటి వారిలో ఎక్కువ. తీవ్రమైన కట్టుబాట్ల మధ్య పెరిగిన వారికి ఈ గుణం ఉంటుంది. ఫలితంగా వీరిలో విమర్శనాత్మక స్వభావం, విపరీతమైన జాప్యం, మానసిక అలసట వంటి లక్షణాలు పెరుగుతాయి.

### 5.భయం.. ఆందోళన

ప్రతి విషయానికీ భయపడడం, ఆందోళన చెందడం వంటి లక్షణాలు కూడా చిన్ననాటి నుంచి అంతర్గతంలో గూడుకట్టుకున్న ఫోబియాల కారణంగా ఉత్పన్నమైనవే. అప్పట్లో ఎదురైన అనుభవాలు వారి మస్తిష్కంలో నిక్షిప్తమై ఉంటాయి. వాటి ప్రభావం వారి ఆలోచనలపై ఉంటుంది. వారి ప్రవర్తనను నియంత్రిస్తుంది. అభద్రతాభావమే ఆందోళనకు మూలం. ట్రామా ఎలాంటిదైనా, నిపుణుల పర్యవేక్షణలో, సరైన వైద్య విధానం ద్వారా నయం చేసుకోవచ్చని వివిధ అధ్యయనాలు చెప్తున్నాయి. వ్యక్తిగతంగా ఉన్న దాచుకున్న ట్రామా నమూనాను గుర్తించడం ద్వారా చికిత్స ప్రారంభం అవుతుంది. చాలా మంది మహిళలు నిక్షిప్తమై ఉన్న ఐదు లక్షణాల్లో ఒకటి కంటే ఎక్కువ లక్షణాలను కలిగి ఉంటారు. ఒకసారి తమ సమస్యను అర్థం చేసుకోగలిగితే, ఎన్నో ఏళ్లుగా కూడిన భారాలు తగ్గిపోతాయి, భద్రత, అనుబంధం, స్వీయ అంగీకారం తిరిగి లభిస్తాయి. సోమాటిక్ థెరపిస్ట్ లేదా ట్రామాఇన్ఫార్మ్‌డ్ కోచ్‌ని సంప్రదించి, వారు సూచించే పద్ధతులను అవలంభించి చాలా వరకు సమస్యల నుంచి బయటపడవచ్చు. వ్యక్తిగత ట్రామా ప్యాటర్న్‌ను గుర్తించి, గతాన్ని తిరిగి అనుభవించకుండానే, చికిత్సకు ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సూచించే నిపుణులు కూడా అందుబాటులో ఉంటారు. వారిని సంప్రదించడం అవసరం.

# 23 నుంచి ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా 4వ మహాసభలు

## కరపత్రాన్ని ఆవిష్కరించిన సదానందం, ప్రీతం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈనెల 23,24,25 తేదీలలో జరగబోయే ఎఐఎస్ఎఫ్ పెద్దపెల్లి జిల్లా నాలుగోవ మహాసభలను విజయవంతం చేయాలని మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు తాండ్ర సదానందం, ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం హాజరై మాట్లాడారు. ఉద్యమాలే ఊపిరిగా పోరాటాలే ప్రాణంగా విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా చదువుతూ పోరాడుతాం చదువుకై పోరాడుతాం అంటూ అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తూ దేశంలోనే అతిపెద్ద విద్యార్థి నిర్మాణాత్మక సంఘంగా ఎఐఎస్ఎఫ్ ఉన్నదన్నారు. విద్యారంగాన్ని విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విద్యార్థి లోకం సరైన బుద్ధి చెప్పాలని, రానున్న రోజుల్లో ఎఐఎస్ఎఫ్ ఇచ్చే పిలుపులకు విద్యార్థి లోకం తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాయి ఆజాద్, నాయకులు మాతంగి సాగర్, పల్లె హర్ష, అనిల్, శివ ,శ్రీరామ్, రాజు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణలో రైతులను నిలువు దోపిడీ చేస్తున్న మిల్లు వ్యాపారులు

## సప్తగిరి ఇండస్ట్రీస్ మిల్లు అవకతవకలపై విచారణ

## సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్



**ప్రజాపక్షం/జమ్మికుంట :** రైతుల నుంచి ధాన్యం సేకరణలో జమ్మికుంట సప్తగిరి మిల్లులో చేస్తున్న నిలువు దోపిడీ, అవకతవకలపై ఉన్నతస్థాయిలో విచారణ జరపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం జమ్మికుంట పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పంజాల శ్రీనివాస్ మాట్లాడారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోళ్లలో భాగంగా రైతుల ద్వారా ఐకెపి కేంద్రాల నుంచి సేకరించిన వడ్లను అలాట్ మెంట్ చేసిన జమ్మికుంట సప్తగిరి ఇండస్ట్రీస్ మిల్లులో దోపిడీకి పాల్పడుతూ, సదరు మిల్లు వ్యాపారి లబ్దిపొందుతున్నాడని ఆరోపించారు. ఒక్కో రైతుల నుంచి 10, 20, 30 ఇలా క్వింటాళ్ల వ్యత్యాసం చూపించి సదరు మిల్లు వ్యాపారి దోపిడీకి పాల్పడ్డారన్నారు. రైస్ మిల్లుల వ్యాపారులు ప్రభుత్వాన్ని, అధికారులను శాసించే విధంగా వ్యవహరించినా చర్యలు లేకపోవడం దురదృష్టకరమన్నారు. సప్తగిరి ఇండస్ట్రీస్ రైస్‌మిల్లు వ్యాపారి ధాన్యం కేటాయింపుల విషయంలో అధికారులకు సరైన పూచీకత్తులు ఇవ్వకున్నా దందా యధేచ్ఛగా సాగించాడని, వందలాది మంది రైతుల వద్ద నుంచి పెద్దమొత్తంలో జరిగిన ఈదోపిడీని రికవరీ చేయాలని, ఈ విషయమై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జమ్మికుంట మండల కార్యదర్శి గజ్జి ఐలయ్య, వీణవంక మండల కార్యదర్శి రాంగోపాల్, సమ్మయ్య పాల్గొన్నారు.

# శాసనసభ ఫలితాలు పునరావృతం కావాలి

## ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

**ప్రజాపక్షం/పాల్వంచ :** గ్రామ పంచాయితీ ఎన్నికలలో శాసన ఎన్నికల ఫలితాలు పునరావృతమయ్యే విధంగా ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. భద్రాద్రి జిల్లా పాల్వంచ మండల పరిధి నాగారం, రంగాపురం, నాగారం కాలనీ, తోగ్గూడెం, జగన్నాధపురం, బసవతారక కాలని, లక్ష్మీదేవిపల్లి, కొత్త సూరారం, పాత సూరారం, పాండురంగాపురం తండా, ప్రభాత్‌నగర్ తదితర పంచాయతీలలో మంగళవారం కూనంనేని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచ్, వార్డు సభ్యులు , సిపిఐ నాయకుల సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్, వార్డు సభ్యులకు మద్దతుగా జరిగిన సభల్లో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి జరగాలంటే సిపిఐ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభులను గెలిపించాలని కోరారు. ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా, నిత్యం ప్రజాక్షేత్రంలో ఉండి ప్రజా సమస్యల పట్ల పోరాటం చేస్తున్న సిపిఐ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి మరింత అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. ప్రచార కార్యక్రమాల్లో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సబ్యులు, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, సర్పంచ్ అభ్యర్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## నిజాయితీపరులను ఎన్నుకుంటే గ్రామం అభివృద్ధి : ఎమ్మెల్సీ సత్యం

**మర్రిగూడ:** నిజాయితీపరులను ఎన్నుకుంటే గ్రామం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కుదాబక్షిపల్లి తమ్మడపల్లి గ్రామాల్లో సిపిఐ అభ్యర్థులు చెల్లం పాండురంగారావు, ఎలగలగూడెం గ్రామ పంచాయతీ సిపిఐ అభ్యర్థి సూరిగి యల్లమ్మ, కొరటికల్ గ్రామ సిపిఐ సర్పంచ్ అభ్యర్థి దందు వెంకటరమణ గెలుపు కోసం ప్రచారం నిర్వహించి మాట్లాడుతూ నిత్యం గ్రామంలో ఉంటూ ప్రజలతో మమేకమై ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ప్రజల మధ్య ఉంటున్న వారిని ఎన్నుకుంటే గ్రామం అభివృద్ధితో పాటు సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ప్రచార కార్యక్ర మాల్లో మాజీఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, నాయకులు బూడిద సురేష్, కొట్టం యాదయ్య, బుర్ర శేఖర్, ఈదుల బిక్షంరెడ్డి. ఆకుల రఘుమయ్య, రమేష్, కళ్లెం యాది రెడ్డి, కొట్టం రాజయ్య, నారాయణ, నరసింహ, ఎల్లయ్య, యాదయ్య, రాములు, వెంకటేష్, వెంకన్న, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తీర్పురి వెంకటేశ్వర్లు, మందుల పాండు, ఈదులకంటి కైలాస్, తీర్పారి కృష్ణయ్య, మునుగోటి దయాకర్, కట్కూరి మల్లయ్య, గజ్జల కిషన్, కట్కూరి వెంకన్న, తీర్పారి రామచంద్రం, గోపగొని సైదులు, కట్కూరి లింగస్వామి, మాధగోని విజయ్, ఈదుల కంటి నాగరాజు, శేఖర్, సురిగి పరమేశం, తీర్పారి నరసింహ తదితరులు పాల్గొన్నారు

## సిపిఐతోనే సమస్యలు పరిష్కారం


**మహబూబాబాద్ :** సిపిఐ బలపరిచిన ముడుపుగల్ గ్రామపంచాయతీ అభ్యర్థి తండా సందీప్ గెలుపు కోరుతూ మంగళవారం గ్రామంలో భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్నికల ప్రచారం ముగింపు సభకు సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి హాజరై మాట్లాడుతూ సిపిఐ అభ్యర్థులతోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. యువకుడైన తండా సందీప్‌ను సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామం అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రచారం కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి , వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, మేక వీరన్న, ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి, కేదాసు రమేష్, వార్డు అభ్యర్థులు అరుణ్ కుమార్, తండా శ్రీనాథ్, తేజావత్ వినయ్, నేతలు పోలగాని శ్రీను, తండ సతీష్, గుణగంటి శేఖర్, విజయ్ సాయి, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధి ధ్యేయం

**ఎల్కతుర్తి:** గ్రామ అభివృద్ధి ధ్యేయంగా, నిజాయితీ లక్ష్యంగా సేవచేయడానికి గోపాల్‌పూర్ ఓటర్లు కర్రె లక్ష్మి బిక్షపతి కత్తెర గుర్తుపై అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి పిలుపునిచ్చారు. మంగళవారం ఎల్కతుర్తి మండలం గోపాలపురం గ్రామంలో కర్రె లక్ష్మి బిక్షపతి విజయం కోసం ప్రచారం చేశారు. మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కర్రె లక్ష్మి , కర్రె బిక్షపతి, నేదునూరి రాజమౌళి, మెట్టు శ్యాంసుందర్‌రెడ్డి, కర్రె లక్ష్మణ్, ఊట్కూరి రాములు, ఊట్కూరి ప్రణీత్, కొట్టెపాక రవి, మనోహర్, అల్వాల రాజు, సొం దర్య, ఈశ్వరమ్మ, సంధ్య, బుచ్చమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.







# సర్పంచ్‌లుగా ఏడుగురు సిపిఐ అభ్యర్థులు ఏకగ్రీవం













**ప్రజాప్రక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో మొత్తం ఏడు సర్పంచ్ స్థానాలతో పాటు 2–ఇంక్లైన్‌కు చెందిన 8 వార్డుల్లో సిపిఐ అభ్యర్థులు ఏకగ్రీవం అయ్యారు. ఈ ఏడు పంచాయితీల్లో సర్పంచ్‌లు, 2–ఇంక్లైన్ 8 వార్డుల్లో పోటీలో ఉన్న వారు ఉపసంహరించుకోవడంతో ఈ స్థానాలను సిపిఐ దక్కించుకుంది. సుజాతనగర్ మండలం 2–ఇంక్లైన్ గ్రామపంచాయతీ నుండి గుగులోత్ అరుణ, లక్ష్మీ దేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి గ్రామ పంచాయతీ నుండి కొర్సా వీరబాబు, చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామ పంచాయతీ నుండి భూక్యా శాంతిశ్రీ, పాల్వంచ మండలం బిక్కు తండా గ్రామపంచాయతీ నుండి భూక్యా ఝాన్సీ, తవిశెలగూడెం గ్రామ పంచాయతీ నుండి జి రమేష్, సంగెం గ్రామ పంచాయతీ నుండి బానోత్ రవి, ఇల్లందుపాటు గ్రామపంచాయతీ నుండి తేజావత్ లక్ష్మి లు సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు.

**2–ఇంక్లై జిపి, వార్డులు క్లీన్ స్వీప్ :** సుజాతనగర్ మండలం పరిధిలోని 2–ఇంక్లైన్ గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానంతో పాటు 8 వార్డుల్లో సిపిఐ అభ్యర్థులు ఏకగ్రీవం అయ్యారు. పోటీదారులు తప్పుకోవడంతో సిపిఐ 2–ఇంక్లైన్ గ్రామపంచాయతీలో విజయకేతనం ఎగురవేసింది. ఏకగ్రీవ సర్పంచ్‌లు, వార్డుసభ్యులకు సిపిఐ రాష్ట్రకార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా శుభాకాంక్షలు తెలిపారు.



# స్థానికం

REGIONAL NEWS


వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## బండారి రాజ్ కుమార్ గ్రంథానికి వాసిరెడ్డి పురస్కారం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఆచార్య వాసిరెడ్డి భాస్కర్ రావు పురస్కారాన్ని ఈ ఏడాది బండారి రాజ్ కుమార్ రచించిన తెలంగాణ కవి ముద్ర గ్రంథానికి అందిస్తున్నట్లు అభ్యుదయ రచయితల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్ నారాయణ తెలిపారు. అరసం ఆధ్వర్యంలో ఈ నెల 14న హనుమకొండ లష్కర్ బజార్ లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ప్రముఖ నవలా రచయిత డాక్టర్ కాలువ మల్లయ్య, గౌరవ అతిథిగా తెలంగాణ అరసం అధ్యక్షులు డాక్టర్ పల్లేరు వీరాస్వామి, వక్త లుగా వాసిరెడ్డి క్రిష్ణారావు, నిధి (బ్రహ్మ చారి) హాజరు కానున్నట్లు డాక్టర్ శంకర్ నారాయణ తెలిపారు.

## మహబూబాబాద్ కలెక్టరేట్‌లో 10 అడుగుల తెలంగాణ తల్లి విగ్రహం

కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ చేతుల మీదుగా ఆవిష్కరణ



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ 10అడుగుల తెలంగాణ తల్లి విగ్రహాన్ని అట్టహాసంగా ఆవిష్కరించారు. 10 అడుగుల ఎత్తులో విగ్రహం, బేస్ 4 అడుగులు, విగ్రహం కింద ఉండే 2 అడుగుల పీఠంతో కలిపి మొత్తం 16 అడుగుల ఎత్తు కలిగిన తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరించారు. పాల్గొన్న అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, ఆర్ అండ్ బి ఇఇ భీమ్లా నాయక్, జిల్లా అధికారులు, పరిపాలన అధికారి పవన్ కుమార్, కలెక్టరేట్ అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది.

## హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో..




**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ వై. వి. గణేష్, డిఆర్డిఒ మేన శ్రీను, ఆర్‌అండ్‌బి ఇఇ సురేష్ బాబు, హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, డిటిఓ శ్రీనివాస్ కుమార్, జిల్లా అధికారులపాల్గొన్నారు.

## జనగామ జిల్లా కలెక్టరేట్‌లో..





**ప్రజాపక్షం / జనగామ :** జనగామ జిల్లా సమీకృత కార్యాలయ సముదాయం ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ ఆవిష్కరించారు. ఆవిష్కరించి తెలంగాణ తల్లి విగ్రహ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, బెన్‌షాలోమ్, డిసిపి రాజమహేంద్రనాయక్, జిల్లా పరిషత్ సిఇఒ మాధురిషాతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ స్ఫూర్తి భవిష్యత్ తరాలకు తెలియాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**తెలంగాణ స్ఫూర్తి తరతరాల పాటు వికసించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డిఓ రవి, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ అభ్యర్థిని గెలిపించే బాధ్యత మీది.. అభివృద్ధి బాధ్యత నాది :యశస్విని



**ప్రజాపక్షం/రాయపర్తి:**రాయపర్తి కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి గెలిపించే బాధ్యత మీద గ్రామాభివృద్ధి బాధ్యత నాది అని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝూన్సీరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ నాయకులు డిజే పాటలతో డప్పుచప్పుల్లతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించి రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కుంట వినోదను గెలిపించాలని కోరారు. ప్రజలు అధికారంలో ఉన్న పార్టీకి ఓటేస్తే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెంటనే అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. కాంగ్రెస్ పార్టీ సర్పంచ్, వార్డు సభ్యులను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యానాయక్, టిపిసిసి మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి, మండల నాయకులు మాచర్ల ప్రభాకర్, ఆకుల సురేందర్‌రావు, మచ్చ లక్ష్మి నారాయణ, బిల్లా సుభాష్ రెడ్డి, రెంటాల గోవర్ధన్ రెడ్డి, మచ్చ రమేష్, అయిత అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎన్నికల పరిశీలకులు నాయుడు, కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/హనుమకొండ:** గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని గ్రామపంచాయతీ ఎన్నికల హనుమకొండ జిల్లా సాధారణ పరిశీలకులు శివకుమార్ నాయుడు అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మొదటి విడత మండలాల్లో మూడో ర్యాండమైజేషన్ పూర్తి చేసిన అనంతరం కలెక్టర్ స్నేహ శబరీష్, అధికారులతో కలసి ఎన్నికల పరిశీలకులు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ ఈనెల 11న మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహించే భీమదేవరపల్లి ఎల్కతుర్తి కమలాపూర్ మండలాల్లో పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను పూర్తి చేసామని తెలిపారు. ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను ఆర్వోలు వెళ్లి పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇతర పోలింగ్ సామగ్రిని ఇప్పటికే ఆయా మండల కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. పోలింగ్ రోజున ఈ మూడు మండలాలకు సెలవు దినంగా ప్రకటించినట్లు పేర్కొన్నారు. బ్యాలెట్ పేపర్ తనిఖీ చేయాలని ఎంపిడిఓలు, స్పెషల్ ఆఫీసర్లకు ఆదేశించినట్లు తెలిపారు. ఎన్నికల సామగ్రి, ఏర్పాట్లును పరిశీలించి వాటి నివేదికను అందజేయాలని అధికారులకు తెలియజేశామని సమావేశంలో జిల్లా ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడుకు వివరించారు. అనంతరం జిల్లా ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడు మాట్లాడుతూ సర్పంచ్, వార్డు స్థానాలకు సంబంధించి ప్రతి వార్డు బ్యాలెట్ పేపర్ ను తనిఖీ చేయాలని సూచించారు. బ్యాలెట్ పేపర్లు సరిగా ఉన్నాయా లేదా అని చెక్ చేసుకోవాలని అన్నారు. ఎన్నికల సామగ్రి, సిబ్బంది తరలింపునకు సరిపోను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పటిష్ట ఏర్పాట్లను చేయాలన్నారు. పోలింగ్ రోజున పోలింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండ చర్యలు చేపట్టాలని, పోలింగ్ అనంతరం కౌంటింగ్ జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి రమాకాంత్, డిఆర్‌డిఒ మేన శ్రీను, జెడ్‌పిసిఇఒ రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బాలుడి అదృశ్యం విషాదం

ట్రాక్టర్ కిందపడి మృతి

భయంతో మృతదేహాన్ని ఒసి త్రీ మట్టిలో దాచిన డ్రైవర్ అరెస్ట్





**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండలం ధర్మారావుపేటలో అదృశ్యమైన ఐదేళ్ల బాలుడి ఘటన విషాదాంతమైంది. ఆదివారం సాయంత్రం అదృశ్యమైన బందెల రాకేశ్ (5) ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందాడని పోలీసులు మంగళవారం వెల్లడించారు. భయంతో మృతదేహాన్ని మట్టి డంపింగ్ ప్రదేశంలో దాచిన ట్రాక్టర్ డ్రైవర్ గంపల శంకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. ఎస్ఐ అశోక్ కథనం ప్రకారం.. ధర్మారావుపేటకు చెం దిన బందెల రాజుక, రజిత చిన్న కుమారుడు రాకేశ్ ఇంటి వద్ద ఆడుకుంటుండగా, కోత పనులకు బయలుదేరిన గంపల శంకర్ అతన్ని మరో బాలుడితో పాటు ట్రాక్టర్‌పై ఎక్కించుకున్నాడు. ట్రాక్టర్ కదులుతుండగా రాకేశ్ ప్రమాదవశాత్తు చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిందన్న భయంతో శంకర్, బాలుడి మృతదేహాన్ని గన్నీ సంచీలో చుట్టి సమీపంలోని ఓసీ 3 గని మట్టి డంపింగ్ యార్డ్‌లో పడేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కాగా, రాకేశ్ ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు, గ్రా మస్తులు శంకర్‌ను ప్రశ్నించగా అతని మాటల్లో పొంతనలేని సమాధానం రా వడంతో వెంటనే రాకేశ్ తల్లిదండ్రులు గణపురం పోలీసులకు ఫిర్యాదు చేశా రు. కేసు నమోదు చేసిన ఎస్ఐ అశోక్, డ్రైవర్ శంకర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అతడు జరిగిన ప్రమాదాన్ని ఒప్పుకున్నాడు. శంకర్ చూపించిన ప్రదేశానికి సిఐ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు, జేసీబీలతో మట్టిని త వ్వించి బాలుడి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పంచనామా చేసి పోస్టుమార్టం కోసంజిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులుకేసుదర్యాప్తు చేస్తున్నారు.

## రైతుల కోసమే పోరాటాలు

ఎన్నికల ముగింపు ప్రచారంలో సిపిఐ నేత అజయ్ సారథి రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:**సిపిఐ బలపరిచిన దామ్య తండా అభ్యర్థి బానోత్ లింగ్య నాయక్‌ను గెలిపించాలని కోరుతూ మంగళవారం చివరి రోజు సిపిఐ ఆధ్వర్యంలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి అజయ్ సారథి రెడ్డి మాట్లాడుతూ దామ్య తండా గిరిజనుల కోసం ఎన్నో ఆందోళనలు నిర్వహించామని, ఈ ప్రాంతంలో ఎరువులు, నీటి సమస్య, అనేక సమస్యలపై పోరాటం చేశామని ఆయన తెలిపారు. ఈ ప్రాంతంలో ఉమ్మడి మల్యాల గ్రామపంచాయతీలో సిపిఐ అనేక పోరాటాలు చేసిందని, ఈ ప్రాంతంలో గిరిజనులకు తునికి ఆకుల కోసం పోరాడిందని, వారిని చైతన్యవంతులు చేయడంలో సిపిఐదే కీలకపాత్ర అని అన్నారు. ఈ ప్రాంతంలో కార్మికుల కోసం రైతుల కోసం అనేక పోరాటాలు చేశామని సిపిఐ అభ్యర్థిని గెలిపిస్తే తండాను అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తామని అజయ్‌సారథిరెడ్డి హామీ ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వీరవల్లి రవి, గాదం శ్యాంప్రసాద్ యాదవ్, బయ్య శీను, సుమన్ శ్యామ్, శంకర్ పాల్గొన్నారు.

## నేడు సర్పంచ్ అభ్యర్థుల ఎన్నికల వ్యయంపై శిక్షణ

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** ఆత్మకూరు మండలకేంద్రంలో జిఎస్ఆర్ కన్వెన్షన్ హాల్ నందు సర్పంచ్‌బరిలో నిలిచిన అభ్యర్థులకు బుధవారం రోజున అధికారులచే శిక్షణ కార్యక్రమం ఇవ్వబడునని ఆత్మకూరు మండలం అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. స్థానిక తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ ఈ కార్యక్రమంలో పాల్గొని ఎలక్షన్ల నియమావళి ప్రకారం అభ్యర్థులు తమ ఎలక్షన్లకు ఖర్చు పెట్టే ఆదాయ, ఖర్చు ఎలా చేయాలో అభ్యర్థులు ఏ విధంగా ప్రవర్తించాలో వివరిస్తారని ఈ సందర్భంగా ఎంపిడిఓ తెలియజేశారు.

## బలహీన వర్గాల కోసం త్యాగం చేసిన సిపిఐ

ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం ప్రాణ త్యాగాలు చేసిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ దని ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మోట పలుకుల రమేష్ అన్నారు. మంగళవారం భూపాలపల్లి జిల్లాలో సిపిఐ పార్టీ బలపరిచిన పిడిసిల్ల గ్రామ సర్పంచ్ అభ్యర్థి తాటిపాముల కవిత శ్రీహరి ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ, బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి తాటిపాముల వెంకట్రాములుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం ప్రజల పక్షాన 100 సంవత్సరాలు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పోరాడిన చరిత్ర ఉందన్నారు. గత ప్రభుత్వాలు పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన అనేక హామీలను విస్మరించారని గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు. మళ్లీ అదే గ్రామాల్లోకి వెళ్లి గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓట్లు అడుగుతున్నారని, మళ్లీ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం మీ మధ్యలో ఉండి మీకు సేవ చేయడం కోసం సిపిఐ పార్టీ బలపరిచిన తాటిపాముల కవిత శ్రీహరిని ఆశీర్వదించి ఓటు వేసి గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తారని ఆయన హామీ ఇచ్చారు. ఈ నెల 11న జరిగే ఎన్నికల్లో ఉంగరం గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని రమేష్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గురిజపల్లి సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సోతుకు ప్రవీణ్ కుమార్, క్యాతరాజు సతీష్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తాళ్ళ పోషం తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్‌పూర్:** కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థికి ఓటు వేస్తే అభివృద్ధికి ఓటు వేసినట్లు.. ఊరును బాగు చేసుకుంటారో.. వేరే వాళ్లకు ఓటువేసి ఊరును ఆగం చేసుకుంటారో ప్రజలు ఆలోచించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం స్టేషన్ ఘన్‌పూర్ మండంలోని పాముసూరు, కోమటిగూడెం, రంగరాయగూడెం, ఇప్పగూడెం గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యంతో పేదల కడుపు నింపుతుందన్నారు. కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి పోలపల్లి సంపత్‌రెడ్డిని గెలిపిస్తే అతి త్వరలోనే పాముసూరు బంజరు మాటు పూర్తిచేసి సాగునీరు అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే మూడు నెలల్లో వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణం చేస్తామన్నారు. రెండో విడతలో 40 ఇందిరమ్మ ఇల్లు ఇస్తామన్నారు. గ్రామంలో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలన్నారు. కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు పనికర సోమయ్య, జులుకుంట్ల శిరీష్‌రెడ్డిని గెలిపిస్తే కోమటిగూడెం, రంగరాయగూడెం గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. కాషాగూడెం గ్రామానికి మట్టి రోడ్డు నిర్మాణం చేయిస్తానన్నారు. కోమటిగూడెంలో కాలువపై బ్రిడ్జి నిర్మాణం చేస్తానని తెలిపారు. రెండో విడతలో కోమటిగూడెంకు 30, రంగరాయగూడెంకు 30 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. మీరు అడిగిన పనులన్నీ చేసే బాధ్యత నాదని అందుకు మీరు కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలన్నారు.కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి మందపురం రాణిని గెలిపిస్తే ఇప్పగూడెం గ్రామాభివృద్ధికి రూ. 2 కోట్లతో సీసీ రోడ్డు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్‌గా రాణి గెలిచిన వెంటనే రూ. కోటి ఇస్తానన్నారు. అలాగే రెండో విడతలో 100 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తానన్నారు. రాజకీయ విబేధాలు లేకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలనేదే నా ఆలోచన అన్నారు. ఇప్పటికే ఇప్పగూడెం గ్రామంలో రూ. కోటితో పలు అభివృద్ధి పనులు చేసుకున్నామని, 54 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసుకున్నామన్నారు. ఇప్పగూడెం గ్రామానికి ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేసే బాధ్యత నేను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచ్ అభ్యర్థులు, వార్డు అభ్యర్థులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ విధులను సమర్థవంతంగా నిర్వహించాలి



జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్

**ప్రజాపక్షం/ములుగు:**ఎన్నికలలో ఎంతో ప్రాధాన్యతతో కూడుకుని ఉండే పోలింగ్ విధులను ప్రిసైడింగ్ అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్ ఎగ్జిక్యూటివ్ ఆయిల్‌ఫెడ్, హైదరాబాద్ అన్నారు. మంగళవారం వాజేడు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూడవ విడతలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ తరగతులను సందర్శించిన అబ్జర్వర్ పోలింగ్ విధులకు సంబంధించి కీలకమైన సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియలో పిఓలు క్రియాశీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందని అన్నారు. నిబంధనలు పక్కాగా పాటిస్తూ పోలింగ్ ప్రక్రియను సాఫీగా నిర్వహించాలని, ఏ చిన్న తప్పిదానికి ఆస్కారం కల్పించకూడదని సూచించారు. సమయపాలన పాటిస్తూ సకాలంలో నిర్దేశించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ నిబంధనలు, మార్గదర్శకాలను అధికారులు తప్పకుండా పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ, మాస్టర్ ట్రైనర్, పిఓలు, తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై

## పార్లమెంట్‌లో ప్రశ్నించిన ఎంపి కావ్య



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వశాఖ సహాయ మంత్రి బి.ఎల్. వర్మ వివరణాత్మకంగా వెల్లడించారు.వికలాంగుల పునరావాసాన్ని లక్ష్యంగా పెట్టుకుని అమలు చేస్తున్న ఎడిఐపి పథకం కింద ఆధునిక సహాయక పరికరాల కొనుగోలు–అమరికకు అర్హులైన వారికి ఆర్థిక సాయం అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సాధారణ సహాయక పరికరాలకు రూ.15,000 వరకు, హై–ఎండ్ కృత్రిమ అవయవాలకు రూ.30,000 వరకు, మోటరైజ్డ్ ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లకు రూ.50,000 వరకు ప్రభుత్వం మద్దతు ఇస్తోందన్నారు.ఆరోగ్య బీమా పథకం ద్వారా సంవత్సరానికి రూ.1 లక్ష ఆరోగ్య బీమా అందుబాటులో ఉంది. ఇందులో సరిదిద్దే శస్త్రచికిత్సలు (రూ.40 వేల వరకు), అవుట్‌పేషెంట్ చికిత్సలు, డయగ్నస్టిక్ పరీక్షలు, థెరపీ సేవలు, ఆయుష్ మందులు, రవాణా భత్యం లాంటి సౌకర్యాలు ఉంటాయని మంత్రిత్వశాఖ వివరించింది. 2025–26నాటికి మొత్తం 66,356 మంది లబ్ధిదారులు నమోదు కాగా, ఇప్పటివరకు రూ.9.9 కోట్లు ఖర్చయినట్లు తెలిపింది.వృద్ధుల కోసం అమలులో ఉన్న అటల్ వయో అభ్యుదయ యోజన కింద గౌరవప్రదమైన జీవనం కోసం అనేక సేవలను సమన్వయం చేస్తున్నట్లు వెల్లడించింది. 2014–15 నుండి ఇప్పటివరకు ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఫర్ సీనియర్ సిటిజన్స్ ద్వారా 10.20 లక్షల మంది వృద్ధులకు ఆశ్రయం, ఆహారం, వైద్య సేవలు అందించబడినట్లు చెప్పింది. రాష్ట్ర కార్యాచరణ ప్రణాళికలు, వృద్ధులకు ఉచిత సహాయక పరికరాలు అందించే సహాయం కోసం 14567 ఎల్డర్‌లైన్ హెల్ప్‌లైన్, 2023–24లో ప్రారంభమైన జిరియాట్రిక్ కేర్‌గివర్‌ల శిక్షణ వంటి కార్యక్రమాలు ప్రధాన భాగాలని తెలిపింది.అంతే కాకుండా ఆయుష్ శాఖతో ఆరోగ్య సేవల కోసం ఒప్పందాలు, బ్రహ్మకుమారీస్‌తో ఆధ్యాత్మిక ఆరోగ్య కార్యక్రమాలు, డిమెన్షియా అవగాహన కార్యక్రమాలు, డిజిటల్ లిటరసీపై శిక్షణ కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నాయని తెలిపారు. జాతీయ సామాజిక భద్రతా పథకం కింద ప్రస్తుతం వృద్ధాప్య పెన్షన్ రూ.200 నుంచి రూ.500 వరకు మాత్రమే ఉండి, పెంపుపై ఎలాంటి ప్రతిపాదనలూ లేవని మంత్రి స్పష్టం చేశారు. ఎన్‌జిఒలు, సంస్థల ద్వారా అవగాహన కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడం, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పథకాలన్నీ దివ్యాంగులు, వృద్ధుల స్వాభిమానాన్ని, సక్రియ జీవనశైలిని ప్రోత్సహించడమే లక్ష్యమని కేంద్ర సహాయ మంత్రి బి.ఎల్. వర్మ తెలిపారు.

## కెజిబివిలో వసతులు మెరుగుపర్చాలి



**ప్రజాపక్షం / జనగామ :**కెజిబివిలలో వసతులు మెరుగు పర్చాలని జనగామ జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి పింకేష్‌కుమార్ అన్నారు. మంగళవారం జనగామ జిల్లా చిల్పూర్ మండలం కెజిబివిని పరిశీలించారు. భవన నిర్మాణం, తరగతి గదులు, కిచెన్ షెడ్, టాయిలెట్, బాక్స్, తాగునీటి సౌకర్యం, భద్రతా ప్రహరీ, విద్యార్థుల వసతి గతదుల్లో అవసరమైన మరమ్మత్తులు, పునరుద్ధరణ వంటి అంశాలను ఆయన విపులంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ మాట్లాడుతూ కెజిబివిలో కనీస వసతులు మెరుగు పర్చడం అంత్యంత కీలకమన్నారు. నిర్దేశింత కాల వ్యవధిలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఇ, ఎఇ, డిసిడిఓ గౌసియాబేగం, ఎస్ఓ ప్రశాంతి పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన కలెక్టర్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆవిష్కరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## 11న వేతనంతో కూడిన సెలవు

### కార్మిక శాఖ డిప్యూటీ లేబర్ కమిషనర్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎన్నికలు జరుగుతున్న పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆఫీసులు, షాపులు, వాణిజ్య సంస్థలు, ఇతర పరిశ్రమల యజమానులు తమ ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని కార్మిక శాఖ డిప్యూటీ లేబర్ కమిషనర్ విజయ్ భాస్కర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాల మేరకు ఆయా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు సెలవుతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆయన తెలిపారు. ఈ నెల 11న తొలి దశ ఎన్నికలు జరుగుతున్న కొణిజర్ల, రఘునాథపాలెం, వైరా, బోనకల్, చింతకాని, మధిర, ఎర్రుపాలెం మండలాల్లో విధిగా ఆయా సంస్థల నిర్వాహకులు తమ కార్మికులకు, సిబ్బందికి సెలవు ఇవ్వాలని డిసిఎల్ సూచించారు. అదేవిధంగా 14న రెండవ దశ ఎన్నికలు జరగనున్న కామేపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి, ముదిగొండ, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లోని సంస్థలు కూడా తమ వద్ద పనిచేసే వారికి సెలవు ఇచ్చే అంశాన్ని విధిగా పాటించాలన్నారు. ఈనెల 17న తుది దశ ఎన్నికలు జరగనున్న ఏన్కూరు, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, తల్లాడ, వేంసూరు, సింగరేణి (కారేపల్లి) మండలాల్లోని వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు, ఉద్యోగులకు సెలవు ఇచ్చి వారు ఓటు హక్కు వినియోగించుకునేందుకు సహకరించాలన్నారు. ఓటు హక్కు వినియోగించుకున్న ఉద్యోగులకు ఏవిధంగానూ జీతం కట్ చేయరాదన్నారు. ఉద్యోగుల ఓటు హక్కు వినియోగానికి ఆటంకం కలిగించినా, సెలవు, సమయం ఇవ్వకపోయినా ఫిర్యాదు అందితే సంబంధిత సంస్థలపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని విజయ్‌భాస్కర్‌రెడ్డి హెచ్చరించారు.

## ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### పువ్వాడ నగర్‌లో సిపిఐ నాయకుల ప్రచారం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే వారిని గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలిపించాలని సిపిఐ ఖమ్మం నియోజక వర్గ కార్యదర్శి ఎస్‌కె జానిమియా పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని పువ్వాడ ఉదయ్‌నగర్‌లో సిపిఐ అభ్యర్థి బి. వెంకటేశ్వర్లు విజయాన్ని కాంక్షిస్తూ సిపిఐ నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాడే కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయన కోరారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజల కోసం పనిచేసేది కమ్యూనిస్టులేనన్నారు. ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. పని చేసే వారిని గుర్తించి వారిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, వన్‌టౌన్ కార్యదర్శి వరద నర్సింహారావు, మేరీ వి నోద, సామ్రాజ్యం, సత్యావతి, చాంద్వి, భవాని, స్వాతి, అనూష పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి చేరికలు





**ప్రజాపక్షం/ మధిర :** డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి, అమ్మా ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని సమక్షంలో బిఆర్‌ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలోకి మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామస్తులు చేరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కర్నాటి రామారావు, గ్రామశాఖ అధ్యక్షులు బంగారం గ్రామానికి చెందిన 10కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరరంగా ఆహ్వానించా రు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారని, వారికి ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని మల్లు నందిని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, నాయకుఉలు వేల్పుల చెంచయ్య, పెరుమాళ్ళపల్లి శ్యామ్, బాణోతు వెంకటరమణనాయక్, బాణోతు హనుమంతు, భూక్య చిట్టిబాబు పాల్గొన్నారు.

## ఎస్‌బిఐటిలో ఘనంగా హ్యాకథాన్




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రేపటి సమస్యలకు నేడే పరిష్కారం కనుగొనడం హ్యాకథాన్ లక్ష్యమని ఎస్‌బిఐటి కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన రెండు రోజుల అంతర్గత హ్యాకథాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుండాల కృష్ణ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ కళాశాలలోని ఇన్నోవేషన్ అండ్ ఇన్క్యూబేషన్ సెల్ ద్వారా లాంచ్ ప్యాడ్ 1.0 పేరుతో నిర్వహించిన హ్యాకథాన్‌లో 35 బృందాలు పాల్గొన్నాయన్నారు. ప్రిన్సిపాల్ డా॥ జి. రాజ్‌కుమార్ మాట్లాడుతూ వి ద్యతో పాటు ఆధునిక సాంకేతిక రంగాల్లో జరుగుతున్న మార్పులను అలవర్చుకుని ఇటువంటి వినూత్న పోటీల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న నూతన ఆవిష్కరణలను వెలికితీయవచ్చునన్నారు.ఇన్నోవేషన్ అండ్ ఇన్క్యూబేషన్ సెల్ ఇంచార్జి డా॥ మురళీమోహన్, పి.అశ్వని, అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, హెచ్‌వోడిలు అమిత్ బిందాజ్, చరణ్‌సింగ్, సుప్రియ, స్ఫూర్తి, పద్మావతి, రామకృష్ణ, నాగమణి, ప్రభాకర్, టిపివో సవిత పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి రూ.8 వేల స్టాండ్ ఫ్యాన్లు వితరణ

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయం పై ఆధారపడి చదువుకుని సాంఘిక సంక్షేమశాఖ హాస్టల్ వెల్ఫేర్ అధికారిగా ఉద్యోగాన్ని సాధించిన భారీ లక్ష్మణ్ గ్రంథాలయానికి రూ.8వేల విలువ చేసే రెండు స్టాండ్ ఫ్యాన్లను మంగళవారం గ్రంథాలయానికి వితరణ అందజేశారు. వీటిని లక్ష్మణ్ సతీమణి చైతన్య చేతుల మీదుగా ఇచ్చారు. సెలువు దినాల్లో పోటీ పరీక్షలకు సిద్ధ పడుతున్న వారి కోసం గ్రంథాలయాన్ని తెరిచి ఉంచామన్నారు. ఏకాగ్రతతో చదివి ఉద్యోగాలు సాధించి ఉన్నతస్థానాల్లో నిలిచేందుకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడ్డాయని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన వారిని ఆదర్శంగా తీసుకుని మిగతా వారు కూడా పోటీ తత్వాన్ని అలవర్చుకుని ఉద్యోగాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు.

## ముగిసిన ప్రచారం

# ‘ఇక’ ప్రలోభాల పర్వం

### మద్యం దుకాణాలు బంద్

### కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి తొలి విడత ప్రచారం మంగళవారం సాయంత్రంతో ముగిసింది. బహిరంగ ప్రచారం ముగియడంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రలోభాలకు తెర లేపారు. మొదటి విడతకు సంబంధించి గత వారం రోజులుగా పోటీలో ఉన్న అభ్యర్థులు హోరా హోరీ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తమ గుర్తును ఓటర్లకు చెబుతూ ఓట్లు అభ్యర్థించారు. బహిరంగ ప్రచారం ముగియడంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు. తులమో ఫలమో అప్పజెబుతూ తమకు ఈ ఒక్కసారి అవకాశం ఇవ్వాలంటూ ఓటర్లను వేడుకుంటున్నారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో ఓటుకు రూ. 5వేల చొప్పున కూడా పంచేందుకు అభ్యర్థులు సిద్ధమయ్యారన్న చర్చ గ్రామాల్లో సాగుతుంది. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అభ్యర్థులు గెలుపు కోసం వివిధ రూపాల్లో ఓటర్లను తమ వైపుకు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రయాణ ఖర్చులను కూడా భరించేందుకు సిద్ధమయ్యారు. అధికార పార్టీ, ప్రతిపక్ష అనే తేడా లేకుండా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. మొదటి విడతలో డిసెంబర్ 11న ఏడు మండలాల పరిధిలోని 172 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలతో పా టు 1415 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మద్యం దుకాణాలు (వైన్స్) బార్ షాపుల ను మూసివేయనున్నారు. ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండాపోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

**మొదటి దశ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు :** కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లాలో మొదటి విడత పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లాలో మొదటి విడత డిసెంబర్ 11న ఏడు మండలాల పరిధిలోని 172 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, 1415 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ డిసెంబర్ 11న ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతుందని మధ్యాహ్నం రెండు గంటల నుంచి లెక్కింపు ఉంటుందని తెలిపా రు. మొదటి దశ ఎన్నికల నిర్వహణకు జిల్లాలో 2089 బ్యాలెట్ బాక్స్‌లను అందుబాటులో ఉం చామని, 1899 పోలింగ్ అధికారులు, 2321 ఇతర పోలింగ్ అధికారులను నియమించామన్నారు.అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

## ఓటర్లను ప్రలోభాలకు గురిచేయవద్దు

### పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

### రాజకీయనాయకులు, అభ్యర్థులతో అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఓటర్లను ప్రలోభాలకు గురి చేయవద్దని...నియమనిబంధనలకు అనుగుణంగా వ్యవహరించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ హెచ్చరించారు. మంగళవారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని నాయుడుపేట బైపాస్‌లో గల రాంలీల ఫంక్షన్‌హాల్‌లో ఖమ్మంరూరల్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో రాజకీయ నాయకులు, అభ్యర్థులతో అవగాహణ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చూలా కీలకమని, వ్యక్తిగత దూషణలకు వెళ్లకుండా అందరూ సమన్వయం పాటించాలన్నారు. గ్రామాల్లో ఏదైనా ఘర్షణ వాతావరణం ఉండే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు గౌరవించి పోలీసులకు సహకరిస్తే ఎన్నికలు ప్రశాంత వాతవారణంలో కొనసాగుతాయన్నారు. ఎక్కడ కూడా శాంతిభద్రతల సమస్య రాకుండా పోలీసులు సూచనలు పాటించాలని లేని పక్షంలో సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ యాక్ట్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఎన్నికలు ఫలితాల అనంతరం ఎలాంటి ర్యాలీలు సమావేశాలకు అనుమతి లేదన్నారు. ట్రైని డిప్యూటీ కలెక్టర్ ఎం.అపూర్వ, ఏఆర్ అడిషనల్ డీసీపీ విజయబాబు, ఏసీపీ తిరుపతిరెడ్డి, ఏఆర్ ఏసీపీ నర్సయ్య, తహశీల్దార్ రాంప్రసాద్, ఎంపిడీఓ రవికుమార్, సిఐ ముష్కరాజు పాల్గొన్నారు.

# నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

### ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు విద్యార్థి సంఘాలపై ఉన్న ఆర్టీసి కేసు కొట్టివేత



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఆర్టిసి సమ్మె సందర్భంగా 2019లో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసులు మోపిన అక్రమ కేసును మంగళవారం ఖమ్మం మొదటి అదనపు కోర్ట్ న్యాయమూర్తి కొట్టివేయడం జరిగిందని ఎఐఎస్‌ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్టిసి సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర పన్ని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులను నిర్బంధాలకు గురి చేసి అక్రమ కేసులను బనాయించిందన్నారు. 2019లో బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టిసిని ప్రైవేటీకరించకుండా ఆర్టిసి కార్మికులు 53 రోజుల పాటు చేపట్టిన సమ్మెకు ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు విద్యార్థి మద్దతు తెలిపాయన్నారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సమ్మెకు మద్దతుగా పెవిలియన్ మైదానం నుంచి బస్‌డిపో ముట్టడికి చేపట్టిన కేసిఆర్ శవ యాత్ర కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. అప్పుడు పోలీసులు, విద్యార్థి సంఘాల నాయకుల మధ్య తోపులాట జరిగిందన్నారు. అప్పుడు తొమ్మిది మందిపై కేసులు పెట్టడం జరిగిందన్నారు. ఆరేండ్లుగా కేసు విచారించిన న్యాయస్థానం పోలీసులు అక్రమంగా కేసులు పెట్టారని కొట్టివేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిర్బంధాలకు భయపడేది లేదని సమస్యలపై నిరంతరం ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. కేసును కొట్టివేసిన న్యాయమూర్తికి, వాదించిన న్యాయవాదులు విప్లవ్ కుమార్, సంధ్య లకు విద్యార్థి సంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపారు.వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ఇటికాల రామకృష్ణ, చింతల రమేష్, ఆజాద్, మడుపల్లి లక్ష్మణ్, జమ్మి అశోక్, మందా సురేష్, బాగం హేమంత్, గోకినేపల్లి మస్తాన్, గాయత్రి పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధే గెలుపునకు బలం

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తకూడెం :** సమిష్టి కృషితో నియోజకవర్గంలో సిపిఐ, మిత్రపక్షాలు బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకుని అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళదామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో మంగళవారం జరిగిన శ్రీనగర్ కాలనీ గ్రామపంచాయితీ సర్పంచ్, వార్డు అభ్యర్థులు, ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. సర్పంచ్ అభ్యర్థిని పోలిబోయిన సౌజన్యకు పార్టీ కండువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీనగర్ ప్రాంతానికి చెందిన పోలిబోయిన సంపత్, పాయం మాధవి, నగేష్, రవి,ఇ సురేందర, సరళ, నరేందర్ తదితరులకు ఎర్ర కుండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. స్థానిక శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు కృషితో నియోజకవర్గంలో జరిగిన అభివృద్దే సిపిఐ అభ్యర్థులకు బలమని, జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి విజయాన్ని సులభతరం చేసుకోవాలని సూచించారు. ప్రజలు ప్రలోబాలకు లొంగకుండా ప్రజల కోసం అనునిత్యం శ్రమించే సిపిఐ అభ్యర్థులను గెలిపించడం ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు.

## ధాన్యం కేటాయింపుకు బ్యాంక్ గ్యారంటీ తప్పనిసరి

### అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని రైస్ మిల్లర్లకు వరి ధాన్యం కేటాయింపు చేసేందుకు బ్యాంకు గ్యారెంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్ చూపించడం తప్పనిసరి అని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో రైస్ మిల్లర్లతో ధాన్యం కేటాయింపు, బ్యాంక్ గ్యారెంటీ, పెండింగ్ సిఎంఆర్ రైస్ డెలివరీపై అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి సమీక్షించారు. యాసంగి 2024 25 పంటకు సంబంధించి డిసెంబర్ ఎనిమిది వరకు జిల్లాలో పెండింగ్ ఉన్న 12 శాతం సిఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించి 107676 మెట్రిక్ టన్నుల సిఎంఆర్ రైస్ డెలివరీ లక్ష్యానికి గాను ఇప్పటి వరకు 95,100 మెట్రిక్ టన్నుల సిఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేశారని, పెండింగ్ 12,576 మెట్రిక్ టన్నులు పూర్తి చేయాలన్నారు. రాజేశ్వరరావు, మిల్లర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులు ఇంటింటికి ఎన్నికల ప్రచారం



**ప్రజాపక్షం/పాల్వంచ :** అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యులను గెలిపించాలని డిసిసి ప్రసిడెంట్ తోట ప్రసన్న దేవి అన్నారు. మండల పరిధి జగన్నాధపురం గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి బానోత్ అనిత, వార్డు సభ్యులతో కలిసి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ఓటేయాలన్నారు. ఇంటింటికి తిరుగుతూ ఉంగరం గుర్తుపై ఓటేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దమ్మతల్లి గుడి ధర్మకర్తల మండలి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ కన్వీనర్ బాదర్ల జోషికుమార్, నాయకులు నందా నాయక్, బాలాజీ, కామాచారి, కుమార్, పున్నమ్మ, బాదర్ల నాగేశ్వరరావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**సిపిఐతో పొత్తు లేదు :** స్థానిక సంస్థల ఎన్నికలలో సిపిఐతో ఎలాంటి అవగాహన, పొత్తులు లేవని రాష్ట్ర మార్క్‌ఫెడ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు స్పష్టం చేశారు. పాత పాల్వంచలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అధిక మెజారిటో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధినాయకుల ఫోటోలు కానీ, పార్టీ వ్యక్తులను ప్రచారంలో వాడుకుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాలే జానకిరెడ్డి, ఎర్రంశెట్టి ముత్యయ్య, కొండం వెంకన్నగౌడ్, పైడిపల్లి మహేష్, ఉండేటి శాంతి వర్ధన్, ధర్మసోత్ ఉపేందర్ నాయక్, వాసమల్ల సుందర్‌రావు,భాషబోయినఅశోక్, కీసర రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ వలయంలో పోలింగ్ కేంద్రాలు..

- భారీ పోలీసు బందోబస్తు
- రెండు వేల మంది మోహరింపు
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సాయుధ బలగాలు
- 5 ఎఫ్ఎస్టీ..15 ఎస్ఎస్టీ బృందాలతో నిఘా
- వివరాలు వెల్లడించిన సిపి సునీల్‌దత్



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా జిల్లాలో రెండువేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసు కమిషనర్ సునిల్‌దత్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. ఎన్నికలలో పోలీసుల విధివిదానాలపై దిశానిర్దేశం చేశామన్నారు. పౌరుల స్వేచ్ఛకు భంగం వాటిల్లకుండా, ప్రలోభాలకు తావులేకుండా ఓటర్లు స్వచ్ఛందంగా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృషిసారించి తగు ఏర్పాట్లు చేసిందన్నారు. ఇప్పటికే ఎన్నికలు జరిగే మండలాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సాయుధ బలగాలను మెహరించామన్నారు. స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, రూట్ మొబైల్ పార్టీలతో పాటు 5 ఎఫ్ఎస్టి, 15 ఎస్ఎస్టి బృందాలతో నిరంతరం నిఘా కొనసాగుతోందన్నారు. డబ్బు, మద్యం ప్రభావితాన్ని నియంత్రించేలా తనిఖీలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే 953 కేసుల్లో 6403 మందిని తహసిల్దార్ ఎదుట హాజరుపరిచి బైడవర్లు చేశామన్నారు. జిల్లాలో జరిగే మూడు విడతల ఎన్నికలలో 184 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని వాటిలో నామినేషన్ దాఖాలు ప్రక్రియ నుంచే పోలీసు నిఘా పెంచామన్నారు. గ్రామాల్లో ప్రతి కదలికపై ఏసిపి స్థాయి అధికారి ఆధ్వర్యంలో నిరంతరం పర్యవేక్షణ ఉందన్నారు. పోలింగ్ రోజు ప్రత్యేక బలగాలతో బందోబస్తు నిర్వహిస్తామని, జిల్లా కేంద్రంలో స్పెషల్ బ్రాంచ్, ఇతర సిబ్బందితో ఇరవైనాలుగు గంటలు పనిచేసేలా ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తాంగా, అంతర్‌రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో 16 చెక్‌పోస్టు ఏర్పాటు చేసి ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలతో నిరంతరం తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అనధికారికంగా మద్యం నిల్వలు చేసుకుని విక్రయాలు సాగిస్తున్న బెల్ట్ షాపులపై దాడులు చేసి 12 లక్షలు విలువ చేసే 1200 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు సిపి తెలిపారు. జిల్లాలో తుపాకులు కలిగిన 86 మంది తమ ఆయుధాలను జిల్లా పోలీసు హెడ్‌క్వాటర్స్‌లో అప్పగించినట్లు తెలిపారు. 207 మంది రౌడీ షీటర్లు, 1100 మంది ట్రబుల్ మంగర్స్ పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచామన్నారు. ఎన్నికలు జరిగే డివిజన్లలో ఇద్దరు ఏసిపి స్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించామన్నారు. శాంతిభద్రతల దృష్ట్యా ఎన్నికలు జరిగే మండలాల్లో సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ కోసం గ్రామాల వారిగా భద్రతా చర్యలు తీసుకున్నట్లు పోలీసు కమిషనర్ సునిల్ దత్ వివరించారు.




### పోలింగ్ బందోబస్తులో అధికారులు వీరే

అడిషనల్ డిసిపిలు ప్రసాద్‌రావు, రామానుజం, కుమారస్వామి, విజయబాబు, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతి రెడ్డి, వసుంధర యాదవ్, శ్రీనివాసులు, మహేష్, సాంబరాజు, సత్యనారాయణ, సర్వర్, సుశీల్‌సింగ్, నర్సయ్యతో పాటు సిఐలు, రిజర్వ్ ఇన్స్‌స్పెక్టర్లు, ఎస్సైలు, ఇతర పోలీసు సిబ్బంది, హోంగార్డులు మొత్తం రెండు వేల మంది బందోబస్తులో పాల్గొంటారని సిపి వివరించారు.

# రీల్

## శశిరేఖా @ 20+మిలియన్ వ్యూస్




మెగాస్టార్ చిరంజీవి హీరోగా నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న సినిమా 'మన శంకర వరప్రసాద్ గారు'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి ఇటీవల శశిరేఖా అనే పాటను విడుదల చేశారు. ఈ పాట విడుదల అయిన కొద్ది గంటల్లోనే 20 మిలియన్స్ కంటే ఎక్కువగా వ్యూస్ సంపాదించుకుంది చిత్ర నిర్మాతలు తెలిపారు. ఈ పాటను చిరంజీవి, నాయనతారలపై చిత్రీకరించారు. భీమ్స్ సంగీతం అందించిన ఈ పాటను గాయని మధు ప్రియతో పాటు భీమ్స్ కలసి ఆలపించారు. ఈ పాటకు గేయ రచయిత అనంత శ్రీరామ్ సాహిత్యం అందించారు. చిరంజీవి, వెంకటేష్‌పై కూడా ఒక పాటను చిత్రీకరించారు. ఇద్దరు స్టార్ హీరోలపై చిత్రీకరించిన పాటను కూడా త్వరలోనే విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అన్ని పనులు పూర్తి చేసి వచ్చే సంక్రాంతికి ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. చిరంజీవి కుమార్తె సుస్మిత, సాహు గారపాటి కలసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

## ఈ సంక్రాంతికి భర్త మహాశయులకు విజ్ఞప్తి



మాస్ మహా రాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్న అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'తో అలరించబోతున్నారు. ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యాన్ప సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జీ స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఇందులో రవితేజ సరసన ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి కథానాయికలుగా నటిస్తున్నారు. బ్లాక్ బస్టర్ ఫస్ట్ సింగిల్ బెల్లాబెల్లాతో మ్యూజిక్ ప్రమోషన్లను స్టార్ చేసిన నిర్మాతలు ఇప్పుడు సెకండ్ సింగిల్ విడుదల చేయడానికి సిద్ధమవుతున్నారు. సెకండ్ సింగిల్ అద్దం ముందు డిసెంబర్ 10న రిలీజ్ కానుంది. రవితేజ, డింపుల్ హయతిపై చిత్రీకరించిన ఈ సాంగ్ అదిరిపోయే మెలోడీ డ్యూయెట్. మేకర్స్ రిలీజ్ చేసిన ప్రోమోలో రవితేజ, డింపుల్ హయతి కెమిస్ట్రీ చూడముచ్చటగా వుంది. ఫుల్ సాంగ్‌పై అంచనాలు పెంచింది. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ ప్రసాద్ మురెళ్ల, జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్, ప్రొడక్షన్ డిజైనర్ ఏఎస్ ప్రకాష్. భర్త మహాశయులకు విజ్ఞప్తి 2026 సంక్రాంతికి విడుదల కానుంది.

## 'చాయ్ షాట్స్' ఓటిటి షురూ




చాయ్ బిస్కెట్ సంస్థ ఇప్పుడు చాయ్ షాట్స్ ఓటిటి ప్రారంభించింది. నటుడు దగ్గుబాటి రానా ఈ ఓటిటిని ప్రారంభించారు. ముందుగా తెలుగులో ఈ చాయ్ షాట్స్‌ను ప్రారంభించి తరువాత ఇతర భాషల్లో కూడా ప్రవేశిస్తారని ఈ సందర్భంగా రానా చెప్పారు. కొత్తగా వచ్చే నటి నటులకు, కొత్తగా ఏదైనా క్రియేట్ చెయ్యాలనే తపన ఉన్న రచయితలకు ఈ చాయ్ షాట్స్ చాలా ఉపయోగకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. రెండు, మూడు నిమిషాల్లో స్టోరీ చెప్పే పద్ధతి ఇప్పుడు మొబైల్‌లో వచ్చేసిందని అన్నారు. ఇదే పద్ధతిని చాలా మంది జనం కూడా ఆదరిస్తున్నారని చెప్పారు. అందుకే చాయ్ షాట్స్ వాళ్ళు కూడా ఈ మార్కెట్‌లో ప్రవేశించారని, ఎంటర్ టైన్మెంట్‌కు తెలుగులో విశేష ఆదరణ ఉందని రానా పేర్కొన్నారు. వినోదాత్మక మార్కెట్‌లో ఇలాంటివి కొత్తవి ఏమొచ్చిన తాను సహకారం అందిస్తానని చెప్పారు. చాయ్ షాట్స్ ఎలా పని చేస్తుంది. ఎవరి కోసం పని చేస్తుంది. ఎలాంటి కంటెంట్ ఉంటుంది వంటి అంశాలను చాయ్ బిస్కెట్ శరత్, చాయ్ బిస్కెట్ అనురాగ్, సీటీవో కృష్ణ వివరించారు.

ఈషా రెబ్బా, సత్య, హర్ష చెముదు, ప్రిన్స్ సిసిల్, హేమ, సత్యం రాజేశ్, కుషిత కల్లపు ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'త్రీ రోజెస్'. ఆహా ఓటీటీలో సూపర్ హిట్టయిన ఈ సిరీస్ సీజన్ 2 ఈ నెల 12వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కు రెడీ అవుతోంది. రాశీ సింగ్ మరో కీ రోల్ చేసింది. ఈ సిరీస్‌ను మాస్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఎస్‌కేఎన్ నిర్మిస్తున్నారు. కిరణ్ కె కరవల్ల దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా హీరోయిన్ ఈషా రెబ్బా, యాక్టర్ హర్ష చెముదు మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు.

### ఈ సిరీస్‌లో గ్లామర్ డోస్ పెంచలేదు.. - ఈషా రెబ్బ

'త్రీ రోజెస్' సీజన్ 2లో నేను కంటిన్యూ కావడం హ్యాపీగా ఉంది. సీజన్ 1లో ఫీమేల్ క్యారెక్టర్స్‌కు వేర్వేరు సీన్స్ ఉంటాయి. ఈ సీజన్ 2లో ఆ క్యారెక్టర్స్ అన్నింటికి కలిపి కాంబినేషన్ సీన్స్ ఉంటాయి. వెకేషన్ కు వెళ్లే సన్నివేశాలు సీన్స్ చేశాం. నేను రాశీ కుషిత మూడు కీ రోల్స్ చేశాం. రాశీ ఫైర్ బ్రాండ్ లా ఉంటుంది. కుషిత చిన్న పిల్లలా అల్లరి చేసేది. వీళ్లిద్దరితో కలిసి నటించడం ఎంజాయ్ చేశాను. ఈ సిరీస్‌లో గ్లామర్ డోస్ పెంచలేదు. యూత్ ఫ్యామిలీ అంతా కలిసి సిరీస్ చూడొచ్చు. 'త్రీ రోజెస్' సీజన్ 2లో మొత్తం 6 ఎపిసోడ్స్ ఉంటాయి. ఒక్కో ఎపిసోడ్ 30 నిమిషాల నిడివితో సాగుతుంది. 'త్రీ రోజెస్' సీజన్ 3కి లీడ్ ఇస్తూ సీజన్ 2 కంప్లీట్ అవుతుంది. సీజన్ 1లో మా పెయిర్‌కు వచ్చిన రెస్పాన్స్‌తో సీజన్ 2లో ఇంకా బాగా కాన్ఫిడెంట్‌గా చేశాం. 'త్రీ రోజెస్' వెబ్ సిరీస్ అనేది మా కెరీర్‌లో ఒక స్పెషల్ ప్రాజెక్ట్‌గా మిగిలిపోతుంది. ఫీమేల్ ఓరియెంటెడ్ ప్రాజెక్ట్స్ వస్తే నన్ను నేను అందులో రిలేట్ చేసుకోగలిగితే నటించేందుకు ఒప్పుకుంటా. నేను లాక్ డౌన్‌లో మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నా. యాక్షన్ మూవీస్ లో అవకాశం వస్తే నటిస్తా. మా అమ్మ వాళ్లది రాజమండ్రి, మా నాన్నది వరంగల్ కాబట్టి సంక్రాంతికి ఏపీకి వెళ్తా, అలాగే ఇక్కడ పండుగలకు వరంగల్ వెళ్తుంటా. అని ఈషా రెబ్బ చెప్పింది.

### ఇండస్ట్రీలో ఉండాలనేది నా కోరిక - హర్ష

కమెడియన్ హర్ష చెముదు మాట్లాడుతూ ఇందులో కొన్ని అతిథి పాత్రలు కూడా వస్తుంటాయి. 'త్రీ రోజెస్' సీజన్ 1లోని రివేంజ్‌ను ఈ సీజన్ 2లో తీర్చుకునేందుకు నేను ప్రయత్నిస్తుంటాను. ఈషా, నా క్యారెక్టర్స్ డిఫరెంట్ ప్లేసెస్ నుంచి వస్తాయి. మన తెలుగు వెబ్ సిరీస్ లకు చూసుకుంటే ఇది పక్కా సీక్వెల్. ఈ సంక్రాంతికి వస్తున్న అన్ని సినిమాల్లో నటించా. రోజూ వర్క్ చేస్తూ ఇండస్ట్రీలో ఉండాలనేది నా కోరిక. నన్ను కామెడీతో పాటు మిగతా ఎమోషన్స్ చేయగలను అని నమ్మే ఈ సిరీస్‌లో అవకాశం కల్పించారు. బకాసుర అనే మూవీ చేశా. అందులోనూ ఒక డిఫరెంట్ క్యారెక్టర్‌లో నటించా. మోగ్లీలో కొత్త పాత్రలో కనిపిస్తా. ఒక్కో టైమ్‌లో ఇండస్ట్రీలో ఒక్కో ట్రెండ్ నడుస్తుంటుంది. ఇప్పుడు మన దగ్గర ఫన్ ట్రెండ్ నడుస్తోంది. ఎంటర్ టైనింగ్ మూవీస్ బాగా చూస్తున్నారు. కొన్నాళ్లకు మరో ట్రెండ్ వస్తుంది. ఫలానా హీరోతో పనిచేయాలి అనే లిస్టు చాలా పెద్దది. అందరితో వర్క్ చేయాలని ఉంది. క్యారెక్టర్ బాగుంటే లీడ్ క్యారెక్టర్, చిన్న క్యారెక్టర్ అనే తేడాలు చూడను. సాయి రాజేశ్ ప్రొడక్షన్‌లో ఒక మూవీలో ఇంపార్టెంట్ రోల్ చేస్తున్నా. ప్రభాస్ రాజా సాబ్ లోనూ ఒక రోల్ చేశా. కీలకమైన సన్నివేశంలో నా పాత్ర ఉంటుంది.



## 'ఓం శాంతి శాంతి శాంతిః' టీజర్ ఆవిష్కరణ

ట్యాలెంటెడ్ ఫిల్మ్ మేకర్స్ తరుణ్ భాస్కర్ తన అద్భుతమైన నటనతో కూడా తెరపై అలరిస్తున్నారు. 'ఓం శాంతి శాంతి శాంతిః అనే కొత్త చిత్రంలో మరోసారి కీలకమైన పాత్రలో కనిపిస్తున్నారు. ఈషా రెబ్బా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఏ ఆర్ సజీవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్ ,నవీన్ సనివరపు ఈ వెంచర్ను నిర్మిస్తున్నారు, కిషోర్ జాలాది, బాల సౌమిత్రి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. మొత్తం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్‌ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుపుకుంటోంది. ఈ నేపదాయంలో సినిమా టీజర్ను దర్శకుడు, నటుడు తరుణ్ భాస్కర్ ఆవిష్కరించారు.



## 'టాక్సిక్' పోస్టర్ రిలీజ్




'కేజీఎఫ్' సినిమాతో 'రాకింగ్ స్టార్'గా ఎదిగిన కన్నడ హీరో యష్ తన తదుపరి చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ ఫర్ గ్రోన్ అప్స్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. నేషనల్ అవార్డు విన్నర్ గీతూ మోహన్ దాస్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై యష్, వెంకట్ కె.నారాయణ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా సినిమాగా రాబోతున్న ఈ చిత్రం మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఈ సినిమా విడుదలకు ఇంకా 100 రోజులే ఉండడంతో ఈ విషయాన్ని తెలుపుతూ కౌంట్‌డౌన్ పోస్టర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందిస్తుండగా.. సినిమాటోగ్రఫీ: రాజీవ్ రవి, ఎడిటింగ్: ఉజ్వల్ కులకర్ణి, ప్రొడక్షన్ డిజైన్: టీపీ అబిద్, యాక్షన్ డైరెక్టర్లు: జేజే పెర్రీ, అన్బరివ్.

## 'పైసా డుమ్ డుమ్' సాంగ్ లాంచ్

నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న సినిమా 'గుర్రం పాపిరెడ్డి'. ఈ చిత్రాన్ని డా. సంధ్య గోలీ సమర్పణలో ప్రొడ్యూసర్స్ వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మిస్తున్నారు. డార్క్ కామెడీ కథతో ఇప్పటి వరకు మనం తెరపై చూడని కాన్సెప్ట్‌తో దర్శకుడు మురళీ మనోహర్ రూపొందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'గుర్రం పాపిరెడ్డి' సినిమా ఈ నెల 19న థియేట్రికల్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా 'గుర్రం పాపిరెడ్డి' సినిమా నుంచి 'పైసా డుమ్ డుమ్' సాంగ్ ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా హీరోయిన్ ఫరియా అబ్దుల్లా మాట్లాడుతూ.. 'గుర్రం పాపిరెడ్డి' టీమ్ అంతా ఒక కొత్త తరహా మూవీ చేసేందుకు ప్రయత్నించాం. బాగా టిపికల్ మూవీగా కాకుండా సినిమా అంతా మంచి ఫన్ ఉండేలా చూసుకున్నాం. నెక్స్ రాబోయో ప్రమోషనల్ కంటెంట్‌తో మిమ్మల్ని ఆకట్టుకుంటామని నమ్ముతున్నాం. ఈ కథ వినగానే నటించాలని అనిపించింది. కామెడీలోనే కొత్తగా కంటెంట్ క్రియేట్ చేయొచ్చు అని ఈ సినిమాలో నటించిన తర్వాత అనిపించింది.



## తీసుకున్నాం...

(మొదటి పేజీ తరువాయి)



అకాంక్షలను గుర్తించి, యుపిఎ ప్రభుత్వం డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రకటించిందని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్లలో (తెలంగాణ తల్లి విగ్రహాల నిర్మాణం పూర్తి కాని జిల్లాలు ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ములుగు, నల్లగొండ, నారాయణపేట్ మినహా) తెలంగాణ తల్లి విగ్రహాలను సిఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా మంగళవారం వర్చువల్‌గా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ యుపిఎ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ నేతృత్వంలోని ప్రధాని మన్మోహన్ సింగ్, హోం శాఖ మంత్రి చిదంబరం తెలంగాణ రాష్ట్ర ప్రక్రియను ప్రారంభించినట్లు ప్రకటించిన రోజు అని, నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షను ప్రతిబింబిస్తూ యుపిఎ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తెలంగాణ ప్రజలకు సంతోషాన్ని, ఆత్మ గౌరవాన్ని అందించిందని సిఎం అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రకటన చేసిన 'డిసంబర్ 9వ' తేదీకి ఉన్న ప్రధాన్యతను ప్రజా పాలన ఇందిరమ్మ ప్రభుత్వం గుర్తించిందని, అందుకే ఈ పర్వదినం రోజున తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవంగా జరుపుకోవాలని ప్రభుత్వం అధికారికంగా నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర పరిపాలనకు కేంద్రమైన సచివాలయంలో గత ఏడాది తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి, పరిపాలనలో స్ఫూర్తిని తీసుకొచ్చామని గుర్తు చేశారు. రాష్ట్ర పరిపాలనలో, సంక్షేమ, అభివృద్ధి, కార్యక్రమాల్లో సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్ విజన్ అమలవుతుందన్నారు. ఆరు దశాబ్దాల ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని గుర్తు చేశారు. సోనియా గాంధీ ఎన్నో అడ్డంకులను అధిగమించి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం, తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చిన సోనియా గాంధీ జన్మదిన ఉత్సవాలను జరుపుకుంటామన్నారు. రాష్ట్రంలోని 27 జిల్లా కలెక్టరేట్లలో తెలంగాణ తల్లి విగ్రహాలను ఆవిష్కరించడం పట్ల సిఎం హర్షం వ్యక్తం చేశారు.

## ఫిబ్రవరిలో దేశవ్యాప్త సమ్మె

### కార్మిక కోడ్‌ల రద్దు వరకు దశలవారీగా పోరు ఉధృతం
### కేంద్ర కార్మిక సంఘాల ప్రకటన

**న్యూఢిల్లీ:** కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లను రద్దు చేసేంత వరకు విశ్రమించేది లేదని, ఉద్యమాన్ని దశాలవారీగా ఉధృతం చేస్తామని కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక ప్రకటించింది. ఉద్యమం తొలి దశలో భాగంగా వచ్చే ఏడాది ఫిబ్రవరిలో దేశవ్యాప్త సమ్మె చేపట్టబోతున్నట్లు తెలిపింది. ఇందుకు తేదీని ఈనెల 22న జరగబోయే సమావేశంలో నిర్ణయించి, ప్రకటిస్తామని పేర్కొంది. ఇదే క్రమంలో ఈనెల 26న జరగబోయే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మిక లోకానికి మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది. కార్పొరేట్లకు, యాజమాన్యాలకు లబ్ధి కలిగించే పద్ధతులు అనుసరిస్తూ సర్కారు చేసే తప్పుడు ప్రచారాన్ని బహిర్గతం చేస్తామని కార్మిక సంఘాలు హెచ్చరించాయి. ఎంఎస్‌పీ, పంట రుణ మాఫీ తదితర కనీస డిమాండ్ల కోసం పోరాడుతున్న సంయుక్త కిసాన్ మోర్చాతో సమన్వయం చేసుకొని తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నాయి. తమ పోరాటానికి ప్రతిపక్ష పార్టీలతో పాటు అన్ని వర్గాల ప్రజల మద్దతును కోరాయి. కార్మిక సంఘాల ఐక్య వేదిక సోమవారం భేటీ అయి ప్రస్తుత పరిస్థితులను సమీక్షించింది. కార్మిక కోడ్‌లను అన్ని ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకించడాన్ని స్వాగతించింది. ఇండిగో సంక్షోభం, ప్రయాణికుల ఇక్కట్లు, వర్కర్లకు భద్రత లేకపోవడం, కార్పొరేట్ల దురహంకారం వంటి అంశాలను ప్రస్తావించింది. ప్రైవేటీకరణ, గుత్తాధిపత్యం వల్ల కలిగే నష్టం గురించి ముందే హెచ్చరించినట్లు తెలిపింది. ఇండిగో సంక్షోభంపై ఆందోళన వ్యక్తంచేస్తూ జ్యుడిషియల్ విచారణకు, బాధ్యులపై చర్యలకు, బాధితులకు పరిహారం కోసం డిమాండ్ చేసింది. ఇలాంటి అనుభవాల నుంచి ప్రభుత్వం పాఠాలు నేర్చుకోవాలని హితవు పలికింది. విద్యుత్, పెట్రోలియం, రైల్వే, రక్షణ, టెలికం, బ్యాంకింగ్ వంటి వ్యూహాత్మక రంగాల ప్రైవేటీకరణకు హడావిడి చర్యలు మానుకోవాలని సూచించింది. కార్మిక కోడ్‌లను రద్దు చేసేంత వరకు దశాల వారీగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని కార్మిక సంఘాల ప్రకటన పేర్కొంది. జాతాలు, ర్యాలీలు, ఇంటింటి ప్రచారం వంటి వివిధ రూపాల్లో పోరాటాన్ని సాగించేందుకు కార్యాచరణ వారంలోగా సిద్ధం చేసుకోవాలని సమావేశం నిర్ణయించింది.

## అజయ్‌భవన్ సీనియర్ రెడ్‌గార్డ్ కామ్రేడ్ అమ్రీక్ సింగ్ ఆకస్మిక మృతి



**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని సిపిఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో సీనియర్ రెడ్ గార్డ్ కామ్రేడ్ అమ్రీక్ సింగ్ (76) ఆకస్మిక మరణం పట్ల సిపిఐ సంతాపం వ్యక్తం చేసింది. ఆదివారం రాత్రి ఛాతిలో ఇబ్బందిగా ఉండడంతో కుటుంబసభ్యులు ఆయనను ఆసుపత్రిలో చేర్చగా సోమవారం సాయంత్రం ఆయన మరణించారు. పంజాబ్‌లోని అమృత్‌సర్ జిల్లాకు చెందిన అమ్రీక్ సింగ్ నాలుగున్నర దశాబ్దాలకు పైగా పార్టీకి అంకితభావంతో సేవలు అందించారు. సిపిఐ కేంద్ర కార్యాలయంతో ఆయనకు ఉన్న సుదీర్ఘ అనుబంధం కారణంగా జాతీయ స్థాయిలో పార్టీ నాయకులతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న కార్యకర్తలతో సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. అంతే కాకుండా అనేక ముఖ్య రాజకీయ ఘటనలకు ఆయన సాక్షిగా నిలిచారు. కమ్యూనిస్టు దిగ్గజం చంద్ర రాజేశ్వరరావు ప్రధాన కార్యదర్శిగా ఉన్న సమయం నుంచే ఆయన అజయ్ భవన్‌లో పని చేయడం ప్రారంభించారు. అంతకు ముందు ఆయన ట్రేడ్ యూనియన్‌లో చురుకైన కార్యకర్తగా పని చేశారు. అమ్రీక్ సింగ్ క్రమశిక్షణ, పార్టీ అపారమైన ప్రేమ కలిగి ఉండేవారు. ఢిల్లీకి ఎవరు వెళ్ళినా ఆత్మీయంగా పలకరించి స్వాగతం పలికేవారు. హృదయపూర్వక, ఉల్లాసభరితమైన స్వభావం, స్వాగతించే ఉనికికి ప్రసిద్ధి చెందారు. సిపిఐ ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు సహచరులకు ఒక ప్రకటనలో హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేసింది. అజయ్‌భవన్‌లో నిర్వహించిన సంతాప సభలో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శివర్గ సభ్యులు అమర్‌జీత్ కౌర్, రామకృష్ణ పాండా, డాక్టర్ కాంగో ఆయనకు నివాళి అర్పించారు.

## కొనసాగాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

కూడిన ధర్మాసనం పోల్ ప్యానల్‌కు సూచించింది. 'ఎస్ఐఆర్‌కు సహకరించకపోవడం, బిఎల్ఒల పనికి ఆటంకాలు కలిగించడం, బెదిరించడం వంటి ఘటనలను మా దృష్టికి తీసుకురండి. మేము వారికి తగిన ఉత్తర్వులు జారీ చేస్తాం' అని ఇసి తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీకి ధర్మాసనం చెప్పింది. రాకేశ్ ద్వివేదీ తన వాదనలు వినిపిస్తూ, 'పరిస్థితి మరింత తీవ్రమైతే, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని పోలీసులను తమ డిప్యుటేషన్ కిందకు తీసుకురావడం తప్ప ఇసికి మరో మార్గం లేదని' అన్నారు. అయితే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు పోలీసులను ఇసి తన అధికార పరిధిలోకి తీసుకోలేదని జస్టిస్ బాగ్చి స్పష్టం చేశారు. దీనితో ఎస్ఐఆర్ విధులు నిర్వహిస్తున్న బిఎల్ఒలు, ఇతర అధికారులను బెదిరింపులకు గురిచేసినప్పుడు, అలాంటి సమస్యలను పరిష్కరించడానికి ఎలక్షన్ కమిషన్‌కు అన్ని రాజ్యాంగ అధికారాలు ఉన్నాయని రాకేశ్ ద్వివేది అన్నారు. ఎలాగైనా పరిస్థితులను చక్కదిద్దండి లేకపోతే అది అరాచకానికి దారితీస్తుంది. ఇది తీవ్రమైన సమస్య అని సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఇక బెంగాల్‌లో తీవ్ర ఒత్తిడికి గురికావడం వల్లే బిఎల్ఒలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారనే వాదనను రాకేశ్ ద్వివేదీ తోసిపుచ్చారు. బిఎల్ఒలు ఒత్తిడికి గురవుతున్నారనే ప్రశ్నే లేదని పేర్కొన్నారు. ఎందుకంటే బిఎల్ఒలు రోజుకు 6 లేదా 7 ఇళ్లను, 30 నుంచి 35 మంది ఓటర్ల వివరాలను మాత్రమే తీసుకుంటారని చెప్పారు. దీనితో 'బిఎల్ఒలు చేసేది డెస్క్ పని కాదు. వాళ్లు ఇంటింటికీ వెళ్లి, ఎన్యూమరేషన్ ఫారమ్‌లను నింపాల్సి ఉంటుంది. ఆపై దానిని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇది పైకి కనిపించేంత సులభమైన పనికాదు' అని జస్టిస్ బాగ్చి అన్నారు. ఇక పిటిషనర్ సనాతని సంసద్, ఇతరుల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది వి.గిరి తన వాదనలు వినిపిస్తూ, ఎస్ఐఆర్ పని చేస్తున్న బిఎల్ఒలను, ఇతర అధికారులను హింసిస్తున్నారని, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అంతేకాదు వారిని రక్షించాలని ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

## ఉద్యోగాలొస్తాయ్

(మొదటి పేజీ తరువాయి)

డేటా సెంటర్స్, అంతర్జాతీయ స్థాయి ఉన్నత విద్యా సంస్థల జిల్లాలుగా మొత్తం ఆరింటిని నెలకొల్పనున్నట్టు శ్రీధర్ బాబు చెప్పారు. ఇక్కడ ఏర్పాటయ్యే వివిధ పరిశోధన సంస్థలు, గ్రీన్ ఫార్మా, మ్యాన్యుఫాక్చరింగ్, ఎంటర్ టెయిన్ మెంట్ జోన్ల ద్వారా మొత్తం 13 లక్షల మందికి ఉద్యోగాలు దొరుకుతాయి. 9 లక్షల జనాభా కోసం నివాస గృహాల సముదాయాలు ఏర్పాటు చేస్తాం. నిర్మాణ రంగంలో ఉన్నవారు వీటిని అభివృద్ధి చేస్తారు. మరో నెల రోజుల్లో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. డేటా సెంటర్ల కోసం 400 ఎకరాలు కేటాయిస్తున్నాం. వచ్చే ఫిబ్రవరి చివరలో ఇక్కడ నిర్మాణాలు మొదలవుతాయి. ఎంటర్ టెయిన్ మెంట్ జోన్ (డిస్ట్రిక్ట్ )లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కన్ వెన్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం. అడ్వెంచర్ కేంద్రాలు, స్టార్ హోటళ్లు నిర్మిస్తాం. ఫ్యూచర్ సిటీ అంతా ఒక ఆర్కిటెక్చరల్ అద్భుతంగా నిలుస్తుంది. భవిష్యత్తు అవసరాలకు సరిపోయే అత్యాధునిక రవాణా వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. అర్బన్ ఫారెస్టులతో అంతా పచ్చదనం పర్చుకుని కనిపిస్తుంది. వంతారా వన్య ప్రాణుల సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి రిలయన్స్ ఫౌండేషన్ ఒప్పందం కుదుర్చుకుంది.సిఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా ఈ జీరో కార్బన్ సిటీ ప్రపంచంలోనే ప్రఖ్యాత నగరంగా భాసిల్లుతుంది. ఇక్కడ కురిసే ప్రతి వర్షం చుక్క ఇక్కడే ఇంకిపోయేలా రెయిన్ హార్వెస్టింగ్ జరుగుతుంది. భూగర్భ జలాలకు కొదవ లేకుండా చేస్తాం.లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో నూతన పరిశోధనలు, మ్యాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రాలు ఉంటాయి.

## రాష్ట్రానికి రండి..

(మొదటి పేజీ తరువాయి)

ఒక నిజం స్పష్టంగా నిలుస్తుందని చెప్పారు. యుఎస్‌డి 200 బిలియన్, జిఎస్‌డిపి, 37 శాతం ఇన్వెస్ట్‌మెంట్ రేటుతో సంవత్సరానికి యుఎస్‌టి70–75 బిలియన్ తెచ్చినా, ఇప్పటీ కూడ యుఎస్‌డి 30 బిలియన్ పెట్టుబడి లోటు ఉంది, ఈ వ్యత్యాసం వేగంగా పెరుగుతోందన్నారు. ఈ లోటును పూడ్చేందుకు కోర్ అర్బన్ (క్యూర్) ఫెరీ అర్బన్ (ప్యూర్), రూరల్ అగ్రి(రేర్) జోన్ల అభివృద్ధికి పిపిపిలు ఇంధనంగా పనిచేస్తాయని డిప్యూటీ సిఎం వివరించారు. మెట్రోలు, సోలార్ పార్కులు, స్కిల్ హబ్‌లు వంటి రంగాల్లో ప్రైవేట్ పెట్టుబడులకు మార్గం వేస్తూ, మానవాభివృద్ధి మరియు నెట్ జీరో లక్ష్యాలకు ప్రభుత్వ నిధులను కేటాయించే అవకాశం పిపిపి లు ఇస్తాయని తెలిపారు. పెట్టుబడులకు హైదరాబాద్ స్వర్గధామమని, రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణం,తక్కువ ధరకు నైపుణ్యంతో కూడిన స్కిల్ లేబర్, శాంతి భద్రతలు, ఇన్వెస్టర్ ఫ్రెండ్లీ గవర్నమెంట్ వంటి అనేక సానుకూల అంశాలు ఉన్నాయని వివరించారు. చర్చా గోష్టిలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తాన్య, ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్ డైరెక్టర్ మోయ ఒకా, బ్లాక్ స్టోన్ కంపెనీ ఎండి మోహిత్ అరో, క్యాపిటల్ ల్యాండ్ ట్రస్ట్ సిఈఒ గౌరీ శంకర్ నాగభూషణం, పిపిపి అడ్వైజరీ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ హర్ష చాందిని తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతాయి.

**పదవ తరగతి పరీక్షలకు నెల రోజులా? : ఎస్‌టియు టియస్**

ఎస్ఎస్‌సి పరీక్షలు నెల రోజులకు పైగా నిర్వహించడం సరికాదని ఎస్‌టియు టియస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.సదానందం గౌడ్, జుట్టు గజేందర్ ఒక ప్రకటనలో ఆక్షేపణ తెలిపారు. వచ్చే ఏడాది మార్చి 14 నుంచి ఏప్రిల్ 16వ తేదీ వరకు 33 రోజుల పాటు ఈ పరీక్షలు నిర్వహించటం ప్రయోగం చేస్తున్నట్లుగా ఉందన్నారు. అలాగే పరీక్షలను సిబిఎస్ఇ తరహాలో నిర్వహించాలనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనబడుతున్నదని అన్నారు. సుదీర్ఘ కాలం పరీక్షలు నిర్వహించటం పట్ల విద్యార్థులు ఆందోళన చెందుతారని, పరీక్షల టైమ్ సవరించి, పది రోజుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రశ్నా పత్రాలు భద్ర పరచడం, మూల్యాంకన ప్రక్రియలపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఏప్రిల్‌లో ఎండలు తీవ్రంగా ఉండడంతో విద్యార్థులు పరీక్షలు రాయడంలో ఇబ్బంది పడతారన్నారు. ఇది సరైన విధానం కాదన్నారు.

### టెన్త్ పరీక్షలు షెడ్యూల్ :

| తేదీ | సబ్జెక్టు | సమయం |
|---|---|---|
| 14.03.26 | ప్రథమ భాష (గూప్) 1 | 9.30 నుంచి 12.30 గంటలు |
| | ప్రథమ భాష పార్ట్1 | 9.30 నుంచి 12.50 గంటలు |
| 18.03.26 | ద్వితీయ భాష | 9.30 నుంచి 112.30 గంటలు |
| 23.03.26 | తృతీయ భాష (ఇంగ్లీష్) | 9.30 నుంచి 12.30 గంటలు |
| 28.03.26 | గణితం | 9.30 నుంచి 12.30 గంటలు |
| 02.04.26 | సైన్స్ పార్ట్1 (ఫిజికల్ సైన్స్) | 9.30 నుంచి 11.00 గంటలు |
| 07.04.26 | సైన్స్ పార్ట్2 (బైయాజికల్ సైన్స్) | 9.30 నుంచి11.00 గంటల |
| 13.04.26 | సాంఘీక శాస్త్రం | 9.30 నుంచి 12.30గంటలు |
| 15.04.26 | ఓఎస్ఎస్‌సి పేపర్1 | 9.30 నుంచి 12.30 గంటలు |
| | ఎస్ఎస్‌సి ఒకేషనల్ (త్రిరీ) | 9.30నుంచి 11.30 గంటలు |
| 16.04.26 | ఓఎస్ఎస్‌సి పేపర్2 | 9.30 నుంచి12.30గంటలు |

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com